రెవెన్యూ రికార్డులు
పన్నుల వసూలుకే..



3

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 7 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 121 | పేజీలు:12 | వెల రూ.5

## మెట్ గాలాలో తళుక్కుమన్న మేఘా సుధారెడ్డి

**ఆమె మెడలో రూ. 142 కోట్ల డైమండ్ నెక్లెస్?**

హైదరాబాద్,మే 6(మనం న్యూస్)ః ఫోర్బ్స్ ప్రపంచ సంపన్నుల జాబితాలోకి ఎక్కిన మేఘాకృష్ణారెడ్డి భార్య మేఘా సుధారెడ్డి మంగళవారం న్యూయార్క్ లో జరిగిన 2026 మెట్ గాలాలో సందడి చేశారు. ప్రత్యేకమైన డ్రెస్ లో ర్యాంప్ వాక్ చేస్తూ తన లుక్‌తో

...మిగతా 2లో



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

## మే 6.. దేశ చరిత్రకు 'సిందూర్' అద్దిన రోజు

### 'ఆపరేషన్'తో శక్తియుక్తులను ప్రపంచానికి చాటి చెప్పిన భారత్

ఢిల్లీ, మే 6 : మే 6.. తెల్లవారితే 7..2025 అర్ధరాత్రి.. పాకిస్తాన్ పై భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో విరుచుకుపడింది. కశ్మీర్లోని పహల్గాంలో అమాయక టూరిస్టులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులు, టెర్రరిస్టు తండాలను క్షిపణులతో తుదముట్టించింది. ఈ దాడితో భారత సైనిక సామర్థ్యం ఏంటో ప్రపంచానికి చాటిచెప్పడం మాత్రమే కాదు.. దేశ భద్రత విషయంలో మన నియమాలను పునర్నిర్వచించుకున్నామని, పరిమితులు/హద్దులు మార్చుకున్నామనే శత్రువుకు గట్టి

...మిగతా 2లో




## మెట్రో ఫేజ్-2కు అనుమతివ్వండి

**ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి**

### ఎయిర్‌పోర్ట్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను చేపట్టండి

### కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి



హైదరాబాద్, మే 6 (మనం బ్యూరో) : హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రణాళికను రూపొందించి ఇప్పటికే డీపీఆర్‌ను సమర్పించామని గుర్తు చేశారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విస్తరణ సజావుగా సాగాలన్న ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం ఎల్అండ్‌టి నుంచి స్వాధీనం చేసుకుందని చెప్పారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండటంతో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సులువవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ నెట్వర్క్‌ను విస్తరించేందుకు గాను ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ.ల మేర విస్తరణకు రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించినందున ఫేజ్-2 ప్రాజెక్టును భారత ప్రభుత్వం-తెలంగాణ ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీజీ ఎయిర్‌పోర్ట్-భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలనీ, దీనికి సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహ నిర్మాణ,పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నా కాన్వాయ్ కోసం ట్రాఫిక్ ఆపొద్దు

### డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

### పోలీస్ కమిషనర్‌లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

### త్వరలోనే 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు

2



ట్రాఫిక్‌లో సింగిల్ లైన్ పాటించాలని డీజీపీ ఆదేశాలు

## కౌన్ బనేగా బెంగాల్ సీఎం?

### రేసులో పలువురు కొత్తవారు

### నేటి సాయంత్రం ఎన్డీయే ఎల్పీ సమావేశం

### కొత్త సీఎం ప్రమాణ స్వీకార ముహూర్తం మాత్రం 9నే!

కొల్‌కతా, మే 6 : పశ్చిమ బెంగాల్లో ఓటర్లు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. దీంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తుంది. 9వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరుతుందని ప్రకటనలు వెలువడ్డాయి. అయితే, ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపైనే ఆసక్తి నెలకొంది. పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. అయితే పశ్చిమ బెంగాల్ రాజకీయాలకు సంబంధించిన కీలక పరిణామం చోటు చేసుకుంది. 9వ తేదీ (శనివారం) ముఖ్యమంత్రి

...మిగతా 2లో

**ఒన్ షాట్.. టూ బర్డ్స్..**

## రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న


### తక్కువ ధరకే పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆలోచన

### రైతులకు మద్దతు ధర.. పేదలకు పౌష్టికాహారం

### మధ్య దళారుల ఆటకట్టు..

హైదరాబాద్, మే 6 : రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం మరోసారి భరోసానిచ్చింది. మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, సేకరించిన ధాన్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు రేషన్ దుకాణాల ద్వారా నేరుగా పేద ప్రజల చెంతకు చేర్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ పంటలను

...మిగతా 2లో



## నామినేటెడ్ పోస్టుల భర్తీ

### 17 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

### అప్పుడే అయిపోలేదు.. జూలైలో మరికొందరికిస్తం : పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్, మే 6 (మనం బ్యూరో) : ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు వైస్ చైర్మన్లను నియమించింది. ఈమేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జూలైలో చేపడతామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. ప్రభుత్వం నియమించిన కార్పొరేషన్ చైర్మన్ల వివరాలు : బ్రాహ్మణ సంక్షేమ పరిషత్-బస్వరాజు శ్రీనివాస్, కమ్మ కార్పొరేషన్-బండి రమేశ్, వాల్మీకి బోయ కార్పొరేషన్ : గట్టు తిమ్మప్ప, యాదవ కార్పొరేషన్ చైర్మన్ : రఘునాథ్ యాదవ్,

...మిగతా 2లో

## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

### కాంగ్రెస్ హయాంలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మే 06, (మనం బ్యూరో): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. రైతులను అయోమయంలో పడేసేందుకు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో దిగుబడి జరిగిందన్నారు. దేశం మొత్తంలోనే రికార్డ్ స్థాయిలో కొనుగోళ్లు, దిగుబడి జరిపింది రాష్ట్రంలోనేననీ, ఈ రబీ సీజన్‌లో 67 లక్షల ఎకరాలలో వరి సాగు జరుగుతోందనీ, దీంతో 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం మొత్తం 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందనీ, ఇందుకోసం రైతులకు రూ.2310 కోట్లు చెల్లించిందని వెల్లడించారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు గాను రూ.21 వేలు కేటాయించామనీ, కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల అంశంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు గాను 2.63 లక్షల టార్పాలిన్లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, 18.75 కోట్ల గన్ని

...మిగతా 2లో




## మాట తప్పితే... కట్టేసి రాళ్లతో కొట్టండి

ఉచిత విద్యా, వైద్యంపై తగ్గేది లేదు

ఇచ్చిన మాట ఎప్పటికీ తప్పను

ఫీజుల నియంత్రణ చట్టం ఈ నెలలోనే తేవాలి

బీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

2



## సీపీ సుమతి స్పెషల్ ఆపరేషన్

పోకిరీల పనిపట్టేందుకు మారువేషం

అర్ధరాత్రి బస్టాప్‌లో పోకిరీల ఆటకట్టు

3



## అర్ధరాత్రి టీఎంసీ ఆఫీసుపైకి బుల్డోజర్..

### కోల్‌కతాలో హైటెన్షన్



9

**అందినట్టే అందిన సీఎం పీఠం**

## విజయ్ నేటి ప్రమాణ స్వీకారం రద్దు?

### ఆసక్తి రేపుతున్న తమిళనాడు రాజకీయాలు

### మలుపులు.. ట్విస్టులతో పార్టీల పాకులాట



చెన్నై, మే 6 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆ రాష్ట్ర రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం నేడు జరుగుతుందని అందరూ భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆ కార్యక్రమం వాయిదా పడింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ 118 ఎమ్మెల్యేల మద్దతును నిరూపించుకోవడంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందుల వల్ల ఈ

...మిగతా 2లో

## వలసదారులపై ట్రంప్ ఆంక్షలు వ్యక్తిగతమే

### సర్వేలో వెల్లడించిన అమెరికన్లు




వాషింగ్టన్, మే 6 : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశంలోకి వస్తున్న వలసలపై ఉక్కుపాదం మోపుతూ.. కఠినమైన నిర్ణయాలు తీసుకున్న విషయం పాఠకులకు విదితమే. ట్రంప్ వలస విధానాలపై చాలామంది అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఆయన చేపట్టిన వలస విధానాలు వ్యక్తిగతమేనని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు వలసదారులకు గొప్పదేశంగా ఉన్న అగ్రరాజ్యం ఇకపై ఆ విధంగా ఉండబోదని భావిస్తున్నారు. అక్రమ వలసల పేరుతో ట్రంప్ తీసుకుంటున్న కఠిన చర్యలు

...మిగతా 2లో

## పోప్‌తో ట్రంప్ 'కజ్జాలు'

**ఇరాన్‌కు సాయం చేస్తున్నారని ఆరోపణ**



వాషింగ్టన్, మే 6 : వలసదారులను అగౌరవపరచకూడదనే తన వ్యాఖ్యల ద్వారా పోప్ లియో ఇరాన్కు సాయం చేస్తున్నారని, ప్రపంచాన్ని అభద్రతలోకి నెట్టేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

...మిగతా 2లో

## అమెరికా నౌకలపైకి డాల్ఫిన్లు ప్రయోగించనున్న ఇరాన్

### ఆందోళనలో అమెరికా సైన్యం



టెహ్రాన్, మే 6 : అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు తమ యుద్ధనౌకలు జలసంధిలోకి వెళతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ క్రమంలో అగ్రరాజ్య యుద్ధ నౌకల పైకి మైన్లను మోసుకెళ్లే డాల్ఫిన్లను ప్రయోగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఇరాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రకటన ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేసింది. చివరకు దానిపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పందించాల్సి వచ్చింది.

అమెరికా వద్ద కామికాజి డాల్ఫిన్లు (ఆత్మాహుతి డాల్ఫిన్లు) ఉన్నాయా..? లేదా..? అనే అంశాన్ని తాను కచ్చితంగా చెప్పలేనని హెగ్సెత్ వెల్లడించారు. అయితే, ఇరాన్ వద్ద మాత్రం అలాంటివి ఏవీ లేవని చెప్పారు. మరోవైపు ఛైర్మన్ ఆఫ్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కథనాలను తోసిపుచ్చారు.

ప్రతిధ్వనుల సాయంతో నీటి అడుగున వస్తువుల జాడను (సోనార్) డాల్ఫిన్లు స్పష్టంగా

...మిగతా 2లో

# నా కాన్వాయ్ కోసం ట్రాఫిక్ ఆపొద్దు

**హైదరాబాద్,మే 6(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్‌కు ఆదేశాలు జారీ చేశారు. తన ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్ట్ మార్గంలో ఏర్పడిన భారీ ట్రాఫిక్ జామ్‌పై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం సామాన్య ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని, ఎదురుగా వచ్చే వాహనాలను ఆపి ఇబ్బంది పెట్టవద్దని ఆయన సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో డీజీపీ సి.వి.ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి త్వరలోనే ప్రత్యేకంగా 'ట్రాఫిక్ బ్యూరో'ను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు.

**సింగిల్ లైన్ :**

సీఎం, వీఐపీ కాన్వాయ్‌లు వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా, సింగిల్ లైన్‌లో వాహనాలను అనుమతించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని డీజీపీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ఈ సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయ పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని కఠినంగా నివారించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అనేది కేవలం ట్రాఫిక్ విభాగం బాధ్యత మాత్రమే కాదని, శాంతిభద్రతల విభాగం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని డీజీపీ ఆదేశించారు. ఐఎస్‌డబ్ల్యూ , సీఎస్‌బ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు ట్రాఫిక్ పరిస్థితిని బట్టి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని, సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉన్నతాధికారులు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# మే 6.. దేశ చరిత్రకు 'సిందూర్' అద్దిన రోజు

(మొదటి పేజీ తరువాయి)

సందేశమిచ్చింది.

**88 గంటలు భయపెట్టి..**

2025 ఏప్రిల్ 22న పహల్గాంలోని పర్యాటక ప్రాంతంపై విరుచుకుపడిన ముష్కరులు 26 మంది అమాయకులను పొట్టన పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనతో యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైంది. ఈ దాడి వెనుక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఉగ్రముఠాల హస్తం ఉందని నిర్ధరించుకున్న భారత సైన్యం.. సమయం చూసి దాయాదిపై నిప్పులు కురిపించింది. మే 6-7 తేదీ అర్ధరాత్రి పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు జరిపింది. పాక్, పీఓకేలోని 9 కీలక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బాంబులు ప్రయోగించింది. జైషే మహ్మద్, లష్కరే తయ్యిబాకు చెందిన కీలక స్థావరాలను మట్టికరిపించి భారీ విజయం సాధించింది. ఈ ఘటనతో దాయాది పాకిస్తాన్ ఉలిక్కిపడింది. ఆ తర్వాత ప్రతిదాడులకు పాల్పడింది. వాటిని మన సైన్యం సమర్థంగా తిప్పికొట్టడమే గాక.. పాక్కు చెందిన కీలక వైమానిక స్థావరాలపైనా కోలుకోలేని దెబ్బకొట్టింది. దాదాపు 88 గంటల భీకర ఆపరేషన్ తో శత్రుదేశం కాళ్లబేరానికి రాకతప్పలేదు. దీంతో మే 10వ తేదీ సాయంత్రం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో 'ఆపరేషన్ సిందూర్' నిలిచింది.

**సంయమనం కాదు.. సమరమే..**

ఉగ్రవాదంపై పోరాటం విషయంలో భారత్ తమ హద్దులను పునర్నిర్వచించుకున్నట్లయ్యింది. వ్యూహాత్మక సంయమనం కాదు.. అవసరమైతే సమరమే అని మన దేశం చాటిచెప్పింది. ప్రత్యర్థి అణు బెదిరింపులను తిప్పికొట్టగలమని, భవిష్యత్తులో ఇలాంటి ముప్పులు ఎదురైతే అత్యంత వేగంగా స్పందించగలమని నిరూపించింది.

**నారీశక్తికి నిదర్శనం..**

ఇక, ఈ ఆపరేషన్లో మహిళా అధికారులు కూడా కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలోనే మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కూడా భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు మహిళా అధికారులు కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వెల్లడించడం అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించింది. నారీ శక్తి, మహిళా నాయకత్వానికి ప్రతీకగా కేంద్రం మీడియా బ్రీఫింగ్ కోసం వీరిని ఎంచుకుంది.

**'సిందూర్' నేర్పిన పాఠాలు..**

మన సైనిక దళాల సంయుక్త కృషితో 'ఆపరేషన్ సిందూర్'లో భారత్ అద్భుతమైన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే, భవిష్యత్తులో యుద్ధాలు కేవలం గగనతలానికి మాత్రమే పరిమితం కావని ఈ మిలిటరీ ఆపరేషన్ తో స్పష్టమైందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

సైబర్ వార్ ఫేర్ తో పాటు విభిన్న వ్యూహాలపై మనం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. 'సిందూర్' సమయంలో శత్రుదేశం నుంచి ముంచుకొచ్చిన డ్రోన్లను మనం సమర్థంగా ఎదుర్కొన్నాం. అదే సమయంలో సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన అసత్య ప్రచారాన్ని కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇలాంటి తప్పుడు సమాచారాల వ్యాప్తితో బలగాలతో పాటు దేశ పౌరుల ఆత్మస్థైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారు.

**శత్రువు స్మార్ట్ అయితే..**

''సిందూర్ వేళ పాకిస్థాన్ కుప్పలుతెప్పలుగా డ్రోన్లను ప్రయోగించింది. వాటన్నింటిని మనం నేలకూల్చాం. కానీ, ప్రతిసారీ ఇలాగే జరగకపోవచ్చు. శత్రువు స్మార్ట్ అయితే.. మరోసారి ప్రమాదకర డ్రోన్లను ప్రయోగించే ప్రమాదం ఉంది. అలాంటి వాటిని గుర్తించి అడ్డుకోవడం కష్టతరం కావొచ్చు. అందుకే యాంటీ డ్రోన్ సామర్థ్యాలను మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉంది'' అని ఎయిర్ కమాండర్ గౌరవ్ ఎం. త్రిపాఠి (రిటైర్డ్) పేర్కొన్నారు. ఈ ఆపరేషన్లో కమాండర్ త్రిపాఠి కీలక పాత్ర పోషించారు.

# మాట తప్పితే... కట్టేసి రాళ్లతో కొట్టండి

**హైదరాబాద్,మే 6(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లోనూ పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తేల్చి చెప్పారు. తాను ఇచ్చిన మాటను తప్పితే అమరుల స్థూపం స్తంభానికి తనను కట్టేసి రాళ్లతో కొట్టాలన్నారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య-ఫీజుల నియంత్రణ అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్య, వైద్యం కోసమే తెలంగాణలో ప్రతీ కుటుంబం 70 శాతం ఖర్చు చేసే పరిస్థితి ఉన్నదని అన్నారు. 1,200 మంది ప్రాణ త్యాగం చేసి.. ఎంతో మంది విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఒక సంవేదనతో పాలన చేయాల్సి ఉండేనని చెప్పారు. కానీ.. ఆ పని జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ కోసం తిరుపతిరావు కమిషన్ వేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఆ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌పై ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం అందించడాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావిస్తే వాటిని ఉచితంగా అందించడం సాధ్యమేనని చెప్పారు. కానీ.. ప్రస్తుత ప్రభుత్వం ఆ బాధ్యత నుండి తప్పుకుని ప్రజలను వారి కర్మకు వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టటంలో సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు ఈ నెలలోనే చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

**విద్యా సంస్థల దోపిడీ :**

రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీతో పాటు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో అవినీతిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కే కుట్రలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు.

# రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ మార్కెట్లో వేలం వేసి మధ్యవర్తులకు లాభం చేకూర్చకుండా, సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపుల లో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

**రైతు ప్రయోజనమే పరమావధి..**

పంట పండించిన రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో మొక్కజొన్న, జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు ఈ పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**మధ్యవర్తుల దోపిడీకి చెక్ - పేదలకు మేలు...**

సాధారణంగా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో వేలం వేస్తుంది. దీన్ని అదునుగా తీసుకుని మధ్యవర్తులు తక్కువ ధరకే దక్కించుకుని లాభపడుతుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, సేకరించిన ధాన్యాన్ని ప్యాకింగ్ చేయించి నేరుగా ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 'ధాన్యం కేవలం మార్కెట్ సరుకుగా మిగిలిపోకూడదు.. అది పేదవాడి ఆకలి తీర్చి, పౌష్టికాహారంగా మారాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**గురుకులాలు, హాస్టళ్లకు పౌష్టికాహారం...**

ప్రభుత్వ నిర్ణయం వల్ల కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా మొక్కజొన్న, జొన్నల సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు పౌల్ట్రీ రైతులకు అవసరమైన మేరకు కూడా సరఫరా చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం పట్ల రైతులు, సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పోప్‌తో ట్రంప్ 'కజ్జాలు'

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండటం సబబేనని పోప్ అంటున్నారని, అది అంత మంచిది కాదని, ఆయన క్యాథలిక్కులను ప్రమాదంలో పడేస్తున్నారని స్పష్టం చేశారు. సోమవారం ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పోప్, ట్రంప్ మధ్య తలెత్తిన ఘర్షణను నివారించేందుకు విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇటీవల వాటికన్ను సందర్శించిన నేపథ్యంలో ట్రంప్ మరోసారి విమర్శలు చేయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

# నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

వడ్డెర కార్పొరేషన్ : గుంజా రేణుక, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ : దూడెం వెంకటరమణ, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ : చరణ్ కౌశిక్ యాదవ్, తెలుగు అకాడమీ చైర్మన్-ప్రొ.వెంకట నారాయణ, గీత కార్మిక కార్పొరేషన్-చంద్రశేఖర్ గౌడ్, పెరిక కార్పొరేషన్-గొంగరి వెంకటేశ్వర్లు, వాషర్‌మెన్-డాక్టర్ అజయ్ కుమార్, మేర కార్పొరేషన్-సంగ వెంకట్ రాజం, మున్నూరు కాపు-బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మున్నూరు కాపు కార్పొరేషన్-బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, పద్మశాలి-గూడూరి శ్రీనివాస్, వెలమ-జువ్వాడి నర్సింగ్ రావు, భట్టరాజ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్-సిహెచ్ బాలరాజును ప్రభుత్వం నియమించింది. అలాగే, రాష్ట్ర గ్రామ పంచాయతీ ట్రైబ్యునల్ చైర్మన్‌గా సూదిని రామిరెడ్డి, సభ్యులుగా నగులూరి కృష్ణకుమార్, బూసా వేణుగోపాల్‌ను నియమించారు. కాగా, జూలైలో మరికొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# అమెరికా నౌకల పైకి డాల్ఫిన్లు ప్రయోగించనున్న ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించగలవు. ఈ సహజ లక్షణం కారణంగా శత్రువులు నీటి అడుగున దాడికి వినియోగించే వస్తువులు ఏమైనా పెట్టి ఉంటే వాటిని వెంటనే పసిగట్టగవు. డాల్ఫిన్‌లకు ఇటువంటి వాటిపై శిక్షణ ఇవ్వడమే కాకుండా ప్రత్యేకంగా రూపొందించిన పరికరాలు, కెమెరాలను అమర్చి సముద్రం అడుగున పరిస్థితులను పర్యవేక్షించవచ్చు. తద్వారా శత్రువుల కదలికలను ముందుగానే గుర్తించే ఆస్కారం ఉంటుంది.

శత్రుదేశాల జలాంతర్గాములను గుర్తించే సామర్థ్యాన్ని కలిగిన డాల్ఫిన్లను సోవియట్ యూనియన్ నుంచి ఇరాన్ కొనుగోలు చేసినట్లు గతంలో ప్రచారం జరిగింది. ప్రపంచ రవాణాకు కీలకమైన హర్మూజ్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న ఈ సమయంలో ఈ డాల్ఫిన్ల ఉదంతం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

# కౌన్ బనేగా సీఎం?

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమీక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు.

# విజయ్ నేటి ప్రమాణ స్వీకారం రద్దు?

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది

**రిసార్టు రాజకీయాల వేదికగా మహాబలిపురం**

గెలిచిన తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు టీవీకే అధిష్ఠానం 'రిసార్ట్ పాలిటిక్స్'కు తెరలేపింది. గెలిచిన 108 మంది ఎమ్మెల్యేలందరూ తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు మహాబలిపురం సమీపంలోని ఒక ప్రైవేట్ రిసార్టులోనే ఉండాలని పార్టీ అధిష్ఠానం కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఇతర పార్టీల నుంచి ప్రలోభాలు రాకుండా ఉండేందుకే విజయ్ ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. విజయ్ పార్టీకి కాంగ్రెస్ 5 సీట్లు మద్దతు ప్రకటించినప్పటికీ, ఇంకా 5 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరమవుతోంది. ఈ క్రమంలో మద్దతు కోసం వామపక్షాలను విజయ్ కోరగా, వారు ప్రస్తుతానికి నిరాకరిస్తూ డీఎంకే కూటమిలోనే కొనసాగుతామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో బలాన్ని నిరూపించుకునేందుకు విజయ్ గవర్నర్ను రెండు వారాల సమయం కోరిన విషయం తెలిసిందే

**పెద్ద సవాల్ గా చిన్న అడ్డంకులు**

మరోవైపు, టీవీకే ఎమ్మెల్యేలందరూ రిసార్టులోనే ఉండి తదుపరి వ్యూహంపై చర్చిస్తున్నారు. అటు ఏఐడీఎంకే ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టేందుకు కూడా చర్చలు జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మేజిక్ ఫిగర్ అందుకునే వరకు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించకూడదని పార్టీ నిర్ణయించింది. తమిళనాడులో తొలిసారిగా ఒక ప్రాంతీయ పార్టీ (టీవీకే) దశాబ్దాల కాలంగా ఉన్న డీఎంకే, ఏఐడీఎంకేల ఆధిపత్యానికి చెక్ పెట్టి అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, అధికారం చేపట్టే క్రమంలో ఈ చిన్నపాటి అడ్డంకులు విజయ్కు పెద్ద సవాల్గా మారాయి

**మిత్రపక్షాలన్నీ కలిస్తే మ్యాజిక్ ఫిగర్**

మరోవైపు డీఎంకే, ఏఐడీఎంకే కలిస్తే మ్యాజిక్ ఫిగర్ దాటుతోంది. డీఎంకే 59 స్థానాల్లో, అన్నాడీఎంకే 47 స్థానాల్లో గెలిచాయి. ఈ రెండు పార్టీలు కలిస్తే.. మెజార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 120కి చేరుతుంది. ఈ క్రమంలో ద్రవిడ పార్టీల ఉనికిని కాపాడుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ మద్దతు లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చన్న సంకేతాలొస్తున్నాయి. అందుకే డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల్లో ఉన్న వామపక్షాలు విజయ్ వైపు మొగ్గుచూపడం లేదని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి

# ట్రంప్ వల్లే నా సంసార జీవితంలో ఇబ్బందులు

**వాషింగ్టన్, మే 6 :** అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కారణంగా మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా సంసార జీవితంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయట. ట్రంప్ వల్ల ఒబామా తన భార్య, పిల్లలకు సమయం కేటాయించలేకపోతున్నారట. తాజాగా ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒబామా ఈ విషయాన్ని వెల్లడించారు. ట్రంప్ పరిపాలన సాగినంత కాలం క్రియాశీల రాజకీయాల్లో కొనసాగాలని ఒబామాపై డెమోక్రటిక్ పార్టీ ఒత్తిడి తీసుకొస్తోంది. దీంతో ఒబామా తన కుటుంబానికి సమయం కేటాయించలేకపోతున్నారు భర్త తన కోసం మరింత సమయం కేటాయించాలని ఆమె కోరుకుంటున్నారు.

# హైడ్రా.. పేదల ఇళ్లను కూల్చడానికేనా?

**నాదర్‌గుల్‌లో బడా బాబులు చెరువు కబ్జా చేస్తుంటే నిద్రపోతుందా?**

**కాంగ్రెస్ కనుసన్నల్లోనే నాదర్‌గుల్ 'కాసుబాగ్ కంచ' ప్రభుత్వ భూముల కబ్జా.**

**రియల్ మాఫియా, పోలీసుల దాడుల నుంచి రక్షించాలని హరీశ్ రావుకు రైతుల మొర**

**అధికారులకు ఫోన్ చేసి మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్ రావు.**

**రైతులకు వెంటనే న్యాయం చేయాలని కలెక్టర్, సీపీలకు డిమాండ్.**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం, నాదర్‌గుల్‌పరిధిలోని సర్వే నంబర్ 613 (119) కాసుబాగ్ కంచలో ఉన్న 373 ఎకరాల, వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా దాడులు, పోలీసుల వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ నాదర్‌గుల్ కు చెందిన వందలాది మంది రైతులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావుని కలిశారు. కబ్జాదారులు వేసిన కంచెలు, ధ్వంసమైన తమ వ్యవసాయ బోర్లు, దాడుల్లో గాయపడిన ఫొటోలు, వీడియోలను హరీశ్ రావుకు చూపించి తమ గోసను వెళ్లబోసుకున్నారు. రైతుల సమస్యలు విన్న హరీశ్ రావు తక్షణమే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..నాదర్‌గుల్ భూములు అన్యాక్రాంతం కాకుండా గతంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కింద హైకోర్టు వరకు న్యాయపోరాటం చేసిందని గుర్తుచేశారు. ఆ భూములు ప్రభుత్వానివే అని ప్రస్తుత ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిందన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల అండదండలతోనే ప్రైవేట్ వ్యక్తులకు ఈ భూములను ధారాదత్తం చేసే కుట్ర జరుగుతోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ భూములు, చెరువుల రక్షణ కోసమే హైడ్రా తీసుకొచ్చామని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి.. నాదర్గుల్ లోని వేల కోట్ల ప్రభుత్వ భూమి, అందులోని చెరువును రియల్ ఎస్టేట్ రాబందులు కబ్జా చేస్తుంటే ఎందుకు నిద్రపోతున్నారు? హైడ్రా కేవలం పేదల ఇళ్లను కూల్చడానికేనా? ప్రభుత్వ పెద్దల అండదండలతో ప్రభుత్వ భూములను, అందులోని చెరువులను, ఫీడర్ ఛానల్ ను ధ్వంసం చేస్తూ కంచెలు వేసి కబ్జా చేస్తున్న బడా రియల్ ఎస్టేట్ సంస్థల వైపు కన్నెత్తి చూసే దమ్ము హైడ్రాకు ఉందా? అని ధ్వజమెత్తారు.

రైతుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన హరీశ్ రావు.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సీపీ సజ్జనార్, స్థానిక ఆర్డీవో, ఎమ్మార్వోలకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. కలెక్టర్,ఆర్డీవోలతో హరీశ్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సీలింగ్ భూములకు కలెక్టర్, ఆర్డీవోలే కస్టోడియన్లుగా ఉంటారు. ఇది ప్రభుత్వ భూమి అని సుప్రీంకోర్టులో మీరే ఫైల్ చేశారు. ఇప్పుడు ప్రైవేట్ వాళ్లు కంచెలు వేస్తుంటే మీరెందుకు మౌనంగా ఉన్నారు.. వెంటనే ఆ కంచెలు తొలగించి, తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు మళ్లీ సాగు చేసుకునే అవకాశం కల్పించండి. ముదిరాజ్ లకు చెరువులో చేపలు పట్టుకునే హక్కును కల్పించి, చెరువుకు వెళ్లే ఫీడర్ ఛానళ్లను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి. గుడిలో పూజలు చేసుకునేందుకు ప్రజలను అనుమతించాలని అధికారులను కోరారు.

# ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

(మొదటి పేజీ తరువాయి)

బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు గాను 6200 వాహనాలు ఏర్పాటు చేశామనీ, కొనుగోలు కేంద్రాలలో ఉదయం, సాయంత్రం కొనుగోలు చేయాలని ఆదేశించామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి నోడల్ అధికారి పర్యవేక్షిస్తారనీ, అన్నింటికీ మించి ధాన్యం కొనుగోలు అంశంపై ప్రత్యేకించి పౌర సరఫరాల శాఖ కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

# వలసదారులపై ట్రంప్ ఆంక్షలు వ్యక్తిగతమే



(మొదటి పేజీ తరువాయి)

చాలా దూరం వెళ్లాయని వారు అభిప్రాయపడుతున్నారు. అమెరికాలో ఏపీ-ఎన్ఓఆర్సీ ఇటీవల నిర్వహించిన పోల్లో ఈ విషయం వెల్లడైంది.

ట్రంప్ చర్యల వల్ల తమకు తెలిసిన ఎందరో వలసదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు అమెరికన్లు పేర్కొన్నారు. ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా వారు భయపడుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో అమెరికా తిరిగి వలసవాదులను ఆదరించినా.. ట్రంప్ విధానాల వల్ల దేశానికి కలిగిన నష్టాన్ని పూడ్చడానికి చాలా ఏళ్లు పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వలసలకు వ్యతిరేకంగా రూపొందించిన విధానాల్లో భాగంగా నైపుణ్యం గల విదేశీయులను తిరిగి వారి స్వదేశాలకు పంపుతున్నారని.. దీనివల్ల దేశాభివృద్ధి నెమ్మదించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు అమెరికాలోని వలసదారుల సంతానానికి దేశ పౌరసత్వం ఇవ్వకూడదనే ట్రంప్ నిర్ణయాన్ని కొందరు వ్యతిరేకిస్తుండగా.. మరికొందరు మాత్రం సమర్థిస్తున్నారు.

## తమిళ రాజకీయ తెరపై సినిమాటిక్ ట్విస్టులు..

# అసలేం జరుగుతోంది?

- **ప్రభుత్వ ఏర్పాటుకు రెడీ అయిన టీవీకే**
- **నెహ్రూ స్టేడియంలో ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు**
- **సంఖ్యాబలం ఉంటేనే రండి అంటూ విజయ్‌కి గవర్నర్ సూచన!**



**చెన్నై, మే 6 :** తమిళనాడు రాజకీయాల్లో సినిమాటిక్ ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్న విజయ్‌కి గవర్నర్ బలం ఉంటేనే.. అని ట్విస్ట్ ఇచ్చారు. మరో పక్క, ఈయన ప్రభుత్వ ఏర్పాటుకు తమ 5గురు ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తారంటూ కాంగ్రెస్ ప్రకటించడాన్ని దాని మిత్రపక్షమైన డీఎంకే తప్పుబట్టినట్లు సమాచారం. ఇదే క్రమంలో తమకు మద్దతు ఇస్తారని టీవీకే భావిస్తున్న వీసీకే, సీపీఎం, సీపీఐ, ఐయూఎంఎల్ తదిర పార్టీలు సపోర్టు చేసేది లేదు పో! అనడం మరో ట్విస్టు. ఈ నేపథ్యంలో విజయ్ నేడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారా? అనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది.

**ప్రభుత్వ ఏర్పాటుకు రెడీ అయిన టీవీకే..**

తమిళనాట విజయ్ నేతృత్వంలో టీవీకే (ఖీఢ) ప్రభుత్వం ఏర్పాటుకుసిదమైంది. ఈ క్రమంలోనే లోక్ భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్తో విజయ్ సమావేశమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ కార్యాలయం నుంచి ఆయనకు ఆహ్వానం అందినట్లు బుధవారం మధ్యాహ్నం వార్తలు వెలువడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు మద్దతు ఇచ్చేందుకు కాంగ్రెస్ ముందుకు వచ్చింది. బుధవారం చెన్నైలోని టీవీకే కార్యాలయానికి వచ్చిన హస్తం పార్టీ నేతలు ప్రభుత్వ ఏర్పాటుకు సహకారం అందించేందుకు ముందుకురాగా.. విజయ్ వారి నిర్ణయాన్ని ఆహ్వానించారు. ఇక, చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్ ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ హాజరుకానున్నట్లు సమాచారం. అయితే, ఇక్కడే ఒక ట్విస్టు చోటు చేసుకుంది.

**గవర్నర్‌ను కలిసిన విజయ్..**

తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు టీవీకే అధినేత విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ను కలిశారు. కాంగ్రెస్ ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి కోరారు. అయితే విజయ్ చూపించిన సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి చెందలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి టీవీకేకు ఇంకా తగినంత సంఖ్యాబలం లేదని ఆయన భావిస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ విషయాన్నే ఆయన విజయ్తో చర్చించినట్లు.. 118 సభ్యులు సమకూరిన అనంతరమే రావాలని సూచించినట్లు వార్తలు వస్తున్నాయి.

తమిళనాడులో అసెంబ్లీ స్థానాల సంఖ్య 234 కాగా.. 108 చోట్ల గెలిచి టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే కావాల్సిన ఎమ్మెల్యేల సంఖ్య 118. కాంగ్రెస్ కు ఐదు సీట్లతో పాటు విజయ్ గెలిచిన రెండు సీట్లలో ఒకదాన్ని మినహాయిస్తే.. సంఖ్య 112కు పెరిగింది. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి టీవీకేకు మరో ఆరుగురి మద్దతు కావాల్సి ఉంది. విజయ్ బృందంలోకి ఇంకా ఎవరెవరు వస్తారనే దానిపై స్పష్టత లేదు. దీంతో గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటకు విజయ్‌ని ఆహ్వానించలేకపోయినట్లు సమాచారం.

**మద్దతిచ్చేది లేదంటున్న పార్టీలు..**

విజయ్ టీవీకే పార్టీకి తాము మద్దతివ్వబోమని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్), లెఫ్ట్ పార్టీలు తేల్చి చెప్పాయి. తాము డీఎంకే కూటమిలోనే ఉంటామని పేర్కొన్నాయి. మరోవైపు డీఎంకే మిత్రపక్షమైన వీసీకే.. టీవీకే పార్టీకి మద్దతిచ్చే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తమిళనాడులో సీపీఐకి 2, సీపీఎంకి 2, ఐయూఎంఎల్కు 2, వీసీకేకు 2 సీట్లు ఉన్నాయి.

# మెట్ గాలాలో తళుక్కుమన్న మేఘా సుధారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అక్కడున్నవాళ్లను కట్టిపడేశారు. ఈ సందర్భంగా సుధారెడ్డి డ్రెస్ తో పాటు ఆమె ధరించిన డైమండ్ నెక్లెస్, చేతికి ధరించిన రింగ్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి. సుధారెడ్డి ధరించిన డైమండ్ నెక్లెస్ విలువ దాదాపు రూ.142 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ఈ నెక్లెస్ లోని డైమండ్ టాంజానియాలోని మెరెలాని పర్వతాల నుండి సేకరించిన 550 క్యారెట్ల క్వీన్ ఆఫ్ మెరెలాని అనే వాయిలెట్ నీలంరంగు టాంజనైట్ డైమండ్ అని పిలుస్తారు.

అంతే కాకుండా ఆమె ధరించిన ఉంగరాలు సైతం కోట్ల రూపాయలు ఉంటాయని ఇక డ్రెస్ 3వేల గంటలకు పైగా కష్టపడి హస్తకళాకారులు రూపొందించినట్టు తెలుస్తోంది. మచిలీపట్నం శైలిలో సహజ రంగులు వాడి పూర్తిగా చేతితో డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా ఆమె డ్రెస్ పై తెలంగాణకు చెందిన పాలపిట్ట, జమ్మిచెట్టు, తంగేడు పువ్వు లాంటి చిహ్నాలు కనిపించాయి. ఈసారి మెట్ గాలాను ఫ్యాషన్ ఈజ్ ఆర్ట్ అనే డ్రెస్ కోడ్ తో నిర్వహించగా ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్రా రూపొందించిన ట్రీ ఆఫ్ లైఫ్ డ్రెస్ తో సుధారెడ్డి రెడ్ కార్పెట్ పై నడిచారు. ఇక సుధారెడ్డి మెట్ గాలాకు హాజరవ్వడం ఇదే మొదటిసారి కాదు. గతంలో రెండు సార్లు ఆమె హాజరవ్వగా అప్పుడు సైతం తన డ్రెస్సింగ్, జ్యూవెలరీతో తలుక్కుమన్నారు. ప్రస్తుతం ఆమె ఫోటోలు నెట్టింట వైరల్ అవుతుండగా నెటిజన్లు ఇంట్రెస్టింగ్ కామెంట్లు చేస్తున్నారు.



కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ఓ నయవంచన
ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం ఉద్ధృతం చేస్తం
రైతుల సంక్షేమం కోసం ఢిల్లీ నుంచి ఒక్క పైసా తెలే
వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో నిప్పులు చెరిగిన కేటీఆర్

# ఓట్ల కోసమే 'కొంగజపం'

హైదరాబాద్, మనం ప్రతినిధి : వరంగల్ వేదికగా జరిగిన 'రైతు సంగ్రామ సదస్సు'లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు?.. ఎగవేతల రేవంత్ రెడ్డి కేటీఆర్ విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఏ ఊరికైనా వెళ్లి అడుగుదాం.. ఒక్క ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగిందంటే రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని కొనియాడిన కేటీఆర్, ఇక్కడి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో కాంగ్రెస్ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్' ఒక నయవంచన అని, అది కేవలం ఓట్ల కోసమే చేసిన 'కొంగజపం' అని ఆయన మండిపడ్డారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన 34 హామీలను గాలికొదిలేశారని ఆయన దుయ్యబట్టారవా హామీలు కేవలం వంద రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు నేడు అరిగోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తెచ్చిన రైతు డిక్లరేషన్‌ను ఒక బోగస్ చిత్తు కాగితంగా అభివర్ణించిన కేటీఆర్... ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాలను 'దగా మేళాలు'గా సంబోధించారు. కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ. 10 వేలు అందిస్తే, రూ. 15 వేలు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. నేడు కనీసం ఉన్న సౌకర్యాలను కూడా అందించలేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికి 69 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం ఒక్క పైసా కూడా తీసుకురాలేదని ఆక్షేపించారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరిగితే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో రైతులు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

**రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాలు**

కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా.. టోపీ బారానా అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు, కమీషన్లు, కొట్లాటలే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి 69సార్లు ఢిల్లీకి వెళ్లాడని.. కానీ 69 పైసలు కూడా తేలేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లి రేవంత్ రెడ్డి కప్పం కడుతున్నాడని తెలిపారు. రాష్ట్రంలో రాహుల్ బంధు నడుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజల గురించి పట్టించుకునే వాళ్లే లేరని అన్నారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు.. కానీ రాహుల్ గాంధీకి మాత్రం మూటలు పంపిస్తున్నాడని అన్నారు.

# రెవెన్యూ రికార్డులు పన్నుల వసూలుకే..



- **అవి యాజమాన్య హక్కులు కల్పించవ్**
- **భూ వివాదంలో సుప్రీం కీలక తీర్పు**

ఢిల్లీ, మే 6 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూముల వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలుకేనని, అవి యాజమాన్య హక్కులు కల్పించవని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం కాల్వలనాగారం భూములపై జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ధర్మాసనం బుధవారం తుది తీర్పు ఇచ్చింది. ఇదే వ్యవహారంపై గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. సర్వే నంబరు 81లో 600 ఎకరాల భూమిని అటవీ భూమిగా గుర్తిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. పట్టా లేకుండా కేవలం పహాణీలు, ఫసల్ పట్టీల ఆధారంగా యాజమాన్య హక్కులు రావని పేర్కొంది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల అవసరాల కోసమేనని వెల్లడించింది. అప్పీలుదారు తమ క్లెయిమ్ను నిరూపించే అసలు డాక్యుమెంట్లు సమర్పించలేదని పేర్కొన్న ధర్మాసనం.. దశాబ్దాల కాలంగా సాగుతున్న న్యాయ పోరాటానికి తెరదించుతూ తీర్పు ఇచ్చింది. దీంతో 1950 నాటి నిజాం కాలపు ఫారెస్ట్ గెజిట్ నోటిఫికేషన్ ను సవాల్ చేసిన అప్పీలుదారులకు చుక్కెదురైంది.

## బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌కు బెయిల్ మంజూరు

హైదరాబాద్, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు తెలంగాణ హైకోర్టులో ఎట్టకేలకు ఊరట లభించింది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసుల్లో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్ నివాసం వద్ద గొడవ పడ్డారనే ఆరోపణలపై పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి అదనంగా, 2024లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక పాత కేసులో కూడా పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసి ఆయనను మేడ్చల్ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టడం, అధికారులను దూషించడం వంటి అంశాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్, వీటిపై బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ సందర్భంగా, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సెలవు రోజుల్లో కూడా పీటీ వారెంట్లు జారీ చేస్తూ తనను వేధిస్తున్నారని క్రిశాంక్ తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ, నిబంధనల మేరకు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అంగన్ వాడీలకు ఫోన్ల కొనుగోలులో జరిగిన అవకతవకలు, మంత్రులపై తాను చేసిన విమర్శల కారణంగానే తనపై అక్రమ కేసులు బనాయించారని క్రిశాంక్ ఈ సందర్భంగా ఆరోపించారు.

## నేషనల్ కంపెనీ టిబ్యునల్‌లో రైతుల బకాయిలు పరిగణిస్తూ అంగీకారం

చిత్తూరు, మే 6మనం న్యూస్‌ః సర్వశ్రీ నేతమ్స్ చక్కెర కర్మాగారము, నింద్ర చెరకు రైతులకు 2019-20 సంవత్సరంలో రూ. 35 కోట్లు బకాయిలు పడిన విషయము విదితమే. రైతుల బకాయిలు రాబట్టుటకు ప్రయత్నించగా ఎస్.టీ.సి.ఐ. ఫైనాన్సు లిమిటెడ్, ముంబాయి వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి రెవిన్యూ రికవరీ చట్టం పై స్టే పొందడం జరిగినది. ఈ క్రమములో జిల్లా కలెక్టర్, సుమిత్ కుమార్ చిత్తూరు ఎస్. టీ.సి.ఐ., రైతులు, కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కర్మాగారాన్ని అమ్మి వచ్చిన మొత్తములో పంచుకోవడానికి నిర్ణయించడమైనది. కాగా కొనుగోలుదార్లు తక్కువ ధర కి కోరడం వలన అమ్మకము కుదరలేదు.ఎస్.టీ.సి.ఐ. ఫైనాన్సు లిమిటెడ్, ముంబాయి కర్మాగారము పై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి) ని ఆశ్రయించగా ఫిబ్రవరి10 న కోర్టు రిసోల్యూషన్ (పొఫెషనల్ ని (ఆర్.పి) నియమించుట జరిగినది.

కాగా జిల్లా కలెక్టర్, చిత్తూరు రైతు సంఘ నాయకులతో కలసి రైతుల బకాయిల క్లెయిమ్ రిసోల్యూషన్ (పొఫెషనల్ కి సమర్పించి లు పొందుపరచవలసినదిగా కోరడమైనది.జిల్లా కలెక్టర్ అనేకసార్లు రైతుల రిసోల్యూషన్ సమస్యలను తెలియజేసి బకాయిలు తప్పనిసరిగా ఇచ్చే ఏర్పాటు చేయవలసినదిగా పొపెషనల్ ని కోరడమైనది. తత్ఫలితముగా జిల్లా కలెక్టర్, చిత్తూరు వారు సమర్పించిన 1650 మంది రైతుల క్లెయిమ్ రూ. 64 కోట్లు ను (పిన్సిపల్ రూ. 34 కోట్లు + ఇంటరెస్ట్ రూ. 30 కోట్లు బకాయిలుగా పరిగణిస్తూ అంగీకరిస్తున్నట్లు రిసోల్యూషన్ ప్రొఫెషనల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.సి.ఎల్.టి లో రైతుల తరపున పోరాడుతున్నామని, బకాయిలు రాబట్టుటకు అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# పదవులు ఇవ్వడంలో ఉన్న శ్రద్ధ, పైసలు ఇవ్వడంలో లేదు

### నిధులు ఇవ్వకుండా కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తే ఏం లాభం? : హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్, మనం ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ, నిధులు విడుదల చేయడంలో లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేసారు. నిధులు, విధులు లేకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్పొరేషన్లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి ఏం సాధిస్తారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి సంక్షేమంపై దృష్టి కంటే, అనుచరులను సంతృప్తి పరచడం పైనే దృష్టి ఉందని ఎద్దేవా చేసారు. రాష్ట్ర ప్రభుత్వం 17 కార్పొరేషన్లకు చైర్ పర్సన్లు ప్రకటించడం పట్ల హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మరి కొందరికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం హాస్యాస్పదం అన్నారు. నిధులు విడుదల చేయకపోవడంతో, మొదటి దఫాలో నియమితులైన చైర్మన్లు ప్రజలకు ఒక్క రూపాయి కూడా సాయం



చేయకుండా వారి పదవీకాలాన్ని ముగించారని గుర్తు చేశారు. 33 కార్పొరేషన్లకు గాను 21 కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అసలు ఉద్దేశ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కొమురం భీం, ఏకలవ్య, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం వారి పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనం అన్నారు. ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వ బ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ తదితర కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇలా మొత్తంగా 33 కార్పొరేషన్లకు గాను ఇప్పటి వరకు 14,521 కోట్లు కేటాయించగా, విడుదల చేసింది 3198 కోట్లు మాత్రమే అని, వినియోగించింది 305 కోట్లు మాత్రమే అని వెల్లడించారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తే, ప్రభుత్వం నుండి సరైన సమాధానం లేదన్నారు. రేవంతు పాలనలో కుల వృత్తులను ఆదుకునే ఏ పథకం లేకపోగా, కేసీఆర్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలన్నీ స్తంభించి పోయాయన్నారు. వారి ఆవేదన అరణ్య రోదనగా మిగిలిపోతుందన్ని వాపోయారు. నిధులు లేని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకోవడం మానేసి, ఆయా కులాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, వాటిని వినియోగించాలని, బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేసారు.

# పాపికొండలు యాత్రకు బ్రేక్..

### పర్యాటకుల భద్రత కోసమే యాత్రను రద్దు



హైదరాబాద్, మనం ప్రతినిధి : గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండలు విహారయాత్ర'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు ఈ చేదువార్త చెప్పారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండలు యాత్రను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతనే విహారయాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడించింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్తగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ప్రభుత్వ వివక్షపై పోరుకు సిద్ధం కావాలి

- **టీడబ్ల్యూజేఎఫ్, జీహెచ్‌జే సొసైటీల పిలుపు**



హైదరాబాద్, మే 06(మనం న్యూస్)ః జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చర్చించేందుకు సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతత్వంలో ఇటీవల నిర్వహించిన సొసైటీల సమావేశానికి తమ సొసైటీని ఆహ్వానించకపోవడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఈ సమావేశానికి కేవలం నాలుగు జర్నలిస్టు సొసైటీలను మాత్రమే పిలిచి,తమ సొసైటీని పక్కన పెట్టారని, దీని వెనక కొందరి కుట్ర దాగి ఉందని వారు ఆరోపించారు. తమకు రావాల్సిన హక్కులను కాలరాసేందుకే కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ వివక్ష చూపుతున్నారని వారు మండిపడ్డారు. గతంలో కూడా పలు మార్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో జరిగిన సొసైటీల సమావేశాలకు కూడా తమ సొసైటీని ఆహ్వానించలేదని వారు ధ్వజమెత్తారు. 2008 లో ఏర్పడిన తమ సొసైటీని విస్మరించడం బాధాకరమని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎన్నో ఏళ్ళుగా పని చేస్తున్న 1350 మంది జర్నలిస్టులు తమ సొసైటీ లో సభ్యులుగా ఉన్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమని అన్నారు. తమ సొసైటీ లో సభ్యులుగా ఉన్న జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం సరైంది కాదని అన్నారు.

**ప్రభుత్వ వైఖరిపై నిరసనః**

సచివాలయంలో జరిగిన సమావేశం ఫలితాలను నిశితంగా గమనిస్తున్నామని, అక్కడ తీసుకునే నిర్ణయాల ఆధారంగా తమ భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని వారు స్పష్టం చేశారు.తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదనీ, అయితే కొందరు జర్నలిస్టు నాయకులు తమ సొసైటీ పట్ల మంత్రికి, అధికారులకు తప్పుడు సమాచారమిచ్చి దూరం పెడుతున్నారని ఆరోపించారు.'తమ సొసైటీ పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్ష, నిర్లక్ష్య వైఖరి ఇలాగే కొనసాగితే...సొసైటీ సభ్యులంతా యుద్ధానికి సిద్ధం కావాలని వారు సభ్యులకు పిలుపునిచ్చారు.కేవలం నాలుగు సొసైటీలకే మంత్రి సమావేశంలో ప్రాధాన్యం ఇవ్వడమనేది పక్షపాతమని,తమను దూరం పెట్టడం వెనుక ఉన్న శక్తుల కుట్రను ఎండగడతామని వెల్లడించారు. 'జర్నలిస్టుల సంక్షేమం విషయంలో పక్షపాత ధోరణి సరైంది కాదని, తమ సొసైటీ సభ్యుల ప్రయోజనాల కోసం ఎలాంటి పోరాటానికైనా వెనుకాడబోమని వారు హెచ్చరించారు.

# అర్ధరాత్రి వైఫల్యం..

- **ఓ పోలీస్ కమిషనర్‌కే రక్షణ లేదు?..**
- **మరి సామాన్యుల పరిస్థితి ఎంటి?**
- **హైదరాబాద్‌లో కుప్పకూలిన శాంతిభద్రతలు**
- **సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ దాసోజు ఫైర్**

హైదరాబాద్, మనం ప్రతినిధి : మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ గారు నిర్వహించిన 'అర్ధరాత్రి డెకాయ్ ఆపరేషన్‌లో వెలుగుచూసిన భయంకర నిజాలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక ఉన్నత స్థాయి ఐపీఎస్ అధికారిణికి, అది కూడా నగర నడిబొడ్డున 40 మంది పోకిరీల నుంచి వేధింపులు ఎదురయ్యాయంటే, ఈ పాలనలో మహిళల భద్రతను పాతాళానికి తొక్కేసారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**గాంధీజీ కల - రేవంత్ రెడ్డి మార్క్ 'రౌడీ రాజ్యం'..**

మహాత్మా గాంధీ మాటలను గుర్తు చేస్తూ డాక్టర్ శ్రవణ్ ఇలా అన్నారు: ఏ రోజైతే ఒక మహిళ అర్ధరాత్రి వేళ నిర్భయంగా రోడ్డుపై నడవగలుగుతుందో, ఆ రోజే భారత్‌కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల తర్వాత, రేవంత్ రెడ్డి తెలంగాణలో ఆ స్వాతంత్ర్యం కాస్తా భయంకరమైన 'రౌడీ రాజ్యం'గా మారిపోయింది. దిల్‌సుఖ్‌నగర్ వంటి రద్దీ ప్రాంతంలో స్వయంగా పోలీస్ కమిషనర్‌నే చుట్టుముట్టి వేధించారంటే, రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతలా దిగజారాయో అర్థమవుతోంది. ఇది కేవలం పోలీస్ వైఫల్యం మాత్రమే కాదు? నేరగాళ్లలో చట్టం పట్ల భయం పూర్తిగా నశించిందని చెప్పడానికి నిదర్శనం అని డాక్టర్ శ్రవణ్ పేర్కొన్నారు.

**మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు సిగ్గుచేటు....**

ఈ సంఘటన కేవలం ఒక పొరపాటు కాదని, ఇది ఒక ప్రమాదకరమైన ధోరణికి పరాకాష్ట అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ఇటీవలి (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో)వార్షిక క్రైమ్ రిపోర్టుల ప్రకారం హైదరాబాద్‌లో మహిళలపై నేరాలు గత ఏడాది కంటే 6% పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా మహిళలను వేధించే కేసులు 9% పెరిగాయి. దక్షిణ భారతదేశంలోనే మహిళలపై అఘాయిత్యాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. కిడ్నాపులు, వేధింపులు రోజురోజుకూ పెరుగుతున్నా.. ప్రభుత్వం మాత్రం 'ఫ్యూచర్ రెడీ' అంటూ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం. ఇవి కేవలం అంకెలు కావు; ఈ ప్రభుత్వం రక్షించలేకపోయిన వేలాది మంది మహిళల ఆర్తనాదాలు అని ఆయన మండిపడ్డారు.

**కమాండ్ కంట్రోల్ సెంటర్..: ప్రజల కోసం కాదు, రాజకీయ కుట్రల కోసమే..**

హోం శాఖ బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ని ఒక రాజకీయ అడ్డాగా మార్చేశారని డాక్టర్ శ్రవణ్ విమర్శించారు. ముఖ్యమంత్రి సచివాలయం కంటే ఎక్కువగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే కనిపిస్తున్నారు. కానీ అక్కడ ఆయన ఏం చేస్తున్నారు? వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ వ్యవస్థను ప్రజల రక్షణ కోసం వాడుతున్నారా లేక ప్రతిపక్ష నాయకుల కదలికలను ట్రాక్ చేయడానికి, రాజకీయ వ్యూహాల కోసం వాడుతున్నారా? దేశంలోనే అత్యంత అధునాతన నిఘా వ్యవస్థ ఉండి కూడా, నడిరోడ్డుపై ఒక మహిళను 40 మంది చుట్టుముట్టిన విషయాన్ని గుర్తించలేకపోయిందంటే.. అక్కడ 'కమాండ్' ఫెయిల్ అయ్యింది, 'కంట్రోల్' అస్సలు లేదు. కేవలం రాజకీయ గూఢచారి కోసం టెక్నాలజీని వాడుకుంటూ, సామాన్యులను నేరగాళ్ల పాలు చేస్తున్నారు.

**పోలీసుల రాజకీయ బానిసత్వం.. అణిచివేతే లక్ష్యం..**

పోలీస్ వ్యవస్థపై రాజకీయ జోక్యం పెరిగిపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని డాక్టర్ శ్రవణ్ ఆరోపించారు. ప్రతిపక్షమే టార్గెట్.. పోలీసులను ప్రజల రక్షణకు కాకుండా ప్రతిపక్షాలను అణిచివేసేందుకు, అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటున్నారు. రక్షకులుగా ఉండాల్సిన పోలీసులను రాజకీయ బానిసలుగా మార్చడం వల్లే శాంతిభద్రతలు బలి అవుతున్నాయి.

**అదృశ్యమైన పెట్రోలింగ్... షీ టీమ్స్ ఏమయ్యాయి?**

మూడు నాలుగు గంటల పాటు పెట్రోలింగ్ వాహనం ఎందుకు కనిపించలేదు? ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుల్లో బిజీగా ఉండటం వల్లే, గంజాయి బ్యాచ్లకు, పోకిరీలకు భయం లేకుండా పోయింది.

**ముఖ్యమంత్రికి సూటి ప్రశ్నలు...**

రేవంత్ రెడ్డి తక్షణమే వీటికి సమాధానం చెప్పాలని డాక్టర్ శ్రవణ్ డిమాండ్ చేశారు:

1. ఒక ఐపీఎస్ ఆఫీసర్‌కే రక్షణ లేని హైదరాబాద్లో.. విద్యార్థినులు, ఐటీ ఉద్యోగిణులు, తల్లులు ఎలా సురక్షితంగా ఉండగలరు?.. 2. పెట్రోలింగ్ వాహనాలను ప్రజల రక్షణకు కాకుండా, రాజకీయ సభలకు, వీవీఐపీ సెక్యూరిటీలకు ఎందుకు మళ్లిస్తున్నారు?..

3. మీరు కేవలం రాజకీయాల కోసమే హోం శాఖను వాడుకుంటారా, లేక ప్రజల రక్షణ కోసం బాధ్యత తీసుకుంటారా?.. సుమతి ఆపరేషన్ ఈ ప్రభుత్వానికి ఒక చెంపపెట్టు. రేవంత్ రెడ్డి కేవలం 'ఫుల్ టైమ్ పొలిటీషియన్'గానే మిగిలిపోయారు తప్ప, బాధ్యతగల హోం మంత్రిగా విఫలమయ్యారు. హైదరాబాద్ వంటి గ్లోబల్ సిటీని నేరగాళ్ల అడ్డాగా మార్చకండి అని డాక్టర్ శ్రవణ్ హెచ్చరించారు.

# సీపీ సుమతి స్పెషల్ ఆపరేషన్

- **పోకిరీల పనిపట్టేందుకు మారువేషం**
- **అర్ధరాత్రి బస్టాప్‌లో పోకిరీల ఆటకట్టు**



హైదరాబాద్,మే 6(మనం,ప్రత్యేక ప్రతినిధి) ః హైదరాబాద్ నగరంలో మహిళల రక్షణ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి మల్కాజిగిరి సీపీ సుమతి ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎటువంటి పోలీస్ భద్రత లేకుండా.. సామాన్య మహిళలా వేషం మార్చుకుని అర్ధరాత్రి 12:30 గంటల నుంచి తెల్లవారుజామున 3:30 గంటల వరకు బస్టాప్ వద్ద ఒంటరిగా స్పెషల్ డ్రైవ్ చేశారు. అయితే కేవలం మూడు గంటల వ్యవధిలో దాదాపు 40 మంది పురుషులు ఆమెను సమీపించారు. వీరిలో ఎక్కువమంది మద్యం మత్తులో ఉండగా, మరికొందరు గంజాయి సేవించినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు అనే తేడా లేకుండా ఒంటరిగా ఉన్న మహిళను చూసి వస్తావా..? రేటు ఎంత అంటూ అసభ్యంగా ప్రవర్తించడం నగరంలో మహిళల భద్రతపై ఆందోళన కలిగించింది. ఎదురుగా ఉన్నది ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి అని తెలియక వారు చేసిన ఆగడాలు పోలీసులను విస్మయానికి గురిచేశాయి. ఈ ఆపరేషన్ తర్వాత పోలీసులు సదరు వ్యక్తులను గుర్తించారు. అయితే వెంటనే కేసులు నమోదు చేయకుండా, వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలి, బహిరంగ ప్రదేశాల్లో మర్యాదగా ఎలా ఉండాలి అనే విషయాలపై గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సుమతి ఇలాంటి ప్రయోగాలు కొత్తేమీ కాదు. 25 ఏళ్ల క్రితం కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో డీఎస్పీగా ఉన్నప్పుడు కూడా ఆమె ఇలాగే మారువేషంలో వెళ్లి మహిళల రక్షణను పర్యవేక్షించిన విషయం విదితమే. తాజాగా సీపీ సుమతి తెగువను చూసి నగరవాసులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులే స్వయంగా రంగంలోకి దిగితేనే క్షేత్రస్థాయి సమస్యలు తెలుస్తాయని ఈ ఘటన నిరూపించిందన్న చర్చ సాగుతోంది.

## హైకోర్టు సీజెని కలిసిన డీజీపీ

హైదరాబాద్, మే 6:(మనం,ప్రత్యేక ప్రతినిధి) ః తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ బుధవారం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోశిని కూడా ఆయన కలిశారు. కేవలం మర్యాదపూర్వక భేటీలో భాగంగానే ఈ సమావేశాలు జరిగాయి.



మనం Manam



## వేసవి వేళ..చల్లని నీడ..!

వేసవి వేడి గుండెల్ని మండిస్తోంది
పని చక్రంలో గిర్రున తిరుగుతూ
చెమటగా జారుతోంది జీవితం.
పండుటాకులు రాలిపోతున్నాయి
పత్ర హరితం చేజారిపోయింది
నీటి కోసం బిందెలు పట్టుకుని
గల్లీ గల్లీ తిరుగుతున్న ఆశలు
భూమిలోనూ.. హృదిలోనూ
అడుగంటుతున్న క 'న్నీళ్లు'
బతుకు భద్రత కోసం కళ్లల్లో
కనిపిస్తోంది ఆవేదన.. మనసులో వేదన
అకాల వర్షాలతో పొలాలు పాడై
రైతు కన్నీరు ఎండిపోయింది
భగ్గుమన్న ఎండకు
జొన్న చేను కాలిపోయింది
ప్రకృతి కూడా వికృతంగా నవ్వుతోంది
చెట్టు నీడ కూడా అరుదై పోయింది
మనిషి నీడే మరొక మనిషికి భారమైంది
పిల్లల కలలు స్వేదంలో కరుగుతున్నాయి
పెద్దోళ్ల కళలు గాయంతో మరుగుతున్నాయి
విలువలకు వలువలూడు తున్నాయి
కాలమా...మనిషిని మనిషి
ప్రేమించుకునే రోజేది..!?
అంతా అంతర్గత యుద్ధాలే కదా...
అడుగడుగునా ఆశలు
ఒలికిపోతున్న దృశ్యాలే కదా...
ఒక చెట్టు నాటితే చల్లని గాలైనా వస్తుంది
పచ్చని మొక్క మొలకెత్తుదాం పదా..
ఒక చుక్క నీరు ఆదా చేస్తే
రేపటి తరం దాహమైనా తీరుతుంది
ఒడిసి పట్టుకుందాం.. కదలండి...
వేసవి వేడి మనసుల్లో కాకుండా
మన కర్తవ్యాల్లో జ్వాలగా మారితే బాగు
ప్రజా సమస్యలపై స్పందించే మనసే
సమాజానికి నిజమైన చల్లని నీడ....!

**- డా.కటుకోఝ్వల రమేష్**
9949083327

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి – ఎడిటర్**

# కుప్పకూలిన పాత కోటలు.. పుట్టుకొచ్చిన కొత్త శక్తులు!




భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2026 నాటి పంచ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కేవలం ఒక సాధారణ అధికార మార్పిడి ఘట్టాలుగా కాకుండా, దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసిన చారిత్రక పరిణామాలుగా విశ్లేషించ బడుతున్నాయి. అస్సాం బ్రహ్మపుత్ర తీరం నుండి బెంగాల్ గంగమ్మ ఒడి వరకు, కేరళ కొబ్బరి తోటల నుండి తమిళనాడు ద్రవిడ కోటల వరకు విస్తరించిన ఈ ఎన్నికల పోరులో భారతీయ ఓటరు తన పరిణతిని చాటుకున్నాడు. దశాబ్దాల రాజకీయ ఆధిపత్యాలను సవాలు చేస్తూ, సరికొత్త శక్తులకు పట్టం కడుతూ, అభివృద్ధి మరియు సిద్ధాంతాల మేళవింపుతో వెలువడిన ఈ ఫలితాలు జాతీయ రాజకీయాల్లో నవ శకానికి నాంది పలికాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీల విస్తృతిని, ప్రాంతీయ సమీకరణాల మార్పును మరియు యువత రాజకీయ ఆకాంక్షలను స్పష్టంగా ప్రతిబింబించాయి.

ఉత్తర తూర్పు భారతావనిలో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన అస్సాం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ సాధించిన విజయం ఒక అప్రతిహత రాజకీయ ప్రస్థానానికి నిదర్శనంగా నిలిచింది. 126 స్థానాలు కలిగిన అస్సాం అసెంబ్లీలో ఎన్డీఏ ఏకంగా 102 స్థానాలను కైవసం చేసుకోవడం, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమిని కేవలం 21 స్థానాలకే పరిమితం చేయడం ఒక చారిత్రక రికార్డు. 2016లో మొదటిసారి అధికారంలోకి వచ్చిన నాటి నుండి, 2021లో పట్టు నిలుపుకుని, ఇప్పుడు 2026లో వరుసగా మూడవసారి అఖండ మెజారిటీతో హ్యాట్రిక్ సాధించడం ద్వారా భాజపా ఈశాన్య భారతంలో తన అజేయ శక్తిని చాటుకుంది. ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణం ప్రభుత్వం అమలు చేసిన సమగ్ర అభివృద్ధి నమూనా. మారుమూల ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మించిన భారీ వంతెనలు, రహదారులు, మరియు మౌలిక సదుపాయాల కల్పన అస్సాం ప్రజల్లో అభివృద్ధిపై గట్టి నమ్మకాన్ని కలిగించింది. దీనికి తోడు, అక్రమ వలసల విషయంలో ప్రభుత్వం అవలంబించిన కఠిన వైఖరి, జాతీయ పౌర పట్టిక అమలుపై ఉన్న స్పష్టత, మరియు స్థానిక సంస్కృతిని కాపాడే ప్రయత్నాలు గిరిజన మరియు స్థానిక వర్గాలను భాజపా వైపు మొగ్గు చూపేలా చేశాయి. కాంగ్రెస్ పార్టీ బలమైన నాయకత్వం లేక, క్షేత్రస్థాయిలో ఉనికిని కోల్పోవడం కూడా ఎన్డీఏకు ఇంతటి భారీ మెజారిటీ రావడానికి మార్గాన్ని సుగమం చేసింది.

దేశవ్యాప్త రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేసిన పరిణామం పశ్చిమ బెంగాల్లో చోటుచేసుకుంది. గత దశాబ్ద కాలానికి పైగా బెంగాల్ గడ్డపై ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కోటను కూల్చివేస్తూ భాజపా సాధించిన విజయం జాతీయ రాజకీయాల్లోనే అత్యంత కీలక మలుపు. 293 స్థానాలు కలిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో భాజపా 206 స్థానాలతో అఖండ విజయాన్ని నమోదు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. గతంలో ఎదురులేని శక్తిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కేవలం 81 స్థానాలకే పరిమితం కాగా, కాంగ్రెస్ పార్టీ నామమాత్రంగా 2 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాజకీయ హింస, అవినీతి ఆరోపణలు, మరియు పాలనాపరమైన అసంతృప్తి బెంగాల్ ఓటర్లలో ఒక నిశ్శబ్ద విప్లవానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లడంలో భాజపా విజయం సాధించింది. సామాజిక సమీకరణాలను తమకు అనుకూలంగా మార్చుకోవడమే కాకుండా, పరిపాలనలో మార్పు రావాలని కోరుకున్న యువత మరియు మధ్యతరగతి ఓటర్లు భాజపాకు బాసటగా నిలిచారు. ఈ విజయం ద్వారా దేశంలో 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఏకైక పార్టీగా భాజపా తన ప్రాబల్యాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

దక్షిణ భారత రాజకీయాలలో సుదీర్ఘ కాలంగా 'మార్పు'కు వేదికగా నిలిచే కేరళ రాష్ట్రం ఈసారి కూడా తన సాంప్రదాయాన్ని కొనసాగించింది. గత ఎన్నికల్లో సాంప్రదాయక పద్ధతిని పక్కన పెట్టి వరుసగా రెండోసారి ఎల్డీఎఫ్‌కు పట్టం కట్టిన కేరళ ప్రజలు, ఈసారి తిరిగి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌ను అధికార పీఠంపై కూర్చోబెట్టారు. 140 స్థానాల కేరళ అసెంబ్లీలో యూడిఎఫ్ 102 స్థానాలను కైవసం చేసుకుని తన సత్తా చాటగా, అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకు పడిపోయింది. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు, నిరుద్యోగ సమస్య, మరియు విదేశీ పెట్టుబడుల కొరత వామపక్ష కూటమి పతనానికి కారణమయ్యాయి. భారత రాజకీయ యవనికపై 2026 ఎన్నికల్లో అత్యంత సంచలనాత్మక మలుపు తమిళనాడులో వెలువడింది. దశాబ్దా లుగా ద్రవిడ మున్నేట్ర కజగం మరియు అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగంల మధ్యే సాగుతున్న తమిళ రాజకీయా ల్లోకి మూడవ శక్తిగా సినీ నటుడు విజయ్ ప్రవేశించడం, ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ అపూర్వ విజ యాన్ని సాధించడం ఒక అద్భుతం. 234 స్థానాల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాల చరిత్ర కలిగిన డీఎంకే 73 స్థానాలకు, ఏఐఏడీఎంకే 53 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇది ఒక నటుడి గ్లామర్ విజయం మాత్రమే కాదు, ద్రవిడ రాజకీ యాల పేరుతో సాగుతున్న అవినీతి, వారసత్వ రాజకీయాలపై తమిళ ప్రజల ఆగ్రహానికి నిదర్శనం. యువతలో ఉన్న విపరీ తమైన ఆదరణను విజయ్ తన రాజకీయ సిద్ధాంతాలతో మేళవిం చి, క్షేత్రస్థాయిలో బలమైన పునాదిని నిర్మించుకున్నారు. పారదర్శక పాలన, కులాలకు అతీతమైన రాజకీయం, మరియు తమిళ అస్తిత్వాన్ని కాపాడుతూనే ఆధునిక అభివృద్ధిని కాంక్షించే ఆయన విధానం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఇది భవిష్యత్తులో తమిళనాడులో ద్విధ్రువ రాజకీయాలకు స్వస్తి పలికి, సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయాలకు మార్గం చూపింది.

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో సైతం ఓటరు తీర్పు అభివృద్ధికి అనుకూలంగా వెలువడింది. 30 స్థానాలు కలిగిన పుదుచ్చేరి అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి 18 స్థానాలను సాధించి తన అధికారాన్ని నిలబెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలకే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ఉంటేనే చిన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని పుదుచ్చేరి ప్రజలు భావించారు. పర్యాటక రంగం, మౌలిక వసతుల కల్పనలో వచ్చిన మార్పులు ఓటర్లను ఆకర్షించాయి. స్థానిక నాయకత్వం మరియు కేంద్రం మధ్య ఉన్న అవగాహన పుదుచ్చేరిలో రాజకీయ స్థిరత్వాన్ని కలిగించింది.

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను సమగ్రంగా పరిశీలిస్తే భారత రాజకీయాల్లో కొన్ని కీలక ధోరణులు స్పష్టమవు తున్నాయి. మొదటిది, ప్రజలు ఇప్పుడు కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఫలితాలను ఇచ్చే 'నిష్పాక్షిక అభివృద్ధి' వైపు మొగ్గు చూపుతున్నారు. అస్సాం మరియు బెంగాల్ ఫలితాలు దీనికి నిదర్శనం. రెండవది, యువ ఓటర్ల పాత్ర గతంలో కంటే నిర్ణయాత్మకంగా మారింది. తమిళనాడులో విజయ్ పార్టీ సాధించిన విజయం, యువత ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎంత ఆకలితో ఉన్నారో తెలియజేస్తోంది. మూడవది, సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న పార్టీలపై ఉన్న వ్యతిరేకత క్షేత్ర స్థాయిలో బలంగా పనిచేస్తోంది. కేరళ మరియు బెంగాల్ ఫలితాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని 21 రాష్ట్రాలలో అధికా రంలో ఉండటం ద్వారా భాజపా జాతీయ రాజకీయాల్లో తిరుగు లేని శక్తిగా ఎదిగింది. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని విజయ్ పార్టీ సవాలు చేయడం అనేది ప్రాంతీయ రాజకీయాల్లో వస్తున్న పెనుమార్పులకు సంకేతం. ఎన్నికల ప్రచార శైలిలో కూడా విప్లవాత్మక మార్పులు వచ్చాయి. తమిళనాడులో విజయ్ పార్టీ మరియు బెంగాల్లో భాజపా ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకున్నాయి.2026 పంచ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని వైవిధ్యతను మరియు చైతన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయి. అభివృద్ధి పరమావధిగా, ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సాగే రాజకీయాలకే భవిష్యత్తు ఉంటుందని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. జాతీయ రాజకీయ యవనికపై కొత్త నాయకత్వాలు, సరికొత్త సమీకరణాలు ఆవిర్భవించడంతో భారత ప్రజాస్వామ్యం మరింత పరిణతి చెందిన దిశగా అడుగులు వేస్తోంది. ఈ చారిత్రక పరిణామాలు దేశ రాజకీయ దిశను, దశను మార్చి వేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# సవాళ్లను అధిగమిస్తేనే 'విజయం'!



నాటకీయతకు మారుపేరైన తమిళనాడు రాజకీయాలలో ఇప్పుడు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అన్ని రకాల ఎన్నికల సర్వేల అంచనాలను తల్లకిందులు చేస్తూ ఎన్నికల ఫలితాలు వెలువడినాయి. కొమ్ములు తిరిగిన ఎన్నికల విశ్లేష కులూ, యోధానయోధులైన నాయకుల అంచనాలను సైతం ఇవి తలకిందులు చేశాయి.ఎవరి ఊహకూ అందని విధంగా వెలువడిన ఈ ఫలితాలను ఇప్పుడు ఎవరికి తోచినట్లుగా వారు విశ్లేషిస్తున్నారు. 234 సభ్యులు గల తమిళనాడు అసెంబ్లీలో 108స్థానాలను గెలుచుకుని తమిళ సూపర్



స్టార్ జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ స్థాపించిన తమిళగ వెట్రి కజగమ్ (టివికె) అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాల చరిత్ర, పాలనానుభవం గల ద్రవిడ పార్టీలు డిఎంకె, ఆల్ ఇండియా అన్నాడిఎంకెలు టివికె తరువాత రెండు మూడు స్థానాలకు పరిమితం అయ్యాయి. ఈ రెండు పార్టీలు కూటములతో కలుపుకుని వాటికి వరుసగా 73,54 స్థానాలు వచ్చాయి. ఈ ఫలితాలు ఎందుకు ఇలా వెలువడ్డాయి? అందుకు కారణం ఏమిటన్నది అందరిలోనూ ఆసక్తిని రేపుతున్న ప్రశ్న.

దేశ రాజకీయాలలో తమిళనాడుది ఎప్పుడూ ప్రత్యేక స్థానమే. ద్రవిడ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ, ఉత్తరాదికి చెందిన జాతీయ పార్టీల ఆధిపత్యాన్ని సవాలు చేయడం, అందులో భాగంగా, హిందీవ్యతిరేకతను ఇక్కడి అన్ని పార్టీలూ తమ రాజకీయ రథానికి ఇరుసుగా భావిస్తాయి.అలాంటి పార్టీలు అప్పటికే ఐదారు ఉండగా వాటిని కాదని ఇటీవలే కొత్తగా పుట్టిన పార్టీ వైపు ప్రజలు ఎందుకు మొగ్గు చూపారన్నది పరిశీలకులను ఆశ్చర్యపరిచింది.

ఎన్నికల ప్రక్రియలో హామీలు అతి ముఖ్యమైనవి. మహిళా సంక్షేమం, రైతులకు మద్దతు, యువకులకు ఉపాధి, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, మద్యపాన నిషేధం లాంటి హామీలు అన్ని పార్టీల మేనిఫెస్టోలలో సాధారణంగా కనిపిస్తున్నా, అన్నా డీఎంకె పార్టీ ఒక అడుగు ముందుకు వేసి మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తానని వాగ్దానం చేసింది. అలాగే టీవీకె పెళ్ళికా నున్న యువతులకు 8 గ్రాముల బంగారం ఉచితంగా ఇస్తామనీ, తమ మంత్రివర్గంలో ఎఐ మంత్రిత్వ శాఖను కొత్తగా సృష్టిస్తానని అదనంగా హామీ ఇచ్చింది. తమిళ పార్టీలు ఇచ్చిన హామీలన్నీ గతంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ, ఆంధ్రలో తెలుగుదేశం కూటమి ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నవి. ప్రధాన పార్టీలైన డిఎంకె, అన్నాడిఎంకెతో పోలిస్తే విజయ్ పార్టీ టివికె ఇచ్చిన హామీలు తక్కువేమీ కాదు. అన్ని పార్టీల ఎన్నికల ప్రణాళికలు దాదాపుగా ఒకేలా ఉన్నప్పుడు ప్రజలు విజయ్ పార్టీ టీవీకె వైపుకు ఎందుకు మొగ్గారు అన్నది ప్రశ్న. ఎందుకంటే మిగతా పార్టీలకు ప్రజలు అప్పటికే అవకాశం ఇచ్చి ఉన్నారు. వాళ్ల పరిపాలనా సామర్థ్యం, హామీల అమలును ప్రత్యక్షంగా చూశారు. కాగా కొత్తగా పెట్టిన టీవీకె పార్టీకి ఆ చరిత్ర లేదు. దాని అధ్యక్షుడు సినిమా హీరో కావడం, యువకులు, మహిళలు, నిరుద్యోగుల్లో విజయ్ పట్ల ఉన్న క్రేజ్, అవినీతి నిర్మూలనపై ఆయన ఇచ్చిన హామీ ప్రజలు ఈ పార్టీపై ఆశలు పెంచుకోవడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా విజయ్‌కు ప్రభుత్వ ఏర్పాటు రూపంలో తొలిసమస్య ఎదురయింది. టీవీకె శాసన సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంటనే విజయ్ తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలనీ, రెండు వారాలలో తాను బలనిరూపణ చేసుకుంటానని గవర్నర్‌ను కోరడం జరిగింది. కానీ గవర్నర్ వైపు నుంచి వెంటనే సానుకూల సంకేతమయితే ఇంకా రాలేదు. ఆహ్వానం అందుతుందా లేక ఏమైనా తిరకాసులు పెట్టే అవకాశం ఉందా అనేది వెంటనే తెలియదు. ఒకవేళ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం అందితే, టివికెకు కనీసం పది మంది సభ్యుల మద్దతు ఉంటే తప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితి ఉంది. బీజేపీ కూటమి మద్దతు కోరితే తాను ప్రకటించిన లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహ రించినట్లు అవుతుంది. అలాగే డీఎంకే మద్దతు తీసుకుంటే ప్రజల యొక్క ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు అవుతుంది. అందుకని ఆయన ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ఇక ఆయనకు ఉన్న ఒకే ఒక్క మార్గం చిన్నాచితకా పార్టీల మద్దతును కూడగట్టుకోవడం. ఆ పనిని ఇప్పటికే ప్రారంభించి నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ అధిష్టానంతో విజయ్ మాట్లాడినట్లుగా ఆ పార్టీ ఢిల్లీ పెద్దలు ధ్రువీకరించారు. విసికె, సిపిఐ, సిపిఎం లాంటి మిగతా పార్టీలు కూడా సానుకూలంగానే ఉన్నట్లు చెబుతున్నారు. టివికె కూడా ఆయా పార్టీలకు వాళ్ల వాళ్ల ఇష్టాయిష్టాలను బట్టి మంత్రి పదవులు ఇవ్వజూపినట్లుగా తెలుస్తోంది. అయితే ఆయా పార్టీలు ఎలాంటి షరతులు పెడుతున్నాయో విజయ్ ముందు ఏమేమి కోరికలు ఏకరువు పెడుతున్నాయో స్పష్టత వస్తే తప్ప గవర్నమెంట్ ఏర్పాటుకు మార్గం సుగమం కాదు. ఇక ప్రభుత్వ ఏర్పాటు, పార్టీల మద్దతులాంటి బాలారిష్టాలను దాటి ఆయనే అధికార పగ్గాలు చేపట్టినా విజయ్ కు అతి ముఖ్యమైన సవాళ్లు ఉండనే ఉన్నాయి. ఒకటి ఆయనకు పాలనానుభవం బొత్తిగా లేకపోవడం, రెండు అవినీతి, నిరుద్యోగం.. గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన సమస్యలు. వీటికి తోడు భయపెడుతున్న ఖజానా. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలంటే 2లక్షల కోట్లకు పైగా ఖర్చు అవుతుందని అప్పుడే ఒక అంచనాతో కూడిన విమర్శ బయటకి వచ్చింది. ఇంతటి భారీ వ్యయాన్ని భరించడం సాధ్యమేనా అన్న అనుమానం ఎవరికైనా రావడం సహజమే కదా! పైగా ఎంతో పాలనా అనుభవం ఉన్న పార్టీలు రెండు ప్రతిపక్షంలో ఉండగా ఆయన తాను ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తాడో, ఎంత సమర్థవంతంగా పాలన సాగిస్తాడోనన్నదానిపైనే ఆయన రాజకీయ జీవితం ఆధారపడి ఉంటుంది.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# కూలుతున్న 'ఇండియా కూటమి'

భారత రాజకీయాల్లో ప్రస్తుతం వేగంగా మారుతున్న పరిస్థితులు ఒక కొత్త దిశను స్పష్టంగా సూచిస్తున్నాయి. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలను లోతుగా పరిశీలిస్తే, దేశ రాజకీయ ముఖచిత్రం గణనీయంగా మారుతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా, ప్రతిపక్షాల కూటమి అయిన ఇండియా అనేక బలహీనతలకు గురవుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తుండగా, మరోవైపు బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే మరింత సమన్వయంతో, బలంగా ముందుకు సాగుతోంది. ఈ మార్పు కేవలం ప్రాంతీయ ఎన్నికలకే పరిమితం కాకుండా, 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాతి దశలో జాతీయ స్థాయిలో ఒక క్రమబద్ధమైన ధోరణిగా కనిపిస్తోంది. ప్రజల్లో నాయకత్వ స్థిరత్వం, అభివృద్ధి వైఖరి, మరియు స్పష్టమైన విధానాల పట్ల ఉన్న ఆకర్షణ బీజేపీకి మరింత మద్దతును సమకూరుస్తుండగా, ప్రతిపక్షాల్లోని విభేదాలు, అస్పష్టమైన వాగ్దానాలు వాటి ప్రభావాన్ని తగ్గిస్తున్నాయి.



పుదుచ్చేరిలో ఎన్డీయే అధికారంలోకి రావడం దాదాపు ఖాయమవుతున్న సమయంలో, కేరళలో మాత్రం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించబోతోంది. ఇది దేశవ్యాప్తంగా రాజకీయ వైవిధ్యాన్ని సూచిస్తున్నప్పటికీ, ప్రధానంగా బీజేపీ ఆధిపత్యం పెరుగుతున్న దిశలోనే పరిస్థితులు ఉన్నాయని చెప్పాలి. అత్యంత ఆసక్తికరమైన మార్పు తమిళనాడులో చోటుచేసుకుంటోంది. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకే మరియు అన్నాడీఎంకే ఆధిపత్యానికి ఇప్పుడు కొత్త సవాల్ ఎదురైంది. సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం వేగంగా ఎదుగుతూ ఈ రెండు ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తోంది. ముఖ్యంగా యువత, మధ్యతరగతి, మరియు కొత్త రాజకీయ చైతన్యం కోరుకునే వర్గాలు విజయ్ వైపు ఆకర్షితులవుతున్నారు. ఈ పరిణామం ద్రవిడ పార్టీల దీర్ఘకాల ఆధిపత్యంపై ప్రశ్నార్థకం గుర్తు వేస్తూ, తమిళనాడు రాజకీయాల్లో త్రిముఖ పోటీకి నాంది పలికింది.

తమిళనాడులో జరిగిన పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారాయి. డీఎంకే నాయకులు సనాతన ధర్మంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ వ్యాఖ్యలు కొన్ని వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపగా, మరికొన్ని వర్గాలు వాటిని హేతువాద దృక్పథంగా సమర్థించాయి. అయితే, ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన విశ్లేషకులు ఈ వ్యాఖ్యలు డీఎంకేకు నష్టం కలిగించాయని, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లోని సాంప్రదాయ ఓటర్లను దూరం చేశాయని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకున్న టీవీకే పార్టీ, రాజకీయ ఖాళీని భర్తీ చేస్తూ ప్రజల్లో అద్భుతమైన ఆదరణ పొందింది. ఒకప్పుడు అధికారంలో ఉన్న డీఎంకే, ప్రస్తుతం కొన్ని స్థానిక ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయే పరిస్థితి ఏర్పడటం ఈ మార్పుకు స్పష్టమైన నిదర్శనం. టీవీకే బలం రోజురోజుకు పెరుగుతుండటం, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతం రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చే అవకాశం ఉంది.

ఇక పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే, అక్కడి రాజకీయాలు మరో కీలక మలుపు తిప్పుకున్నాయి. మమతా బెనర్జీ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలు, పోస్టల్ రిక్రూట్మెంట్ స్కామ్ నుంచి స్కూల్ సర్వీస్ కమిషన్ అవినీతి వరకు అనేక వివాదాలు తెరపైకి వచ్చాయి. అలాగే, శాంతిపూర్, త్రినగర్ వంటి ప్రాంతాల్లో జరిగిన సామాజిక ఘటనలు, పరిపాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విపక్షాలను అణచివేస్తున్నారనే ఆరోపణలు, మహిళల భద్రత, మతపరమైన ఉద్రిక్తతలు వంటి అంశాలు కూడా ప్రజాభిప్రాయాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బీజేపీ అక్కడ తన స్థానాన్ని బలపరచుకుంటూ, పంచాయతీ ఎన్నికల నుంచి లోక్సభ ఎన్నికల వరకు వరుస విజయాలు సాధించింది. బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటికీ ప్రధాన పార్టీగా ఉన్నప్పటికీ, బీజేపీ రెండో పార్టీగా బలంగా ఎదగడం, కొన్ని ప్రాంతాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఇది తూర్పు భారతంలో బీజేపీ విస్తరణకు ఒక దళమైన పునాదిని వేసింది.

ఈ మొత్తం పరిస్థితులను సమగ్రంగా పరిశీలిస్తే, ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలైన తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి భాగస్వాములు ఎన్నికల్లో గణనీయంగా వెనుకబడటం గమనించదగ్గ విషయం. 2024 లోక్సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ, జేడీ(ఎస్) వంటి పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీజేపీకి వ్యతిరేకంగా పోటీ చేశాయి. అయినప్పటికీ, ప్రజలు ఆశించిన ఫలితాలను పూర్తిగా సాధించలేకపోయాయి. బీజేపీ ప్రత్యక్ష మెజారిటీని కోల్పోయినా (240 స్థానాలు), తన మిత్రపక్షాలైన టీడీపీ, జేడీ(యూ), శివసేన (శిండే), లోక్ జనశక్తి పార్టీ (పశుపతి కుమార్ పారశ్) మద్దతుతో 293 స్థానాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. దీన్నే ఇండియా కూటమి ఒక మోస్తరు ప్రతిఘటనగా భావించినా, వాస్తవంలో బీజేపీ నాయకత్వం, సంకీర్ణ నిర్వహణలో ప్రతిపక్షాల కంటే చాలా ముందుంది.

2024 ఎన్నికల అనంతరం జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ తన వ్యూహాలను మరింత బలోపేతం చేసుకుంటూ వరుస విజయాలు సాధించింది. హర్యానాలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం, మహారాష్ట్రలో మహాయుతి కూటమి విజయం సాధించడం, బీహార్లో ఎన్డీయే ఘన విజయం సాధించి నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగడం, మరియు ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత బీజేపీ అధికారంలోకి రావడం - ఇవన్నీ ఎన్డీయే బలం పెరుగుతున్నదనడానికి స్పష్టమైన ఉదాహరణలు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే బీజేపీ అధికారంలో ఉంది. ఈ విజయాలు కేవలం ప్రాంతీయ పరిమితి కాకుండా, జాతీయ స్థాయిలో ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల సంఖ్య తగ్గుతుండగా, బీజేపీ ప్రభావం ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పశ్చిమం వరకు విస్తరిస్తోంది.

ఇండియా కూటమి భవిష్యత్తుపై ఇప్పుడు అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2029 లోక్సభ ఎన్నికల వరకు ఈ కూటమి కొనసాగుతుందా అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమిలోని పార్టీల మధ్య వ్యూహాత్మక విభేదాలు నెలకొన్నాయి. ఒకవైపు కాంగ్రెస్ తనను ప్రధాన కేంద్రంగా నిలపాలని ప్రయత్నిస్తుండగా, తృణమూల్, డీఎంకే, ఆప్, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వంటి ప్రాంతీయ పార్టీలు తమ స్వంత ప్రయోజనాలను ముందుంచుతున్నాయి. నాయకత్వ సమస్యలు, సీట్ల పంపకాలపై విభేదాలు, మరియు బీజేపీకి వ్యతిరేకంగా ఏకీకృత ప్రచారాన్ని నిర్మించడంలో విఫలమవడం ఈ అనిశ్చితికి ప్రధాన కారణాలు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'భారత్ జోడో యాత్ర' కూటమికి కొంత ఊపునిచ్చినా, ఓట్లుగా మార్చడంలో పూర్తి విజయం సాధించలేదు. ప్రస్తుత పరిస్థితిలో, ఈ కూటమి విచ్ఛిన్నమైతే, ప్రతిపక్ష ఓట్లు మరింత చెదిరిపోయి, బీజేపీకి మరింత సులభతరం అవుతుంది.

ఇక ఉత్తరప్రదేశ్ వంటి కీలక రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారాయి. సమాజ్వాదీ పార్టీ గత పది సంవత్సరాలుగా అధికారానికి దూరంగా ఉండటం, బహుజన్ సమాజ్ పార్టీ ప్రభాహీనంగా మారడం, మరియు కాంగ్రెస్ పూర్తిగా బలహీనపడటం, బీజేపీకి అక్కడ ఏకైక ప్రతిపక్షంగా ఎస్పీని మిగిల్చాయి. అయినప్పటికీ, స్వల్ప మైనారిటీ ఓట్లు, యువతలో నిరాశ, మరియు స్థానిక సమస్యల కారణంగా 2024 ఎన్నికల్లో బీజేపీకి యూపీలో కొంత నష్టం వాటిల్లింది. కానీ దాన్ని బీజేపీ త్వరగా సరిదిద్దుకుంటుందని నిపుణులు అంటున్నారు. బీహార్లో ఆర్జేడీ బలహీనపడటం, తేజస్వి యాదవ్ ప్రభావం పరిమితమవడం, మరియు కాంగ్రెస్ ప్రభావం తగ్గిపోవడం కూడా ఎన్డీయేకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తోంది. నితీష్ కుమార్ స్థానిక ప్రజాదరణ, మహిళల నిరక్షరాస్యత తగ్గింపు, పథ్య ప్రణాళికా కేంద్రాలు వంటి పథకాలు ఆయనకు ఇప్పటికీ మద్దతునిస్తూనే ఉన్నాయి. జార్ఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ తన ప్రభావాన్ని పెంచుకుంటుందని సర్వేలు సూచిస్తున్నాయి.

ఈ పరిణామాలన్నింటినీ ఒకే దృష్టితో చూస్తే, దేశ రాజకీయాల్లో ఒక కొత్త సమీకరణం రూపుదిద్దుకుంటోంది. బీజేపీ తన వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, సామాజిక విభజనలను దాటి, ప్రజల్లో 'డెవలప్మెంట్ పొలిటిక్స్'ను నాటుతూ ముందుకు సాగుతోంది. మోదీ వ్యక్తిగత ప్రజాదరణ, హిందుత్వ కేంద్ర భావన, కేంద్ర పథకాల ప్రభావవంతమైన అమలు, మరియు ప్రతిపక్షాల లోపాలే ఈ విజయాలకు మూలం. ఇండియా కూటమి అంతర్గత విభేదాలు, వ్యూహాత్మక లోపాలు, మరియు స్పష్టమైన ప్రత్యామ్నాయ దృశ్యం లేకపోవడంతో వెనుకబడుతోంది. అయితే, రాజకీయాలు ఎప్పటికీ స్థిరంగా ఉండబోవు. ఇప్పుడు కనిపిస్తున్న ఈ ధోరణి రేపు మారొచ్చు. ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి జాతీయ సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వ వ్యతిరేకతను రేపగలవు. అలాగే, ప్రాంతీయ పార్టీలు స్థానికంగా బలంగా ఉన్నాయి. కాబట్టి రాబోయే అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలు ఈ సమీకరణాలను మరింత స్పష్టంగా నిర్ధారిస్తాయి. ప్రస్తుతం కనిపిస్తున్న ధోరణి ప్రకారం, ఇండియా కూటమి బలహీనపడుతున్నదనే భావన ఉన్నప్పటికీ, భవిష్యత్తులో రాజకీయ పరిస్థితులు ఎలా మారతాయో చెప్పడం కష్టమే.

మొత్తానికి, ప్రస్తుతం భారత రాజకీయాల్లో బీజేపీ మరియు ఎన్డీయే ఆధిపత్యం పెరుగుతున్న క్రమంలో, ప్రతిపక్షాల కూటమి ఇండియా చీలికల అంచున ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రజల అభిప్రాయం, నాయకత్వ నిర్ణయాలు, సామాజిక-ఆర్థిక అంశాలు, అంతర్జాతీయ పరిస్థితులు, మరియు ఎన్నికల సంస్కరణలు ఈ మార్పులను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుత ప్రభుత్వం తన రెండో టర్మ్ ముగింపు దశలో కీలక నిర్ణయాలు తీసుకుంటుండగా, ప్రతిపక్షాలు పునర్వ్యవస్థీకరణకు ప్రయత్నిస్తున్నాయి. ఒక వైపు బీజేపీ తదుపరి దశలో గెలుపు అవకాశాలు మెరుగ్గా కనిపిస్తే, మరోవైపు ప్రతిపక్షాలు ఏకమైతే మాత్రం అవి ముందు రావచ్చు. అందువల్ల, రాబోయే రెండేళ్ల కాలం భారత రాజకీయాలకు అత్యంత కీలకంగా మారనుంది. ప్రజలు ఎలా ఆలోచిస్తారు, నాయకులు ఎలా వ్యూహాలు రచిస్తారు అనేదానిపై ఆధారపడి దేశ రాజకీయ భవితవ్యం నిర్ణయమవుతుంది. ఈ సందిగ్ధతల మధ్య, రాజకీయ విశ్లేషకులు, పత్రికలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిజానికి, ప్రజాస్వామ్యంలో మార్పు ఒకే ఒక్క స్థిరమైన అంశం.

**- డా. ఏలూరు యాదయ్య**

# యువత నైపుణ్యాభివృద్ధి ద్వారానే ఉపాధి సాధ్యం

**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా మెగా జాబ్ మేళా**

**టాస్క్, ఏటీసీ, స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఆధునిక నైపుణ్యాల పెంపు**


**మెగా జాబ్ మేళాలో 77 కంపెనీలు - 4 వేల ఉద్యోగ అవకాశాలు**

**పెద్దపల్లిలో టాస్క్ ద్వారా శిక్షణ పొందిన 261 మంది మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు**

**డీఈఈటీ ద్వారా యువతకు ఉద్యోగ అనుసంధానం - నమోదు కావాలని సూచన**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**





పెద్దపల్లి, మే 06 (మనం ప్రతినిధి)ః నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా

**మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గతంలో జవహర్లాల్ నెహ్రూ నాలెడ్జ్ సెంటర్లు ఉండగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా పెద్దపల్లిలో టాస్క్ (టి ఏ ఎస్.కె) రీజినల్ సెంటర్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో టాస్క్ ద్వారా శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందగా, 261 మంది ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉపాధి పొందినట్లు పేర్కొన్నారు. నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని, మంత్రి, ఎమ్మెల్యేల పట్ల గౌరవం ఉన్నప్పటికీ యువతకు తగిన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్, ఎంసీఏ, ఎంఏ మ్యాథ్స్, ఎంఏ ఫిజిక్స్ వంటి విద్యార్హతలు ఉన్నా పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు సాధ్యం కాదని యువత గుర్తుంచుకోవాలని సూచించారు.ఈ రోజు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 77 కంపెనీలు పాల్గొని 4 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చాయని, అయితే 1500 మంది మాత్రమే షార్ట్లిస్ట్ అయ్యారని తెలిపారు. గోల్ మెడలిస్టు అయినా సరే సాఫ్ట్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ లేకపోతే పరిశ్రమలకు పనికిరావని పేర్కొన్నారు. యువతకు తగిన నైపుణ్యాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీ సెంటర్లు, టాస్క్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొంటూ, ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు పెంచేందుకు భారీ పెట్టుబడులను తీసుకువస్తున్నామని తెలిపారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే పెద్దపల్లి యువతకు స్కిల్ యూనివర్సిటీలో అవకాశాలు కల్పించి ఉపాధి కల్పించడం తన బాధ్యత అని మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఈఈటి) దేశంలోనే ప్రత్యేకమైన వేదికగా ఉందని, ఇందులో నమోదు చేసుకుంటే అభ్యర్థుల నైపుణ్యాలను విశ్లేషించి తగిన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ వేదికలో నమోదు కావాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. యువత నూతన సాంకేతికతలను ఆచరించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిస్తూ, యువత సంక్షేమం కోసం ప్రతి నిమిషం పనిచేసే ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు.

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ**

తెలంగాణ ఏర్పడిన తర్వాత నిరుద్యోగ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చినా అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఒక లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు.

ప్రస్తుతం సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని పేర్కొన్నారు. విద్య, పరిశ్రమల అవసరాలు, ఉద్యోగ నైపుణ్యాల మధ్య సరిపోలిక సాధించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, టాస్క్ ( టి ఏ ఎస్ కె) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నామని, ప్రతి విద్యార్థి, నిరుద్యోగ యువత ప్రభుత్వం అందిస్తున్న టాస్క్, ఏటీసీ వంటి వనరులను సద్వినియోగం చేసుకుని మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలను సాధించాలన్నారు.

**ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ**

రెండు సంవత్సరాల క్రితం పెద్దపల్లిలో టాస్క్ (టి ఏ ఎస్ కే) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టాస్క్ ద్వారా శిక్షణ పొందిన 261 మంది యువత ప్రస్తుతం ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. అలాగే పెద్దపల్లిలో వీ-హబ్

ను కూడా ఏర్పాటు చేసి, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు పెద్దపల్లి జిల్లాలో మెగా జాబ్ మేళాను పరిశ్రమల శాఖ, టాస్క్ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. 77 కంపెనీల వరకు మెగా జాబ్ మేళాలో రిజిస్టర్ కావడం జరిగిందని, ఐటీ, బిపిఓ, మార్కెటింగ్, ఉత్పత్తి రంగం వంటి వివిధ రంగాలలోని కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.నేడు జరిగిన జాబ్ మేళా కార్యక్రమంలో 1200 మంది విద్యార్థులు షార్ట్ లిస్ట్ కావడం జరిగిందని, 647 మళ్లీ యువతకు అపాయింట్మెంట్ ఆర్డర్లు సిద్ధం చేశామని అన్నారు.

అగ్ని వీర్, పోలీస్ ఉద్యోగుల ఎంపికలో ఆసక్తిగల నిరుద్యోగ యువతకు పెద్దపల్లి జిల్లాలో ప్రత్యేకంగా అవసరమైన శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మెగా జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించడంలో సహకరించిన డీఈఈటి, టాస్క్, ఐటీ శాఖ అధికారులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

**రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ**

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, కొంతమంది ఆత్మహత్యలకు కూడా పాల్పడిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.యువత సంక్షేమంతోనే తెలంగాణ రైజింగ్ సాధ్యమవుతుందని, యువతకు మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదని, బీఆర్ఎస్ కూడా అనేక హామీలు ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అనేక కంపెనీలను తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు.రామగుండం ప్రాంతంలో సుమారు 30 వేల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అక్కడ కూడా మెగా జాబ్ మేళాను నిర్వహించాలని మంత్రి ని కోరారు. సింగరేణి, ఎన్టీపీసీ వంటి సంస్థలు, ప్రభుత్వం కలిసి రామగుండంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం



- **రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దుష్టి సారించాలి**
- **రైతును మరింత బలోపేతం చేసేందుకు రైతు వారోత్సవాలు**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి టౌన్, మే 06 (మనం న్యూస్)ః ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో బుధవారం నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమంలో ముఖ్యతిథిగా పాల్గొన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నరని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. గతంలో పెసర్లు, జొన్నలు, కందులు వంటి పంటలు పండించిన రైతులు ఇప్పుడు ఎక్కువగా వరి పంటపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఇది రైతులకు లాభదాయకం కాదని, పంట మార్పిడి చేపట్టి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలను సాగు చేయాలని, భూమి సారాన్ని కాపాడేందుకు యూరియా వినియోగాన్ని తగ్గించాలని, పంట అవశేషాలను కాల్చడం మానుకోవాలని సూచించారు. మన నియోజకవర్గంలో కొంతమంది రైతులు ఎకరానికి రూ.1 లక్ష నుండి రూ.1.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరే అన్న వారు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కోసం చేస్తున్న పనులను చూసి, సంక్షేమ పథకాలు చూసి బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, ప్రస్తుతం ఆయిల్ ఫాం కు మంచి డిమాండ్ ఉందన్నారు.

పెద్దపల్లి నియోజకవర్గంలో రైసుమిల్లర్లను, అధికారులను ఒప్పించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కిలో కటింగ్ కూడా లేకుండా కొనుగోళ్లు జరిపిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పది నుంచి పదిహేను కిలోల కటింగ్లు చేస్తూ మిల్లర్లు, ప్రజాప్రతినిదులు కుమ్మక్కయ్యారన్నారు. ఆ సమయంలోను తాను రైతుల పక్షాన పోరాడడం జరిగిందన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు తమ రక్తాన్ని చెమటగా మార్చి ఉత్పత్తి చేసిన పంటలను అమ్ముకోవటానికి వస్తే వారిని వంచించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాను రైతు పక్షపాతినని, రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న తనకు నేరుగా తెలియజేస్తే పరిష్కారం చేయడం జరుగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు, పెద్దపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు



- **గోరక్షణ పేరుతో హింసకు పాల్పడవద్దు**
- **పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్**
- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



పెద్దపల్లి మే 06 (మనం ప్రతినిధి)ః రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం,వ్యక్తిగత దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ (వీహెచ్పీ యువజన విభాగం),రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, హిందూవాహిని, శ్రీరామ్ సేన,హిందూ యువవాహిని సభ్యులతో పశువుల అక్రమ రవాణా నిరోధంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో చట్టపరమైన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పోలీస్ శాఖ చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 08 చెక్పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గూడెం చెక్పోస్ట్ - ఎన్హెచ్-63 రోడ్పై, 2. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంద్రన్పల్లి వద్ద ఫారెస్ట్ చెక్పోస్టు, కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రాపన్పల్లి చెక్పోస్ట్, జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంద్రారం చెక్పోస్ట్ (మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల సరిహద్దు), . తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రేపల్లెవాడ చెక్పోస్ట్, బసంత్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బసంత్నగర్ టోల్గేట్ చెక్పోస్ట్, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దుబ్బపల్లి చెక్పోస్ట్, సుల్తానాబాద్, గుంపుల ప్రాంతాల్లో ప్రత్యేక చెక్పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు.పశువులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, ఇది మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్,కౌ స్లాటర్ యాక్ట్,భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు.గోరక్షకుల పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే రామగుండం పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలందరూ ప్రశాంతంగా జీవించేలా,సామాజిక సామరస్యాన్ని కాపాడేలా, మూగజీవాల రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్, తాండూర్ సీఐ దేవయ్య,ఆర్ఐ పెద్దన్న,రమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత**

జగిత్యాల, మే 06 (మనం ప్రతినిధి)ః సారంగాపూర్ మండలంలోని రేచపల్లి, కోనాపూర్, లక్ష్మీదేవిపల్లి, ధర్మనాయక్ తండ గ్రామాలలో ఏర్పాటు చేసిన ఐకెపి, డీసీఎంఎస్ మరియు పిఎసిఎస్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం



**యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాల కోసం టాస్క్ ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు**

**డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మల్టీమీడియా రంగాల్లో శిక్షణ లభ్యం**

**మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం**

**పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాల పెంపు - టాస్క్ కేంద్రం లక్ష్యం**

**మహిళల ఆర్థిక సాధికారతకు కుట్టు శిక్షణ కేంద్రాలు, గార్మెంట్స్ యూనిట్**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

మంథని,మే 6 (మనం న్యూస్)ః యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలతో కలిసి మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కేంద్రం ద్వారా డేటా సైన్స్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మల్టీమీడియా, ఆడియో విజువల్ రంగాల్లో శిక్షణ అందించబడుతుందని పేర్కొన్నారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా సి.టి.ఆర్.ఎల్.ఎస్ డేటా సెంటర్ సంస్థ సహకారంతో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.హైదరాబాద్కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంథని వంటి ప్రాంతాలకు పరిశ్రమలను తీసుకురావడం సవాలుతో కూడుకున్నదని, ఇక్కడి యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని,దీనిని సాధించడానికి యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు.మన విద్యార్థులకు మంచి అకడమిక్ పరిజ్ఞానం ఉన్నప్పటికీ పరిశ్రమలకు అవసరమైన కొన్ని నైపుణ్యాలలో లోపాలు ఉన్నాయని,వాటిని అధిగమించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. మంథనిలోని టాస్క్ కేంద్రం కూడా ఇదే విధంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించి వారికి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుందని వివరించారు. టాస్క్లో నమోదు చేసుకుని పలు శిక్షణ కోర్సులు పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు.ఇక్కడ మంచి కంపెనీలు శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్టీయూ మంథనిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చిందని, ప్రతి విద్యార్థి భవిష్యత్తు తన బాధ్యతగా భావిస్తున్నానని, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు.అలాగే మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందగలరని అన్నారు. గంగాపురిలో రూ.7.3 కోట్ల వ్యయంతో ప్లగ్ అండ్ ప్లే గార్మెంట్స్ యూనిట్కు ఈరోజు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత ఒకేసారి 400 మంది మహిళలకు శిక్షణ అందించవచ్చని, ఇది విజయవంతమైతే మరో యూనిట్ను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రతి నిరుద్యోగ యువకుడు కష్టపడే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని, కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయని గుర్తుంచుకోవాలని సూచించారు.మంథని పట్టణానికి అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో కూడిన శిక్షణ కేంద్రాలను తీసుకురావడమే లక్ష్యంగా టాస్క్ అడ్వాన్స్డ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అనేక ఉద్యోగాలు మార్పులకు లోనవుతున్నాయని, మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే యువత తప్పనిసరిగా ఏఐ వంటి ఆధునిక నైపుణ్యాలను అభ్యసిస్తూ కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్,మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, టాస్క్ చైర్మన్ నితిన్ కుమార్ రెడ్డి, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ సంస్థ డైరెక్టర్ రాజీవ్ త్రీవేది,ఏఎంసీ చైర్మన్ కె. వెంకన్న,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# శ్రీరాముని పై కొండ సురేఖ వాఖ్యల్ని ఖండించిన ఏసీఎస్ రాజు



జగిత్యాల మే 06(మనం న్యూస్)ః రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఒక సమావేశంలో మాట్లాడుతూ 'బిజెపి వాళ్లు ఏమైనా అంటే మీటింగ్ లు పెట్టుడు జైశ్రీరామ్ అనుడు, జై శ్రీరామ్ అంటే పైనుంచి ఏమైనా పైసలు పడతాయా, లేకుంటే ఏమైనా పథకాలు వస్తాయా అని'కోట్లాదిమంది హిందువులు దైవంగా పూజించే శ్రీరాముని గురించి వ్యంగ్యంగా మాట్లాడడం హిందువుల మనోభావాలను దెబ్బతీయటమేనని, తాను ఒక హిందువై ఉండి దేవుని గుడులకు మంత్రి అయి దేవుణ్ణి విమర్శించడం తగదని పార్టీల మధ్య విభేదాలుంటే రాజకీయంగా విమర్శించుకోవాలే గాని మధ్యలో శ్రీరాముని ప్రస్తావన తీసుకురావటం సరికాదని ఇందుకు కొండ సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలని భారత సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసిఎస్ రాజు డిమాండ్ చేశారు. ఇతర పార్టీలలో ఉండే హిందువులకు శ్రీరాముడు ఆదర్శము కాదా అని ప్రశ్నించారు. నాటి నెహ్రూ నుంచి నేటి రాహుల్ వరకు కాంగ్రెస్ నాయకులందరూ హిందూ వ్యతిరేకులేనని రాబోయే రోజుల్లో వీరికి కూడా హిందువులు తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి నాయకులు అక్కినపల్లి కాశీనాథం, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, వేముల పోచమల్లు, బాశెట్టి దుబ్బ రాజం, వేముల దేవరాజం, నరేందుల శ్రీనివాస్, సిరిపురం గంగారాం, దొనకంటి రాజేశ్వరరావు, కొత్తకొండ బాలన్న, ఎడమల వెంకట్ రెడ్డి, కె ఆర్ కృష్ణ, సర్పంచ్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు

# వైద్య, ఆరోగ్యశాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టాం

- విద్యా, వైద్య, మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం
- బాలసదనాలను ప్రభుత్వ, సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తాం
- అతి త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం లు , నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలు విడుదల చేస్తాం
- అంగన్వాడీలను, బాల సదనాలను
- కాపాడుకునే గురుతర బాధ్యత ప్రభుత్వానిది
- వికలాంగులకు స్కూటీలను పంపిణీ
- మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి



సంగారెడ్డి మే 06 మనం న్యూస్ ప్రతినిధి: ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యాచరణ అమలు కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యకరణ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనంలో స్థానిక శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. బాల సదనం నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్ గార్లతో కలసి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ**

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీని చేపట్టామన్నారు . త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగ ఫలితాలను వెల్లడిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,నేతృత్వంలో విద్యా, వైద్య, మహిళా సాధికారత, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు , వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా బాల సదనాలను, అంగన్వాడీలను కాపాడుకునే గురుతర బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు . రాష్ట్రంలో అంగన్వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వ, సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణీ, బాలింతలకు, 3 నుండి 6 ఏండ్ల పిల్లలకి ఒక పూట సంపూర్ణ భోజనం, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు టేక్ హోమ్ రేషన్ అందించడం, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల పిల్లలకి పూర్వ ప్రాథమిక విద్య అందించడంతోపాటు పోషకాహారం, ఆరోగ్యం , ప్రీ - స్కూలు, రోగ నిరోధకత, రిఫరల్ సేవలు, ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో ఏ ఎన్ ఎం లు, అంగన్వాడి టీచర్లు, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తల సేవలను అందిస్తున్నారన్నారు.

ఈ సందర్భంగా వీరి సేవలను మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న బాలసదనం బాలికలతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో తక్షణమే ఆర్ఓ ప్లాంట్ ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం వికలాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు , వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారోత్సవాలలో జిల్లాలో చైల్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ శుభ్రత, 18 సంవత్సరాల పైబడిన సిసిఐ పిల్లలను గుర్తించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించుట, అత్యవసర సర్టిఫికెట్లు ఆరోగ్య కార్డుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, సంస్థల నుండి పిల్లలను బయటికి డిశ్చారీ చేసి తిరిగి వారికి పునరావాస కల్పించుట మరియు ఫాలో అప్ ప్రక్రియ, రెసిడెన్షియల్ స్కూల్స్ లో చేర్పు ప్రక్రియ ఇలాంటి అంశాలను జరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంత్, సి డి పి ఓ సుజాత, ఆశ్రమ నిర్వాహకురాలు విజయ కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.ఎల్. సంగీత



సంగారెడ్డి, మే 06 మనం న్యూస్ ప్రతినిధిః సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా టి.ఎల్. సంగీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ శాఖ అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె సన్నిహితంగా పరిచయం చేసుకున్నారు. అడిషనల్ కలెక్టర్గా జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని టి.ఎల్. సంగీత తెలిపారు.

## రైతులకు ఇబ్బందులు కలుగవద్దు



మోర్తాడ్, మే 6 (మనం న్యూస్)ః ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని మోర్తాడ్ తహసిల్దార్ కృష్ణ ఆదేశించారు. బుధువారం ఆయన తన సిబ్బందితో కలిసి మండలంలోని మోర్తాడ్ సొసైటీతో పాటు మోర్తాడ్ పాలెం, దొనకలులో ఐకెపి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంతమంది రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చారు ఎన్ని లోడ్లు రైస్ మిల్లులకు పంపారో అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఎక్కడ కూడా నిర్లక్ష్య వైఖరి కనబడకూడదని, రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంట తూకం వేయించి కొనుగోలు చేయాలని ఆదేశించారు. తప్పనిసరిగా ప్రతి వివరాన్ని రికార్డులో నమోదు చేయాలని నిర్లక్ష్యం పనికి రాదని స్పష్టం చేశారు. ఎక్కడ రైతుకి ఇబ్బంది జరిగిన రికార్డుల్లో అవకతవకలు జరిగిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంది



- రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

నిజామాబాద్, మే 06 (మనంప్రతినిధి)ః పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం సికింద్రాపూర్‌లో లబ్ధిదారు మాలెపు అర్చన రాజు, బడా భీమ్‌గల్ శంకురి ప్రమీల, వేల్పూర్ మండలంలోని పడగల్‌లో మందల లింగుబాయి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. భీమ్‌గల్ మండలంలో ఇప్పటికే 60శాతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి నివాసం కల్పించాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. మరో నెల రోజుల్లో రెండో విడతలో 3,500 ఇళ్లకు మంజూరు రానుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ మున్సిపల్ చైర్మన్ బొదిరే స్వామి, వైస్ చైర్మన్ జేజే నర్సయ్య, కౌన్సిలర్ నాగేంద్ర బాబు, సర్పంచ్‌లు రమేష్, నరేందర్, రాజు, భూమారెడ్డి, సురేష్, ఉప సర్పంచ్ నరేందర్, మల్లారెడ్డి నరేష్, నితీష్, జలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం

**రాష్ట్రంలో క్వాలిటీ మెడికల్ ఎడ్యుకేషన్ కు చర్యలు తీసుకున్నాం**

**పుస్తకావిష్కరణ లో మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి**

సంగారెడ్డి, మే 06 మనంప్రతినిధిః రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి లోని తన నివాసంలో ప్రముఖ ఓరల్ మ్యాక్సిలోఫాసియాల్ నిపుణులు డా. చిత్తలూరి లక్ష్మణ్ రాయ్ రచించిన 'వివా అండ్ క్లినికల్ గైడ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో క్వాలిటీ మెడికల్ ఎడ్యుకేషన్ కు చర్యలు చేపట్టామన్నారు. తెలంగాణ లో చదువుకున్న వైద్య విద్యార్థులకు , జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయన్నారు. అదే వరవడితో తెలంగాణ ప్రభుత్వం వైద్య విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డా. చిత్తలూరి లక్ష్మణ్ రాయ్ రచించిన ఈ పుస్తకం వర్ధమాన డెంటల్ డాక్టర్లకు క్లినికల్ గైడ్ గా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను మంత్రి అభినందించారు. ఈ పుస్తక ఆవిష్కరణలో జాతీయ డెంటల్ అసోసియేషన్ సభ్యులు డా. ప్రమోద్ కుమార్, డా. సుధీర్ రామ్ శెట్టి పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

**ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగునీరు అందించాలని అధికారులకు ఆదేశాలు**

**ప్లాస్టిక్ సేకరణ వినూత్న విధానానికి కలెక్టర్ ప్రశంసలు**

**ప్రజల్లో మంచి స్పందన తెచ్చిన, కిలో ప్లాస్టిక్ అందజేస్తే టిఫిన్ బాక్స్ బహుమతి**

**తాడ్వాయి మండలం ఏండ్రియాల్ గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి, మే 06 (మనంప్రతినిధి)ః జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తాడ్వాయి మండలం ఏండ్రియాల్ గ్రామాన్ని బుధవారం సందర్శించి, గ్రామంలో తాగునీటి వనరులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మూడు మంచి నీటి ట్యాంకులు, నాలుగు బోరు బావులు, పంప్సెట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే 396 ఇంటి ఇంటి నల్ల కనెక్షన్లు ఉన్నట్లు వివరించారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరా ఎలా జరుగుతోందో సర్పంచ్ను కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామ ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నీటి వనరుల నిర్వహణ, సరఫరా వ్యవస్థపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

**ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు**

గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రశంసించారు. కిలో ప్లాస్టిక్ సేకరించి అందజేసిన వారికి టిఫిన్ బాక్సు బహుమతిగా ఇవ్వడం ప్రజల్లో మంచి స్పందన పొందుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల గ్రామస్తులు పెద్దఎత్తున ప్లాస్టిక్ సేకరణలో పాల్గొంటున్నారని అభినందించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే చర్యలపై సంతోషం వ్యక్తం చేశారు. ఇదే తరహా కార్యక్రమాలను ఇతర గ్రామాల్లో కూడా అమలు చేసి, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. వేసవి నేపథ్యంలో అన్ని గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, మండల ప్రత్యేక అధికారి, డి.ఎల్.పి.ఓ., ఎంపీడీవో, ఎమ్మార్వో, హౌసింగ్ డిఈ, ఎంఈఓ, వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## కల్లాల్లోనే వడ్లు.... కష్టల్లోనే రైతు...!

- రైతుల కష్టాలు ఎవరికి కనిపించవా..?
- పంట పండించడం కంటే అమ్ముకోవడం కష్టంగా మారింది
- వాన పడితే పంట పాడవుతుందనే భయం.
- మానసికంగా కుంగిపోతున్న రైతన్నలు



ఆర్మూర్, మే 6 ( మనం న్యూస్ ): ఆర్మూర్ మండలం మరియు గోవింద్ పేట్ పరిసర ప్రాంతాల్లో రైతుల దుస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోంది. పంటను రక్తం చెమటలతో పండించిన రైతు, ఇప్పుడు అదే వడ్లను కల్లాల్లో ఎండబెట్టుకుంటూ కష్టాల్లో మగ్గుతున్న దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాకపోవడం, ప్రారంభమైన చోట సరైన ఏర్పాట్లు లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పొలాల్లో పండిన ధాన్యం గోదాములకు వెళ్లాల్సింది పోయి, రోడ్ల పక్కనే, కల్లాల్లోనే పేరుకుపోతోంది. ఎండలో వడ్లు ఎండబెట్టడం, రాత్రిళ్లు కాపలా కాయడం రైతుల రోజువారీ జీవితంగా మారింది. వాన పడితే పంట పాడవుతుందనే భయం, ఎండలో ఉంటే నాణ్యత తగ్గుతుందనే ఆందోళన, ఇవి రైతును మానసికంగా కూడా కుంగదీస్తున్నాయి. అధికారులు మాత్రం పత్రాలపైనే పరిమితమైపోతున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు కనిపించినా స్పందన కనిపించడం లేదు. మద్దతు ధరపై కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆచరణలో మాత్రం రైతును అనాథలా వదిలేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట పండించడం కంటే అమ్ముకోవడమే కష్టం అన్నది రైతు నిస్సహాయ అరుపుగా మారింది. సరైన సమయంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కల్లాల్లోనే వడ్లు పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఆశతో రైతు ఎదురు చూస్తున్నాడు. లేకపోతే కల్లాల్లోనే వడ్లు కష్టాల్లోనే రైతు అన్న పరిస్థితి మారదని స్పష్టమవుతోంది.

**తరుగులో రైస్ మిల్లులు రైతులకు శాపం...**

**తరుగు, పేరుతో క్వింటలకు 5 కిలోలు కడ్తా.**

తరుగు పేరుతో రైస్ మిల్లులు రైతులకు శాపంగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంటను విక్రయించడానికి వచ్చిన రైతులను మిల్లర్లు వివిధ కారణాలతో ఇబ్బందులకు గురి చేస్తూ, తక్కువ ధరలు ఆఫర్ చేయడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. రైతులు చెబుతున్నదేమిటంటే ప్రభుత్వ సూచించిన కనీస మద్దతు ధర (ఎం ఎస్ ఎం పి ) ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన మిల్లర్లు, తేమ శాతం, నాణ్యత తరుగు వంటి కారణాలు చూపిస్తూ క్వింటాల్కు 5 కిలోలు తగ్గించి ధరలు నిర్ణయిస్తున్నారు. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోంది. మరింతగా, ధాన్యం తూకంలోనూ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది మిల్లర్లు తక్కువ తూకం చూపించడం ద్వారా రైతులపై అదనపు భారం మోపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, చెల్లింపులు ఆలస్యంగా చేయడం వల్ల రైతులు అప్పుల బారిన పడుతున్న పరిస్థితి ఏర్పడుతోంది. ఇదిలా ఉండగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సరైన సమయానికి ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు మిల్లర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘాలు అంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ అక్రమాలు పెరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మిల్లర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

**హమాలీలు కొరతతో రైతులకు భారం...**

నగరాలకు వలసలు పెరగడం వంటి కారణాలతో హమాలీలు తగ్గిపోవడం జరిగింది. దీనితో పనిభారం పెరిగిన మిగిలిన కార్మికులు అధిక కూలీ డిమాండ్ చేస్తున్నారు. గతంలో బస్తాకు తీసుకునే కూలీకి పోలిస్తే ప్రస్తుతం 20 నుంచి 30 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. రైతులు తమ పంటను మార్కెట్కు తీసుకొచ్చిన తర్వాత హమాలీలు లేక ఆలస్యమవుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరుకు ఎక్కించడం, దిగించడం ఆలస్యమవడం వల్ల ట్రాన్స్పోర్ట్ ఛార్జీలు కూడా పెరిగాయి. దీంతో మొత్తం వ్యయభారం రైతులపై పడుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

## ఇసుక క్వారీలో తవ్వకాలను నిలిపేయాలి

- కారేగాం గ్రామస్థులు ఆందోళన
- లారీలను ఎక్కడికక్కడ నిలిపివేసిన గ్రామస్థులు



నిజామాబాద్, మే 6 (మనం బ్యూరో)ః పోతంగల్ మండలం కారేగాం ఇసుక క్వారీలో తవ్వకాలను నిలిపేయాలని గ్రామస్థులు ఆందోళన చేశారు. ఈ మేరకు బుధవారం లారీలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఈ సందర్భంగా పోతంగల్ మండలం కారేగాం గ్రామ సర్పంచ్ సునీల్ మాట్లాడుతూ., మంజీర పరిసర ప్రాంతాల్లో కొన్ని వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయన్నారు. అయితే ఇసుకను అక్రమంగా తోడేస్తూ ఉంటే మంజీర కొన్నిరోజుల్లో ఎడారిలో మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని.. ఫిర్యాదులు ఇచ్చిన అనంతరం కొన్నిరోజులుకు వచ్చి తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారని వాపోయారు. మంజీరాను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇసుకను నిరంతరాయంగా తోడేస్తే చుట్టుపక్కల ఉన్న బోర్లన్నీ ఎత్తిపోతాయన్నారు. మాజీ సర్పంచ్ సాంబశివరావు మాట్లాడుతూ., తక్షణమే కారేగాం ఇసుక క్వారీ నుంచి జేసీబీలు, లారీలు వెళ్లకపోతే తీవ్రమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అలాగే అనుమతుల పేరుతో రాత్రి 9 గంటల తర్వాత కూడా యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తోడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సతీష్, రామ్ పటేల్, అశోక్, రాజు, నాగనాథ్, శంకర్, శ్రీనివాస్ గజేందర్, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడి విధానాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి

**ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**




బాన్సువాడ, మే 06 ( మనం న్యూస్)ః పంట మార్పిడి విధానాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండలంలోని దేశాయిపేట గ్రామంలో బుధవారం రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోచారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., రైతుల ఆదాయం తగ్గకుండా పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ అధికారులు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి అధిక దిగుబడుల దిశగా రైతులు అడుగులు వేయాలని కోరారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, ఖర్చు తగ్గించి లాభాలు పెంచుకునే మార్గాలను అన్వేషించాలని రైతులకు సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి రైతులకు సాంకేతిక సలహాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన బోధన్ ఎస్ఐ



నిజామాబాద్, మే 6 (మనం బ్యూరో)ః బోధన్ పట్టణంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కీలకంగా వ్యవహరిస్తూ లంచం తీసుకుంటున్న పోలీస్ అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్న భాస్కర చారి బుధవారం ఒక వ్యక్తి నుంచి రూ.7 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భాగంగా లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఒక సివిల్ వివాదానికి సంబంధించిన కేసులో సెక్షన్ మార్పు చేయడం కోసం ఎస్ఐ భాస్కర చారి ఈ లంచాన్ని డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో పట్టు బిగించి, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే భాస్కర చారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఘనంగా వెంకటేశ్వర స్వామివారి మహా కుంభాభిషేకం

**సతీ సమేతంగా హాజరైన పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఆనందగిరి గుట్టలపై వైభవంగా అయ్యప్ప స్వామి ప్రతిష్ఠా మహోత్సవం**



**భద్రాద్రి కొత్తగూడెం, మే 06 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఆగమ శాస్త్రానుసారంగా ఈ మహోత్సవాన్నో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీ సమేతంగా హాజరయ్యారు. ఆయనతో పాటు అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన కలశాభిషేకం, విశేష పూజలు, అర్చన కార్యక్రమాలలో మంత్రి పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. మహోత్సవంలో భాగంగా అగ్ని ప్రతిష్ఠతో యజ్ఞ కార్యక్రమాలు ప్రారంభమై, పుణ్యాహవాచనం, వాస్తు శాంతి, మహాసంకల్పం, విశేష హోమాలు నిర్వహించబడ్డాయి. అనంతరం కలశ స్థాపన చేసి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పవిత్ర తీర్థ జలాలతో కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ గోపురం, విమానం, ధ్వజస్తంభం, గర్భగుడికి ప్రత్యేకంగా కుంభాభిషేకం జరిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం, అర్చనలు, అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించగా, పుష్పాలంకరణతో ఆలయం శోభాయమానంగా అలంకరించబడింది. అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించబడగా, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం పొందారు. అనంతరం మంత్రి చండ్రుగొండ మండలం మద్దుకూరు గుంపెనలోని ఆనందగిరి గుట్టలపై భక్తుల సహకారంతో నిర్మితమైన శ్రీ శ్రీ శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవస్థానంలో నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ మహోత్సవం మే 1 నుండి 6 వరకు వేద మంత్రోచ్చారణల నడుమ ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించబడింది. ఇందులో భాగంగా అగ్ని ప్రతిష్ఠ, మహాసంకల్పం, యజ్ఞాలు, విశేష హోమాలు, కలశ స్థాపన, ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీ సమేతంగా,జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలసి మహోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదాన్ని భక్తి శ్రద్ధలతో స్వీకరించారు. కార్యక్రమం మొత్తం భక్తి భావంతో సాగగా, ఆలయ పరిసరాలు 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో మార్మోగాయి. మహోత్సవాలు ప్రశాంతంగా, ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టాయి. భక్తులకు తాగునీరు, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు సమర్థవంతంగా కల్పించబడ్డాయి. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ ట్రస్టు సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రోప్ వే పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం, మే 06(మనం న్యూస్):** ఖమ్మం ఖిల్లా వద్ద రోప్ వే పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం ఖమ్మం ఖిల్లా వద్ద జరుగుతున్న రోప్ వే పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రస్తుతం లోయర్ స్టేషన్ పాయింట్ వద్ద పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పనుల వేగాన్ని పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలంలో పనులు నిలిచిపోకుండా ఉండేందుకు అవసరమైన పనులను ఇప్పుడే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే రోప్ వే కేబిన్ల తయారీ పనులు కోల్కతాలో సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. రోప్ వే ప్రాజెక్ట్ ద్వారా పర్యాటకాభివృద్ధి జరుగుతుందని, ఖమ్మం ఖిల్లా ప్రాంతాన్ని ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రోప్ వే నిర్మాణంలో నాణ్యత, భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ఈ రోప్ వే పనులు పరిశీలనలో డిప్యూటీ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, ఏజెన్సీ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## పంట అవశేషాలను కాల్చవద్దు..

### పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం కాపాడాలి

**కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం, మే 06(మనం బ్యూరో):** పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు,ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. పంట అవశేషాలను కాల్చినపుడు కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.అలాగే, పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు.రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి గ్రీన్ సిగ్నల్...

- ఫలించిన మంత్రి తుమ్మల కృషి'
- 'నిర్మాణానికి టిటిడి బోర్డు ఆమోదం
- 'ఖమ్మానికి నూతన శోభ
- 'ఆధ్యాత్మిక కేంద్రం దిశగా అడుగు
- '20 ఎకరాల్లో తిరుమల తరహా నిర్మాణం



**ఖమ్మం, మే 6(మనం బ్యూరో):** ఖమ్మం నగర ఆధ్యాత్మిక చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచే పరిణామం చోటుచేసుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ బోర్డు అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, ఎన్నో ఏళ్లుగా భక్తులు ఎదురుచూస్తున్న కల సాకార దశలోకి అడుగుపెట్టింది. తెలంగాణ ప్రభుత్వం ధ్వంసలాపురం రెవిన్యూ పరిధిలో కేటాయించిన 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రతిష్టాత్మక ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. రాష్ట్ర క్యాబినెట్ ఇప్పటికే భూమి కేటాయింపుకు ఆమోదం తెలపగా, తాజాగా టీటీడీ బోర్డు కూడా అనుమతి ఇవ్వడంతో నిర్మాణానికి అన్ని మార్గాలు సుగమమయ్యాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి, రెండు రాష్ట్రాల ప్రభుత్వాల సమన్వయం ఈ ప్రతిష్టాత్మక యత్నానికి బలంగా నిలిచాయి. తిరుమల తరహా దర్శనం, సదుపాయాలు ఖమ్మంలోనే అందుబాటులోకి రానుండగా, జిల్లా 'చిన్న తిరుమల'గా రూపుదిద్దుకునే దిశగా ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

### ఫలించింన తుమ్మల కృషి....

ఈ మహత్తర ప్రాజెక్టు సాధనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, తిరుమల దర్శనానికి వెళ్లలేని వారికి స్థానికంగానే టీటీడీ తరహాలోనే శ్రీవారి ఆలయం ఏర్పాటు చేయాలని ఆయన నిరంతరం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించడం ద్వారా ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది.

### 20 ఎకరాల్లో తిరుమల వాతావరణం...

ద్వంసలాపురం పరిధిలో కేటాయించిన 20 ఎకరాల భూమిలో ఆలయంతో పాటు యాత్రికుల కోసం వసతి గృహాలు, కళ్యాణ మండపం, పార్కింగ్ సౌకర్యాలు, ధార్మిక కార్యకలాపాల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఖమ్మంలో తిరుమల తరహా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడనుంది. ఈ ఆలయ నిర్మాణం ద్వారా ఖమ్మం ప్రాంతానికి ఆర్థిక, సామాజికంగా ఊతం లభించనుంది. పర్యాటక రద్దీ పెరగడంతో స్థానిక వ్యాపారాలు చురుకుదనాన్ని సంతరించుకోనున్నాయి. ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు రహదారులు, మౌలిక వసతులు మెరుగుపడే అవకాశముంది.

### తిరుమల శైలిలో నిర్మాణం....

టీటీడీ నిర్మించే ఆలయాలు సాధారణంగా తిరుమల శైలిని ప్రతిబింబిస్తాయి. ఖమ్మంలో కూడా అదే నమూనాలో ఆలయ నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది. దీంతో భక్తులకు తిరుమల వాతావరణాన్ని ఇక్కడే అనుభవించే అవకాశం కలగనుంది. మొత్తంగా, టీటీడీ ఆమోదంతో ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం భక్తి, అభివృద్ధి, ఆర్థిక పురోగతికి కొత్త దారులు తీసుకురానుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఖమ్మం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరింది

త్వరలోనే టీటీడీ అధికారులతో సమావేశమై నిర్మాణ పనులను వేగవంతం చేస్తాం అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో భూమి కేటాయింపుకు ముందడుగు వేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి



- వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు

**వైరా, మే 06 (మనం న్యూస్):** రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న రైతు వారోత్సవంలో భాగంగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో మూడో రోజైన బుధవారం వైరా రైతు వేదికలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, బ్యాంకింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలు అందించాలని సూచించారు. అప్పుడు రైతుకు పూర్తిగా పూర్తిస్థాయిలో లాభం వచ్చినప్పుడే రైతు అలాంటి పంటల వైపు మొగ్గు చూపుతాడని, రైతులు ఒకే పంటను పండించకుండా అన్ని రకాల పంటలు పండించాలని, ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు, కొత్తగా వస్తున్న మార్పులపై దృష్టి సారించి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా పంటలు పండించాలని సూచించారు. పంటల సాగుతో పాటు, పండించిన పంటల ద్వారా అధిక లాభాలు పొందేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, కోల్ స్టోరేజ్ వంటి సౌకర్యాలు వినియోగించుకొని పంటలు నిల్వ చేసుకోవడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని అన్నారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వరిలో ఎల్లప్పుడూ దొడ్డు బియ్యం కాకుండా, డిమాండ్ ఉన్న సన్న బియ్యం ఇతర రకాల ధాన్యాన్ని పండించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కాపా మురళి కృష్ణ , ఎంపీడీఓ సక్రియ నాయక్ , మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజు ఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారి మేడ రాజేష్ ,సొసైటీ సీఈఓ రామకృష్ణ ,మార్కెటింగ్ సెక్రటరీ, బ్యాంకు ఫీల్ ఆఫీసర్ , మార్కెటింగ్ డైరెక్టర్ సిబ్బంది గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

## దమ్మపేట పంచాయతీ కార్యాలయంలో చోరీ

- 4న ప్రజా దర్బార్‌లో కలెక్టర్‌కు వార్డు సభ్యుల ఫిర్యాదు
- ముఖ్యమైన రికార్డులు అపహరణ
- చోరీ వెనుక ఎవరి హస్తం?
- కంప్యూటర్ డేటా ఎవరికి అవసరం....????



**దమ్మపేట, మే 06 (మనం న్యూస్) :** దమ్మపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం మరోసారి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కార్యాలయం తాళాలు తీసి లోపలికి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు కార్యదర్శి గదిలోని బీరువా పగలగొట్టి అత్యంత కీలకమైన రికార్డులు ఎత్తుకెళ్లడం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటనపై పంచాయితీ కార్యదర్శి బి అనంత కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం సమయంలో యధావిధిగా సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లారు. సిబ్బంది సౌకర్యార్థం తాళాలు కార్యాలయ ఆవరణలోనే ఒక రహస్య ప్రదేశంలో ఉంచటం ఆనవాయితీగా వస్తోంది. బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పారిశుధ్య సిబ్బంది పంచాయతీ కార్యాలయానికి వచ్చి చూడగా కార్యదర్శి అనంత కుమార్, గది తాళం తీసి ఉండటం గమనించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శికి తెలపగా ఆయన వచ్చి చూసి రికార్డులు మాయమైనట్టు గుర్తించారు.

### చోరీకి గురైన రికార్డులు ఎవరికి అవసరం?

దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో చోరీకి గురైన రికార్డులు ఇవేనని తెలుస్తుంది. (2024, 2025, 2026 సంవత్సరాల సంబంధించిన గ్రామ సభ తీర్మాన రిజిస్టర్లు ఇంటి పన్ను పుస్తకాలు ఎంబి బుక్కుల( 2020)నుండి (20 25) వరకు సంబంధించిన సిబ్బంది హాజరు రిజిస్టర్ 2024 -26 కాలానికి సంబంధించిన నగదు పుస్తకాలు.బిల్లులు తీసుకెళ్లారు. కేవలం రికార్డులను తీసుకెళ్లడమే కాకుండా కార్యాలయంలోని కంప్యూటర్లో ఉన్న కీలకమైన ఫైళ్ళను కూడా నిందితులు డిలీట్ చేసినట్టు కార్యదర్శి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### వార్డు సభ్యుల ఆందోళన అంతా కావాలని చేసినట్టు ఉంది

ఈ దొంగతనం జరిగిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం రోజే గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కార్యదర్శిని కలిసి పలు రికార్డులు వివరాలు కావాలని కోరారు. ఆ మరుసటి రోజే ఉదయం 10 గంటల అత్యవసర సమావేశం జరగాల్సి ఉండగా ఈ చోరీ జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. పంచాయతీకి సంబంధించిన కీలక రికార్డులే ఇప్పుడు మాయం అవ్వడం వెనక పెద్దల హస్తం ఉందేమోనని వార్డు సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రికార్డులు మాయం చేసి తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతుందని వారు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి కార్యాలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ప్రతిసారి ఏదో ఒక వివాదంతో వార్తలోకి ఎక్కే దమ్మపేట గ్రామపంచాయతీ తాజాగా రికార్డులు మాయంతో మండలంలో తీవ్ర కలకలం రేపింది.

## 24/7 తెరిచే ఉంటాయి..!

- అర్ధరాత్రి వేళల్లోనూ బెల్ట్‌లో మద్యం పుష్కలం
- కల్తీ మద్యం సరఫరా?
- సిండికేట్ ఆదేశాలతో బెల్టు షాపుల నిర్వహణ
- అన్నీ తెలిసినా మౌనం వహిస్తున్న అబ్కారి శాఖ
- అధిక ధరలతో మందుబాబుల జేబులకు చిల్లు



**లక్ష్మీదేవిపల్లి, మే 06 (మనంన్యూస్):** ప్రస్తుతం ఏ ఊరికి వెళ్ళినా... ఏ వాడకు వెళ్ళినా... ఏ వీధికి వెళ్ళినా... బడి, గుడి కనపడకపోవచ్చు కానీ పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు మాత్రం దర్శనమిస్తున్నాయి. జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా బెల్ట్ షాపులు 24 గంటలు... వారమంతా తెరిచి ఉండడం... అదేవిధంగా ఎన్నికల సమయంలో... మహనీయుల జయంతి.. వర్ధంతి సందర్భంగా... అబ్కారి శాఖ వైన్ షాపులను మూసి వేయించిన కానీ బెల్ట్ షాపులు మాత్రం తెరిచే ఉంటున్నాయి. 24 గంటలు బెల్ట్ షాపుల్లో మద్యం పుష్కలంగా లభించడంతో మందుబాబులు కూడా మితిమీరి మద్యం సేవిస్తున్నట్లు తెలుస్తోంది. బెల్ట్ షాపులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారుల నుండి ఏ ఒత్తిడిలో లేకుండా సిండికేట్ వ్యాపారులు వారికి అండదండగా నిలవడంతోనే ప్రతి గల్లీలో పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు వెలుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ధరలు కూడా పెంచి విక్రయిస్తుండడంతో మందుబాబుల జేబులకు చిల్లు పడుతోందని పలువురు వాపోతున్నారు. ఇవన్నీ తెలిసినా అడ్డుకోవాల్సిన ఆప్కారి శాఖ మౌనం వహించడమేనక ఆంతరమేంటని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### బెల్టు షాపులకు కల్తీ మద్యం..?

మద్యం సిండికేట్ వ్యాపారులు తమ కార్యాలయాలు వేదికగా నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. స్టాక్ పాయింట్ల నుంచి తమ వద్దకు వచ్చిన మద్యం సీసాల మూతలు తీసి అందులో స్పిరిట్ కలిపేందుకు ప్రత్యేక ముఠాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో మూతకు పది రూపాయలు చెల్లిస్తూ కొంతమందిని కల్తీ మద్యం తయారు చేయడానికి వాడుకుంటున్నట్లు చర్చించుకోవడం గమనార్హం. ఇలా తయారుచేసిన కల్తిమధ్యాన్ని ఏకంగా వైన్ షాపుల్లో అమ్మకుండా బెల్ట్ షాపులకు తరలిస్తున్నారని మందుబాబులు మాట్లాడుకోవడం గమనించాల్సిన విషయం. వైన్ షాపుల్లో కల్తి మద్యం దొరికితే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో బెల్ట్ షాపులకు తరలించడం దానికి తోడు బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తుండడంతో తాము స్పిరిట్ కలిపేందుకు వెచ్చించిన వ్యయం మొత్తం బెల్ట్ షాపుల ద్వారా తమకు ఈజీగా వచ్చేస్తుందని భావించి ఇలా మద్యం దగాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.




### కృత్రిమ కొరతతో నిలువు దోపిడీ...

వైన్స్ షాపుల్లో వినియోగదారులు అడిగే పాపులర్ బ్రాండ్లు ముఖ్యంగా కేఎఫ్ లైట్ బీర్ మెన్షన్ హౌస్ స్టాక్ లేదని, ఇంకా ఇతర బ్రాండ్ మందులు లేవని యజమానులు చెప్తూ కృత్రిమ కొరత సృష్టిసున్నారని తెలుస్తోంది. ఇదే బ్రాండ్ మందు బెల్టు షాపుల్లో పుష్కలంగా దొరుకుతుందని, అక్కడ మాత్రం ధరలు పెంచి అమ్ముతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. లోపాయికారిగా ఆ స్టాక్ను బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు. సిండికేట్ మాయాజాలంతో వైన్స్ 180 ఉండాల్సిన మద్యం, బెల్ట్ షాపుల్లో 250 కి విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అదనపు వసూళ్లతో ఒక్కో బాటిల్ పై 120 నుండి 140 వరకు అదనంగా దండుకుంటూ సామాన్య కూలీల శ్రమను దోచుకుంటున్నారు.

### అర్ధరాత్రిలైనా బెల్ట్ లో మద్యం పుష్కలం...

మండలంలో మద్యం మాఫియా పడగవిప్పుతోంది. నిబంధనలు గాలికి ఎగిరిపోతుంటే, బెల్ట్ షాపులు ఊరూరా సామ్రాజ్యాలుగా విస్తరిస్తున్నాయి. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రం మొదలుకొని మారుమూల పల్లెల వరకు 'బెల్ట్' దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఉదయం 10 గంటలకు తెరుచుకోవాల్సిన మద్యం దుకాణాల కంటే ముందే, తెల్లవారుజామున 4:30 గంటలకే బెల్ట్ షాపులు వినియోగదారులకు 'స్వాగతం' పలుకుతుండటం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా మారుతోంది. తమ సంపాదనంతా మద్యం పాలవ్వడంతో పల్లెల్లో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మండలంలోని నడి సెంటర్ లో దర్జాగా పాన్ షాప్ పేరుతో బెల్ట్ షాప్ ని నడిపించడం చూస్తుంటే అధికారుల ఎంత తరహాలో సహకరిస్తున్నారనేది గమనించాలి.

### అన్నీ తెలిసినా మౌనం వహిస్తున్న అబ్కారి శాఖ

ఆప్కారి షాపులో పనిచేసే అధికారికి బెల్ట్ షాపులు గురించి తెలియకపోవడం ఏంటని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులే వెన్నుదన్నుగా నిలిచి ఈ అక్రమ సామ్రాజ్య విస్తరణకు తోడ్పాటు అందిస్తుంటే తమకేమీ తెలియదని బుకాయించడం సరికాదంటూ ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పేదల సంక్షేమం, రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రైతులకు రుణమాఫీ, మద్దతు ధరలతో అండగా ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇండ్లతో ప్రతి అర్హుడికి గృహ కల్పన లక్ష్యం
- ప్రజల వద్దకే పాలన - ప్రజాదర్బార్ ద్వారా సమస్యల పరిష్కారం
- సాదా బైనమా, భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం
- గువ్వల గూడెం ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి





**నేలకొండపల్లి, మే 06(మనం న్యూస్):** పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్లో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల దీవెనలతో ఏర్పడిన ప్రజాప్రభుత్వం గడచిన రెండు సంవత్సరాల నాలుగు నెలల కాలంలో పేద ప్రజలకు అండగా ఉంటూ, పేదల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. రైతు సంక్షేమంలో ఎక్కడ తగ్గకుండా, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేయడంలో దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అధికంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా, ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలోనే ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపి ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించామని అన్నారు.దొరల పాలనలో లక్ష రూపాయల రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తే, తమ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని, గత పాలకులు వరి వేస్తే ఉరి వేసినట్లే అని బెదిరిస్తే, తమ ప్రభుత్వం పూర్తి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు సన్న వడ్లకు క్వింటాల్కు 500 రూపాయలు చెల్లించామని అన్నారు.రైతు భరోసా క్రింద ఎకరానికి 12 వేలు పంట సహాయం అందిస్తున్నామని అన్నారు. ప్రస్తుత సంవత్సరం భారీ ఎత్తున వడ్లు, మొక్కజొన్న పంట పండినప్పటికీ ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఇప్పటికే పెద్ద ఎత్తున ఇండ్లు మంజూరు చేశామని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇండ్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మే నెలాఖరికి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, వేల సంఖ్యలో దరఖాస్తులు అందాయని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం అధిక దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.ధరణి కారణంగా వచ్చిన భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తున్నామని, పెండింగ్లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను అర్హత మేరకు త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. రాబోయే 35 రోజులలో సాదా బైనమా దరఖాస్తులు అర్హత మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా దర్బార్ లో వచ్చిన న్యాయబద్ధమైన ప్రతి దరఖాస్తుకు గరిష్టంగా మూడు నెలలలో పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.లబ్ధిదారుల స్పందన:గువ్వలగూడెం గ్రామంకు చెందిన ఒంగోలు ఉష మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన తాను ఎంతో ఆనందంగా ఉన్నానన్నారు. గత 10 సంవత్సరాల్లో ఇంత మంచి కార్యక్రమం జరగలేదని, ప్రభుత్వం చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిందని తెలిపారు. తమ గ్రామానికి ఇందిరమ్మ పథకం క్రింద 35 ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమని, గతంలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో సంతోషంగా ఉన్నానని, ఇందిరమ్మ ఇళ్లు పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు.నేలకొండపల్లి లబ్ధిదారు గుడిపూడి నాగమణి మాట్లాడుతూ గతంలో ప్రయాణాలకు ఛార్జీలు ఉండేవని, ఇప్పుడు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం లభించడం వల్ల సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను పేదలందరికీ అందిస్తూ ఇది నిజంగా పేదల ప్రభుత్వం అని నిరూపించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఎరువులు విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- వానాకాలం ఎరువులు, విత్తనాలు సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం




**భద్రాద్రి కొత్తగూడెం, మే 06 (మనంప్రతినిధి):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్కు సంబంధించిన ఎరువుల సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు, విత్తనాలు మరియు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,59,743 ఎకరాల్లో సాగు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, 1 లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 1.75 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు అవుతున్నాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో అధిక దిగుబడులు సాధించామని, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయిలో ఉత్పత్తి లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించి ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు పారదర్శకంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటూ జిల్లా మరియు మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల సరఫరా ఎంతో సున్నితమైన అంశమని, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్ నుండి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు లభిస్తాయని భావించి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితులు ఉండవచ్చని, అలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గత సంవత్సరంలో జిల్లాలో ఐదు నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఎరువుల వినియోగం, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, స్టాక్ నిర్వహణ, ఆన్లైన్ నమోదు విధానాలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు ఎరువుల డీలర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం




**నేరేడుచర్ల, మే 6 మనం న్యూస్:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినదని నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతు వారము కార్యక్రమం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం జరిగింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రగతిపై నివేదిక అనుబంధ శాఖల అధికారులు వారి వారి శాఖలలో అభివృద్ధి రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు రైతుల ఆదాయం పెంపు, ఉత్పాదకత వృద్ధి, నసాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి లక్ష్యాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుల సంక్షేమం కోసం పలు ముఖ్యమైన కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఈ శాఖ ముఖ్యంగా రైతులకు సరైన ధర, మార్కెట్ సదుపాయాలు, మధ్యవర్తుల దోపిడీ నుంచి రక్షణ వంటి లక్ష్యాలతో పనిచేస్తుంది.

**ముఖ్య సంక్షేమ కార్యక్రమాలు...**

ఈ కార్యక్రమములో వ్యవసాయ మార్కెట్ కమిటీ నేరేడుచర్ల చైర్ పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి నేరేడుచర్ల మున్సిపాలిటీ చైర్మన్ శ్రీ కొణతం చిన్న వెంకటరెడ్డి వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ నేరేడుచర్ల గౌరవ సభ్యులు అందే రామకృష్ణ మధుసూదన్ రెడ్డి కొడాలి పట్టయ్య గారు సంజీవరెడ్డి సైదిరెడ్డి సర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్రీ రహీం నేరేడుచర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి సోమ సుందర్ రెడ్డి నేరేడుచర్ల మండల వ్యవసాయ శాఖ అధికారి జావేద్ నేరేడుచర్ల మండల వెటర్నరీ డాక్టర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు సీఈవోలు నేరేడుచర్ల మున్సిపల్ పరిధి కౌన్సిలర్లు సర్పంచులు రైతులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు

- అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు
- ధాన్యం రవాణా, హమాలీలు, గన్నీబ్యాగులపై సమగ్ర ఏర్పాట్లు చేయాలి
- మంత్రి డి.శ్రీధర్ బాబు



**మంథని,మే-06 (మనం న్యూస్):** ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి మంథని మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు.దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా కల్పించారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర గన్నీ బ్యాగులు,టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు.ఈ పర్యటనలో మంత్రి వెంట మంథని ఆర్డిఓ సురేష్,సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మొక్కజొన్న దిగుమతి కేంద్రం పరిశీలన

**కల్వకుర్తి మే06(మనం న్యూస్):** మొక్కజొన్న దిగుమతి కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేసే సహించేది లేదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న దిగుమతి కేంద్రంలో రైతులు ఇబ్బందులు పడుతున్నా విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం నేరుగా జిన్నింగ్ మిల్లు వద్దకు వెళ్లి మొక్కజొన్న నిల్వల గోదాంలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రైతులకు ఇబ్బందులు లేకుండా మొక్కజొన్నను కొనుగోలు చేయాలని ఫోన్లో జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి,నాయకులు సురేందర్ రెడ్డి,రమాకాంత్ రెడ్డి,హరిశ్వర్ రెడ్డి,రైతులు తదితరులు ఉన్నారు.



# భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు పునరావసం కల్పించాలి



**పుట్టపర్తి మే 6 మనం న్యూస్:** భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతాంగానికి నష్ట పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని పుట్టపర్తి ఆర్ డి ఓ సువర్ణకు ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి, బీడుపల్లి గ్రామాల రైతుల నుండి తీసుకుంటున్న భూములకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలనీ వ్యవసాయ కూలీలు, శ్రామికులు ( ఉపాధి కూలీలు) వృత్తిదారులు చిన్న, సన్న కారు, వ్యాపారస్తులనని వారికి ఉన్న భూమి పోతే పునరావాసం ఉండదని వారికి పునరావసం కల్పించాలని కోరారు. రైతులకు చట్టం యొక్క ప్రాధాన్యతను వివరించి ప్రజాభిప్రాయం సేకరణ ద్వారా చేయాలనీ, కోరారు. కానీ ప్రస్తుత భూసేకరణ హడావిడగా గందరగోళంగా భయభ్రాంతులకు గురి చేసే విధంగా , రైతులకు తెలియచేయకుండా గ్రామసభలు నిర్వహించి ప్రజా ఆమోదం పొందకుండా వారిని భయభ్రాంతులకు గురిచేసి భూసేకరణ చేయడం సబబు కాదని తెలిపారు. గ్రామాల్లో పలువురి రైతులకు నోటీసులు కూడా అందలేదనీ, అంతేకాక ప్రతి రైతుకి ఒకే నెలకు మూడు నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఎకరా భూమికి 32 లక్షలు రైతుకు చెల్లిస్తే పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో నాలుగు సెంట్లు స్థలం కూడా రాదని వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంగా దీనినీ తీవ్రంగా ఖండిస్తుందని, భవిష్యత్తులో భూములు సేకరణ ముందు గ్రామ కమిటీల ద్వారా, గ్రామసభల ద్వారా భూసేకరణ చేయాలని కోరారు. 2013 భూ సేకరణ పై రెవెన్యూ సిబ్బంది రైతులకు ఏమాత్రం స్పష్టత ఇవ్వలేదనీ, భూములు కోల్పోతున్న ప్రతి ఇంటికి ఇక్కడ స్థాపించే పరిశ్రమల్లో పెర్మనెంట్ ఉద్యోగం ఇస్తామని మాట పూర్వితంగా చెబుతున్నారు కానీ రాతపూర్వితంగా ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ సెంటు లక్ష రూపాయలు ఉంటే ఎకరాకు కోటి రూపాయలు ఇవ్వాలి, కానీ , మార్కెట్ వ్యాల్యూ కన్నా తక్కువగా ఇవ్వడం రైతులను మభ్యపెట్టడమేనని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు భూములు ఇస్తున్న రైతులకు ఎకరాకు కోటి రూపాయలు ఇచ్చి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

# ధర్మవరం తాలూకా జె.ఎ.సి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎంపిక




- ధర్మవరం తాలూకా యూనిట్ కార్యవర్గం చైర్మన్ శంకరనారాయణ

**ధర్మవరం అర్బన్ మే 6, మనం న్యూస్:** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ధర్మవరం తాలూకా జె.ఎ.సి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎంపిక చేశామని శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం తాలూకా యూనిట్ రాష్ట్ర జె.ఎ.సి చైర్మన్ కామ్రేడ్ విద్యా సాగర్ గ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోం లో ధర్మవరం తాలూకా జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా నాయకులు అధ్యక్షతన ఎంపిక చేశారు. ధర్మవరం తాలూకా యూనిట్ కార్యవర్గా చైర్మన్ శంకరనారాయణ (అధ్యక్షుడు, ఏపీ ఎన్జీవో ఎస్ ధర్మవరం యూనిట్).కార్యదర్శి అమర్ నారాయణ రెడ్డి ( యుటిఎఫ్), కోశాధికారి శంకరనారాయణ ఏపీటీఎఫ్), వైస్ చైర్మన్ ఉదయభాస్కర్ ( ఏపీ ఎన్జీవో ఎస్),వైస్ చైర్మన్ ఎ.వి. శివారెడ్డి ( పిఆర్టియు),వైస్ చైర్మన్ గాయత్రిదేవి (సచివాలయం)సంయుక్త కార్యదర్శిచలపతి (అధ్యక్షుడు పెన్షనర్స్ అసోసియేషన్) సంయుక్త కార్యదర్శి-2: కే. మదుసూదన్ ( ఏపీఎస్ఆర్టీసీ)సంయుక్త కార్యదర్శి-3: ఆర్.గోపాలకృష్ణ నాయక్ (వెటర్నరీ)వీరితో పాటు మరో పది మందిని ఈసీసభ్యులుగా.వెంకటరావు డు చంద్రమోహన్,రాంప్రసాద్,హరికృష్ణ ,గురురాగవేంద్ర,జగదీష్ ,.జైనుల్లాబుద్దిన్, .వెంకటకిశోర్, జలజాక్షి బాలకదిరన్న ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయ చంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులుముత్యాలప్ప, పి ఆర్ టి యు నాయకులు చెంద్రమోహన్, ఏ పి ఎన్ జి ఓ ఎస్ కార్యదర్శి శ్రీనివసులుగారు ఏపీఎస్ఆర్టీసీ నాయకులు, పెన్షనర్స్ మరియు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు మరియు వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెన్సస్ ఎన్యూమరేషన్ను పరిశీలించిన తహసీల్దార్ ఫాజిల్



**పోడూరు, మే 6 మనం న్యూస్ :** పోడూరు మండలంలో సెన్సస్-2027 కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందని తహసీల్దార్ ఎస్.ఎం.ఫాజిల్ తెలిపారు.మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు.మండల పరిధిలోని 142 హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ ( హెచ్ ఎల్ బిఎస్) కు 102 మంది ఎన్యూమరేటర్లను, 10 మంది రిజర్వ్ సిబ్బందిని, 16 మంది సూపర్వైజర్లను నియమించినట్లు ఆయన వెల్లడించారు.మొత్తం16,611 ఇళ్లకు గాను ఇప్పటివరకు 2,178 ఇళ్ల ఎన్యూమరేషన్ పూర్తి అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కొమ్ముచిక్కాల, కవిటం గ్రామాలను సందర్శించి ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించినట్లు పేర్కొన్నారు.అలాగే ప్రత్యేకంగా కొమ్ముచిక్కాల గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వే తీరును తహసీల్దార్ ఎస్.ఎం. ఫాజిల్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# మంత్రి సురేఖపై హనుమాన్ భక్తుల నిరసన




**భీమదేవరపల్లి మే 6 మనం న్యూస్:** భీమదేవరపల్లిలో హనుమాన్ భక్తులు మంత్రి అనుచిత వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. బుధవారం రోజున భీమదేవరపల్లి ఉపసర్పంచ్ శనిగరం ఐలయ్య ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు నిరసన తెలిపి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ శ్రీరాముని పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మంత్రి పదవికి అనర్హురాలని మండిపడ్డారు. వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిధిలోనిహనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక సహకార సంఘాలతో రైతులకు ఎన్నో లాభాలు

- ప్రాథమిక సహకార సంఘాల జేడీ పద్మజ

**కల్వకుర్తి మే06(మనం న్యూస్):** ప్రాథమిక సహకార సంఘాలతో రైతులకు ఎన్నో లాభాలు చేకూరుతాయని ప్రాథమిక సహకార సంఘాల జేడీ పద్మజ పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయం చైర్మెన్ తలసాని జనార్దన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘాల జేడీ పద్మజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రాథమిక సహకార సంఘాలను వినియోగించుకోవాలని అన్నారు.అదేవిధంగా రైతులకు మార్కెటింగ్ సేవలతో పాటు ప్రాథమిక సంఘాల ద్వారా కలిగే ఆదాయ లాభాలను వివరించారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా డిసిఓ రఘునాథ్, కల్వకుర్తి పిఎసిఎస్ వైస్ చైర్మన్ శ్యాంసుందర్,డైరెక్టర్ వెంకటయ్య,ఎడిఎ ఇంచార్జ్ మంజుల,డీసీసీబీ మేనేజర్ గోపాల్,సహకార శాఖ అధికారులు శ్రీనివాస్, ముక్తదీర్,సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



# అన్నాడీఎంకేలో ముసలం..

## విజయ్‌కు మద్దతుగా మెజార్టీ ఎమ్మెల్యేలు..!

**చెన్నై, మే 6:** దేశం దృష్టి మొత్తం ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల పైనే ఉంది. అందుకుతగ్గట్టే అక్కడి పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మెజార్టీ మార్కు 10 అడుగుల దూరంలో ఉన్న టీవీకేకు ఎవరి నుంచి మద్దతు లభిస్తుందనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని వార్తలు వస్తుండగా.. అన్నాడీఎంకేకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా అందుకు రెడీగా ఉన్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే నేత, మాజీ సీఎం పళనిస్వామితో టీవీకే నేత సమావేశమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

టీవీకే చీఫ్ విజయ్ దెబ్బకు అన్నాడీఎంకేలో ముసలం పుట్టినట్లు తెలుస్తోంది. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు అన్నాడీఎంకే నేత, రాజ్యసభ ఎంపీ షణ్ముగమ్ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. చెన్నైలో జరిగిన ఈ సమావేశంలో భాగంగా టీవీకేతో పొత్తు గురించి ఆలోచించమని తమ పార్టీ జనరల్ సెక్రటరీ ఎడప్పాడి కె.పళనిస్వామిని వారు కోరినట్లు తెలుస్తోంది. ఈ భేటీ జరిగిన కాసేపటికే టీవీకే నేత ఆనంద్.. పళనిస్వామిని కలవడం గమనార్హం. ఇక విజయ్‌కు




మద్దతు ఇవ్వడంపై అడిగిన ప్రశ్నకు ఏఐఏడీఎంకే అధికార ప్రతినిధి కొవై సత్యన్ మాట్లాడుతూ.. ''బంతి విజయ్ కోర్టులోనే ఉంది'' అని బదులిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చినా టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు ఆ బలం సరిపోదు. మరి ఈ పరిణామాల నేపథ్యంలో అన్నాడీఎంకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలాఉంటే.. ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ విజయ్.. వీసీకే చీఫ్‌నకు లేఖ రాశారు. ఆ పార్టీ గెలిచిన సీట్ల సంఖ్య రెండు. ఒకవైపు పలు పార్టీల మద్దతు కోరుతున్న ఆయన గురువారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే నేడు గవర్నర్ కలవనున్నారని సమాచారం.



## యూఏఈపై మళ్లీ ఇరాన్ దాడులు

**దుబాయ్, మే 6:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై ఇరాన్ వరుసగా రెండో రోజూ దాడులు చేసింది. టెహ్రాన్ మంగళవారం తమ దేశంపైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించిందని.. వాటిని తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని యూఏఈ తెలిపింది. తాజా పరిణామం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. దాడులు చేసి ప్రజలను చంపాలని తాను కోరుకోవడం లేదని, కాబట్టి టెహ్రాన్ తెలివిగా వ్యవహరించాలని సూచించారు. ఇరాన్‌లో ద్రవ్యోల్బణం 150%కు పెరిగిందని.. సైనికులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఆ దేశం ఉందని విలేకర్లతో మాట్లాడుతూ పేర్కొన్నారు. మరోవైపు- హర్మూజ్‌లో, యూఏఈపై ఇరాన్ తాజాగా దాడులకు పాల్పడినప్పటికీ.. ఆ దేశంతో తమ కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. హర్మూజ్ చుట్టూ గగనతలంలో తమ దేశానికి చెందిన 100 మిలిటరీ విమానాలు గస్తీ తిరుగుతున్నాయని అమెరికా సైనిక ఉన్నతాధికారి డాన్ కైన్ తెలిపారు. హర్మూజ్‌లో టోల్ వసూళ్లను ఆపి, స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించకపోతే ఇరాన్‌పై ఆంక్షలు విధించేందుకు వీలుగా ఐక్యరాజ్య సమితిలో తీర్మానం ప్రవేశపెట్టేందుకు అమెరికా, గల్ఫ్ దేశాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ముసాయిదా తీర్మానాన్ని తయారుచేశాయి.

## రెండు గంటల్లో 2 చోట్ల పేలుళ్లు..




- జలంధర్ పేలుడు మా పనే: ఖలిస్థానీ లిబరేషన్ ఆర్మీ
- పంజాబ్‌లో హైఅలర్ట్

**జలంధర్, మే 6:** వరుస పేలుళ్లతో పంజాబ్ దద్దరిల్లింది. రెండు గంటల్లో 2 చోట్ల పేలుళ్లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ రెండు ఘటనలూ ఆర్మీ యూనిట్లకు సమీపంలోనే జరగడం మరింత ఆందోళనలను రేకెత్తిస్తోంది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జలంధర్‌లోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రధాన కార్యాలయం సమీపంలో పేలుడు చోటుచేసుకుంది. కార్యాలయం బయట పార్క్ చేసి ఉన్న ఒక స్కూటర్ పేలింది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలం సమీపంలో ఉన్న పలు వాహనాలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఒక కిలోమీటరు వరకు పేలుడు శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. ఈ పేలుడులో ఏదైనా కుట్రకోణం ఉందా అనే దానిపైనా అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత.. అమృత్‌సర్‌లో మరో పేలుడు చోటుచేసుకుంది. అటారీ రోడ్డులోని ఆర్మీ ఖాసా కంటోన్మెంట్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రదేశంలో రేకును పోలిన శకలాలు దొరికాయని దీంతో ఎవరో పేలుడు పరికరాన్ని విసరడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి, దాడి చేసి, ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు.

కాగా..జలంధర్‌లో చోటుచేసుకున్న ఈఐడీ పేలుడు తమ పనేనని ఖలిస్థానీ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. ఫిబ్రవరిలో గురుదాస్‌పూర్ జిల్లాలో పంజాబ్ పోలీసుల చేతిలో హతమైన ఉగ్రవాది రంజీత్ సింగ్ మృతికి ప్రతీకారంగానే ఈ పేలుడు జరిపినట్లు ఓ ప్రకటనలో కేఎల్‌ఏ పేర్కొంది. ఈ పేలుడులో ఇద్దరు బీఎస్‌ఎఫ్ జవాన్లు మరణించగా.. మరో ముగ్గురు గాయపడ్డారని తెలిపింది. అయితే, ఈ మరణ వార్తలను పోలీసు అధికారులు ఖండించారు.

## 'మెట్ గాలా'లో తెలుగమ్మాయి లుక్‌పై చర్చ!

**న్యూయార్క్, మే 6:** అమెరికాలోని న్యూయార్క్‌లో నిర్వహించిన 'మెట్ గాలా 2026' ఫ్యాషన్ షోలో అనేక మంది భారతీయ సెలబ్రిటీలు పాల్గొన్నారు. వారిలో తెలుగమ్మాయి భవిత మండవ ఒకరు. ప్రముఖ ఫ్రెంచ్ లగ్జరీ ఫ్యాషన్ సంస్థ 'షనెల్' తరఫున మొదటి భారతీయ అంబాసిడర్‌గా ఆమె ఈ వేడుకకు హాజరయ్యారు. అయితే.. ఫ్యాషన్ ప్రపంచంలో లగ్జరీ హంగులు, విభిన్న వస్త్రాలంకరణలకు వేదికైన 'మెట్ గాలా'కు ఆమెను మరీ సాదాసీదాగా పంపించారంటూ 'షనెల్'పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పారదర్శకమైన బ్లౌజ్, రంగు వెలిసిన డెనిమ్ లాంటి సిల్క్ ప్యాంట్, షనెల్ సంస్థ స్లింగ్‌బ్యాక్‌లను ధరించి భవిత ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వాస్తవానికి.. న్యూయార్క్ సబ్‌వేలో ఆమెను మొదటిసారి గుర్తించినప్పుడు ఆమె ధరించిన దుస్తులకు గుర్తుగా 'షనెల్' డిజైనర్ మాథ్యూ ఈ లుక్‌ను రూపొందించారు. కానీ, ప్రఖ్యాత వేదికపై ఇటువంటి ప్రయోగాలు ఆమె ఫ్యాషన్ కెరీర్‌ను దెబ్బతీసే అవకాశం ఉందని పలువురు విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే ఆమెను ఇలా పంపారని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో 'షనెల్' తరఫున నికోల్ కిడ్మన్ తదితరులు ఆర్భాటంగా వచ్చారని గుర్తుచేశారు.

''షనెల్ తరఫున ఓ భారతీయ అంబాసిడర్‌కు లభించిన అతిపెద్ద అవకాశాల్లో ఈ ఫ్యాషన్ షో ఒకటి. గ్లామర్, వ్యక్తిత్వం, సాంస్కృతిక విశిష్టతను చాటిచెప్పేలా ఆమె వస్త్రధారణ ఉండాలి. కానీ, ఇక్కడ వాటిని విస్మరించారు'' అని పలువురు పేర్కొన్నారు. మరికొందరు ఆమె లుక్‌ను సమర్థించారు.



ఏదైనా ఒక సందేశాన్ని ఇవ్వడానికి ఫ్యాషన్‌కు ఎల్లప్పుడూ హంగులు అవసరం లేదని వాదించారు. హైదరాబాద్‌కు చెందిన భవిత.. జేఎన్‌టీయూహెచ్ నుంచి ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ పూర్తిచేశారు. మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లారు. న్యూయార్క్‌లోని సబ్ వేలో 'షనెల్' డిజైనర్ మాథ్యూ ఆమెను పరిచయం చేసుకున్నారు. 'చాలా అందంగా ఉన్నారు. మా ఫ్యాషన్లో మోడల్‌గా చేస్తారా' అని అడిగాడు. ఆ డిజైనర్ మాటతో ఆమె జీవితం మారిపోయింది. ప్రముఖ, అంతర్జాతీయ రన్‌వేల్లో పాల్గొన్నారు. న్యూయార్క్, పారిస్, మిలాన్, లండన్ ఫ్యాషన్ వీక్‌లో డియోర్ వంటి ప్రముఖ సంస్థలకు పనిచేశారు.

## మాదక ద్రవ్యాల నావపై దాడి.. ఇద్దరి మృతి

- అమెరికా సైన్యం ప్రకటన

**వాషింగ్టన్, మే 6:** కరీబియన్ సముద్రంలో మాదక ద్రవ్యాలు మోసుకెళ్తున్న ఒక పడవపై తాము జరిపిన దాడిలో ఇద్దరు మరణించారని అమెరికా సైన్యం ప్రకటించింది. లాటిన్ అమెరికా సముద్ర జలాల్లో సాగుతున్న మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ట్రంప్ యంత్రాంగం గత సంవత్సరం సెప్టెంబరు నుంచీ నిర్వహిస్తున్న దాడుల్లో ఇప్పటి వరకూ మొత్తం 188 మంది మరణించారు. తూర్పు పసిఫిక్ మహా సముద్రంలోనూ అమెరికా ఇలాంటి దాడులే నిర్వహిస్తోంది. అమెరికా యంత్రాంగం తీవ్ర చర్యలు తీసుకుంటున్నా పశ్చిమార్ధగోళంలో సాగుతున్న మాదక ద్రవ్యాల ఉగ్రవాదం సద్దుమణగడం లేదు. అయితే అమెరికా దాడులు నిర్వహించిన పడవల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సాగుతోందన్న సాక్ష్యాధారాలేవీ అమెరికా బహిర్గతం చేయడంలేదు. సోమవారం జరిగిన తాజా దాడిలో స్మగ్లింగ్ మార్గాలపై గురిపెట్టామని అమెరికా సైన్యం సదరన్ కమాండ్ విభాగం పునరుద్ఘాటించింది. లాటిన్ అమెరికాలోని మాదకద్రవ్యాల ముఠాలపై తాము యుద్ధం సాగిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.



## హర్మూజ్‌లో 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'కు బ్రేక్..




- ట్రంప్ కీలక ప్రకటన

**వాషింగ్టన్, మే 6:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన విదేశీ నౌకలను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రారంభించిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'కు బ్రేక్ పడింది. ఇరాన్‌తో దౌత్య చర్చల్లో పురోగతి నేపథ్యంలో దీన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్లో పోస్టు పెట్టారు.

పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు, ఇరాన్‌పై సాధించిన విజయాన్ని దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో ఇరాన్ ప్రతినిధులతో ఒక సంపూర్ణ, తుది ఒప్పందం దిశగా కొనసాగుతోన్న ప్రయత్నాల్లో పురోగతి సాధించామన్నారు. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టంచేశారు. ఒప్పందంపై పూర్తి స్పష్టత వచ్చేంతవరకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇక, ఓవల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ బహిరంగ ప్రకటనలకు విరుద్ధంగా తమతో ఒక ఒప్పందం చేసుకునేందుకు రహస్యంగా ప్రయత్నిస్తుందని ట్రంప్ అన్నారు. ఈసందర్భంగా ఇరాన్ లొంగిపోవాలని ఆయన హెచ్చరించారు. తాము పూర్తిస్థాయిలో పోరాటానికి దిగితే వారు దాన్ని ఆపలేరని వ్యాఖ్యానించారు.

అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ మీదుగా నౌకల రాకపోకలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో విదేశీ నౌకలను జలసంధి నుంచి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఉద్దేశంతో ట్రంప్ ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను ప్రకటించారు. దీన్ని మానవతా చర్యగా అభివర్ణించారు. కాగా.. ఇది ప్రారంభమైన కొన్ని గంటలకే తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

## టీఎంసీపై రూ.100 కోట్ల దావా వేస్తా: మెస్సి టూర్ ప్రమోటర్

**కోల్‌కతా, మే 6:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై రూ.100 కోట్లు దావా వేస్తా అని లియోనెల్ మెస్సి టూర్ ప్రమోటర్ శతద్రు దత్తా బెదిరించారు. గతేడాది మెస్సి భారత పర్యటన సందర్భంగా కోల్‌కతా స్టేడియంలో అనుచిత ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి శతద్రు జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓడిపోయిన నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా వరుస పోస్టులు పెట్టారు.



కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ వద్ద జరిగిన ఘటన తర్వాత టీఎంసీ తన మూడేళ్ల కష్టాన్ని నాశనం చేసి.. తన ప్రతిష్టకు భంగం కలిగించిందని శతద్రు ఆరోపించారు. 'ఎన్నికల్లో ఓడినంత మాత్రాన మీకు శిక్ష పడిందని అనుకోవద్దు. నేను మీపై పరువు నష్టం కేసు పెడతా. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి చివరివరకు పోరాడతా' అని ఆయన పోస్టులో రాసుకొచ్చారు. పదవీ విరమణ చేయనున్న బెంగాల్ క్రీడాశాఖ మంత్రి అరూప్ బిస్వాస్‌పై కూడా శతద్రు మండిపడ్డారు. మంత్రి, ఆయన సహచరులు ఫుట్‌బాల్ ఆటగాడి చుట్టూ గుమిగూడటం వల్లే స్టేడియంలోని ప్రేక్షకుల్లో ఆగ్రహం రేకెత్తించిందన్నారు. 'స్టేడియంలో ఫొటోలు తీయవద్దని నేను పదేపదే అతనికి చెప్పాను. కానీ, బిస్వాస్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి ఫొటోలు తీశాడు. దీనికి అతను మూల్యం చెల్లించుకోక తప్పదు' అని ఆయన అన్నారు. త్వరలోనే విలేకరుల సమావేశం పెట్టి ఘటనకు సంబంధించిన అన్ని విషయాలు బయటపెడతానన్నారు.

గతేడాది 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి తొలుత కోల్‌కతాకు వెళ్లాడు. అక్కడి సాల్ట్‌లేక్ స్టేడియంలో చెప్పినదాని కంటే తక్కువ సమయం గడపడంతో అభిమానులు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ ఘటనకు సంబంధించి ఈవెంట్ నిర్వాహకుడు శతద్రుతో పాటు మరికొందరిపైనా పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన శతద్రు 37 రోజులు జైల్లో గడపాల్సి వచ్చింది.

## అర్ధరాత్రి టీఎంసీ ఆఫీసుపైకి బుల్డోజర్..

- కోల్‌కతాలో హైటెన్షన్

**కోల్‌కతా, మే 6:** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు రాజకీయ దుమారానికి దారితీశాయి.




ఫలితాలు వెలువడిన తర్వాత పలుచోట్ల బీజేపీ, టీఎంసీ వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ క్రమంలోనే మంగళవారం అర్ధరాత్రి కోల్‌కతాలోని తృణమూల్ పార్టీ కార్యాలయం పైకి బుల్డోజర్ వెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

అర్ధరాత్రి సమయంలో హాగ్ మార్కెట్ ప్రాంతంలోని టీఎంసీ న్యూమార్కెట్ యూనియన్ ఆఫీసు వద్దకు వచ్చిన కొందరు వ్యక్తులు.. బుల్డోజరుతో దాన్ని కూల్చేశారు. అత్యంత రద్దీ ప్రాంతంలో ఉన్నట్టుండి ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానిక దుకాణదారులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే తమ దుకాణాలు మూసేసి అక్కడినుంచి పారిపోయారు. ఈ ఘటనలో టీఎంసీ కార్యాలయం పూర్తిగా ధ్వంసం కావడం గమనార్హం.

బుల్డోజర్లు తీసుకొచ్చిన వారి చేతుల్లో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ జెండాలు కన్పించడం చర్చనీయాంశమైంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కూల్చివేత దృశ్యాలను టీఎంసీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ''బీజేపీ పరివర్తన్ మొదలైంది. ఈ మార్పు బుల్డోజర్‌తో వచ్చింది. బీజేపీ కార్యకర్తలు వీధుల్లోకి వెళ్లి దాడులకు పాల్పడేందుకు ఆ పార్టీ అధిష్టానం వారికి లైసెన్స్ ఇచ్చినట్లు ఉంది. ఈ రోజు దుకాణాలు, ఆఫీసులను కూలుస్తున్నారు. రేపు రాజకీయ ప్రత్యర్థులనూ వదిలిపెట్టరేమో..!'' అని టీఎంసీ మండిపడింది. కోల్‌కతాతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఘర్షణలు చెలరేగాయి. బిజోయ్‌గఢ్‌లో తృణమూల్ అభ్యర్థికి చెందిన కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ఆర్జీకర్ హత్యాచార బాధితురాలి తల్లి గెలిచిన పానిహటీలో తృణమూల్ కార్యాలయాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతను మోహరించాలని పేర్కొన్నారు. ఉద్రిక్తతలకు పాల్పడే వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు.

## ఐప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నాం

- సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

**లఖ్‌నవూ, మే 6:** రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ ప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. నిధుల కొరతే దీనికి కారణమని వెల్లడించారు. ఈ సంస్థ ఇటీవల పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో టీఎంసీకి సేవలందించింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే అఖిలేశ్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ''వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐప్యాక్‌తో గతంలో ఒప్పందం కుదుర్చుకున్నాం. వారు మాతో కొన్ని నెలలు పనిచేశారు. అయితే, నిధుల కొరతతో దాన్ని కొనసాగించలేకపోతున్నాం'' అని ఓ మీడియా సమావేశంలో అఖిలేశ్ యాదవ్ తెలిపారు. బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల ప్రభావంతో ఈ ఒప్పందం రద్దు చేసుకున్నారంటూ వచ్చిన ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. బెంగాల్లో ఎన్నికల నిర్వహణ తీరును ప్రశ్నిస్తూ.. దీన్ని సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా స్వీకరించాలని అఖిలేశ్ కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగ్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. బెంగాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు.. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల సమయంలో పునరావృతమయ్యే అవకాశం ఉందని, ఎన్నికల మాఫియా కలిసికట్టుగా పనిచేస్తుందని ఆరోపించారు.





## టెక్సాస్‌లో కాల్పులు.. ఇద్దరి మృతి

### ముగ్గురికి గాయాలు

**టెక్సాస్, మే 6:** అమెరికాలోని టెక్సాస్‌లో కాల్పుల ఘటన కలకలం రేపింది. కారోల్టన్‌లోని 'కె టౌన్ ప్లాజా' షాపింగ్ సెంటర్‌లో దుండగుడు కాల్పులు జరపడంతో ఇద్దరు మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వ్యాపార లావాదేవీల గురించి చర్చిస్తుండగా ఉద్దేశపూర్వకంగానే దుండగుడు కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## భారతీయ నౌక సిబ్బందికి పాక్ సాయం!

**ఇస్లామాబాద్, మే 6:** అరేబియా సముద్రంలో చిక్కుకు పోయిన భారతీయ నావికాసిబ్బందికి పాకిస్థాన్ నౌకాదళం మానవీయ సాయం అందించినట్టు తెలిసింది. ఈ సహాయ చర్యల్లో పాకిస్థాన్ సముద్ర భద్రతా సంస్థ పాల్గొన్నట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయని ''డాన్''పత్రిక వెల్లడించింది.



ముంబయిలోని సముద్ర సహాయ సమన్వయ కేంద్రం చేసిన అభ్యర్థన మేరకు ఆరుగురు భారతీయులను, ఒక ఇండొనేసియన్ జాతీయుణ్ని పీఎంఎస్‌ఏ కాపాడిందని పాక్ నౌకాదళం పేర్కొన్నట్టు పత్రిక వెల్లడించింది. ఒమన్ నుంచి భారత్ వైపు వెళ్తున్న ఎంవీ గౌతమ్ అనే నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని సిబ్బంది పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. భారత నౌకా సిబ్బందికి అత్యవసర సాయంగా పీఎంఎస్‌ఏ ఆహారం, ఔషధాలు, సాంకేతిక సాయం అందించిందని పత్రిక వెల్లడించింది.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**సూర్యాపేట, మే 06 (మనం ప్రతినిధి):** రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మార్కెటింగ్, అనుబంధ శాఖలు ఉద్యాన పట్టు పరిశ్రమ, పశు సమర్థక శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో మూడవ రోజు రైతులకు అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగు విధానాలు. ప్రభుత్వ పథకాలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు సాగు పెట్టుబడి కోసం రైతు భరోసా, అకాల మరణం సంభవిస్తే కుటుంబానికి అండగా రైతు భీమా పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించడంతో పాటు సన్న బియ్యం పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు. సూర్యాపేటలో నూతనంగా భూ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా ఏ భూమిలో ఏ పంట వేస్తే అధిక దిగుబడి వస్తుందో వ్యవసాయ అధికారులు సూచిస్తారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ మరియు ఖర్చు తగ్గింపులో భాగంగా నానో యూరియా వినియోగం పై రైతుల్లో అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు.ఒకే రకమైన పంటలు వేయకుండా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. రైతులను నిలువునా ముంచే నకిలీ విత్తనాల విక్రయదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్, పోలీసులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, రైతులు కూడా గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరు రైతు పండించే ఆహారం మీదనే ఆధారపడి జీవిస్తున్నారని, అందుకే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను, ప్రోత్సాహకాలను అందిస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూర్యాపేట మార్కెట్ లో మొక్కజొన్న పంట అమ్మకాలు చేసుకునేలా మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో వరితో పాటు రైతులకు లాభసాటి తెచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని, ఆయిల్ ఫామ్, కూరగాయల సాగుపై జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతుల కోసం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం రూ.5/- లకె భోజనం ఏర్పాటు చేసిన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీని కలెక్టర్ అభినందించారు. అనంతరం మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న ధాన్యానికి రూ.500బోనస్, సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులను ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిది అని కొనియాడారు. మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట మార్కెట్లో మామిడి మార్కెట్ ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేస్తున్నారని త్వరలోనే పేట మార్కెట్ లో మామిడి మార్కెట్ ప్రారంభం కాబోతున్నట్లు వెల్లడించారు సూర్యాపేటలో రూ.33కోట్లతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను కూరగాయల రైతుల కోసం రూ.31లక్షలతో మరమ్మతులు పూర్తి చేసి త్వరలోనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదిగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, జిల్లా సహకార అధికారి ప్రవీణ్ కుమార్, వెటర్నరీ డిడి శ్రీనివాస్, జిల్లా ఆర్టికల్చర్ అధికారి నాగయ్య, కెవికె సైంటిస్ట్ నరేష్ సెక్రెటరీ ముకురం ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

# ప్రమోషన్ బాధ్యతలు పెంచుతుంది



- ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలి
- జిల్లా ఎస్పీ కె నరసింహ

**సూర్యాపేట, మే 06 (మనం ప్రతినిధి):** ఆర్మడ్ రిజర్వ్ నందు అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న వెంకన్న, తిరుపతయ్య లు ఆర్ఎస్ఐ లుగా పదోన్నతి హెడ్ క్వార్టర్స్ నందు ఏఎస్ఐ గా పని చేస్తున్న రామకోటి ఎస్ఐ గా గరిడేపల్లి పీఎస్ నందు హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న వెంకటయ్య ఏఎస్ఐ గా ప్రమోషన్ పొందారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పి నరసింహ ప్రమోషన్ పొందిన పోలీసు అధికారులకు ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఉద్యోగోన్నతి తో పాటుగా బాధ్యతలు పెరుగుతాయని బాధ్యతలు కు అనుగుణంగా విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఎస్పీ సూచించారు. క్రమశిక్షణతో మెలగాలని, తోటి సిబ్బందిని గౌరవించాలని సమన్వయంతో ముందుకెళ్లాలని ఆరోగ్యం పట్ల, కుటుంబాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎస్పీ వెంట ఏఆర్. డీఎస్పీ నరసింహ చారి, ఆర్ ఐ. అశోక్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

# స్వీయ గణన గడువులో పూర్తి చేయాలి




**సూర్యాపేట, మే 06 (మనం ప్రతినిధి):** స్వీయ గణన గడువు ఈ నెల 10వరకు మాత్రమే సమయం ఉన్నందున, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వివరాలను నమోదు చేసుకుని ఈ బృహత్ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని సూర్యాపేట చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత పిలుపునిచ్చారు.స్వీయ గణన గడువు ఈ నెల 10వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, జిల్లాలో అవగాహన కార్యక్రమాలను వేగవంతం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జన గణన 2026'లో భాగంగా ఏర్పాటు చేసిన స్వీయ గణన గడువు ఈ నెల 10వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రంలో మారథాన్ ర్యాలీ నిర్వహించారు. మారథాన్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం చైర్ పర్సన్ మీడియాతో మాట్లాడుతూ ....స్వీయ గణన ద్వారా ప్రజలు తమ వివరాలను స్వయంగా, ఖచ్చితత్వంతో నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోపు ఆన్లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రతి కుటుంబం తమ వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా , ఆర్డీవో ఆర్. వేణు మాధవరావు, సిపివో ఎల్. కిషన్, సూర్యాపేట, సెన్సస్ జిల్లా ఇన్చార్జి ఇస్లావత్ హోబాలాల్, డీఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకట్ రమణ, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. హనుమంత రెడ్డి, సూర్యాపేట, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది,మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

- డ్రైవర్లతో ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ, మే 6 (మనం ప్రతినిధి ):** జిల్లాలో బారి వాహనాలు (లారీలు) కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాన్స్పోర్ట్ యాజమాన్యం మరియు డ్రైవర్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ గారు హాజరై రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు మరియు డ్రైవింగ్లో పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం నిర్లక్ష్యపు డ్రైవింగ్, అధిక వేగం, అలసటతో వాహనం నడపడం మరియు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా బారి వాహనాల ప్రమాదాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, అందువల్ల డ్రైవర్లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రతి డ్రైవర్ డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని ఎస్పీ గారు సూచించారు. అంటే మనం సురక్షితంగా డ్రైవ్ చేయడమే కాకుండా, ఇతర వాహనదారుల పొరపాట్లను ముందుగానే అంచనా వేసి ప్రమాదాలను నివారించే విధంగా అప్రమత్తంగా వాహనం నడపడం. ఇది ముఖ్యంగా లారీలు వంటి బారి వాహనాలు నడిపే డ్రైవర్లకు అత్యంత అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా అనుసరిస్తూ లైన్ డిసిప్లిన్ పాటిస్తూ,నిర్దేశిత వేగ పరిమితి పాటించాలని అన్నారు. వాహనాలు ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయకూడదని అన్నారు. అలాగే మెకానికల్ సమస్య, ఏ ఇతర సమస్యలు వచ్చి వాహనం రోడ్డుపై నిలిపివేయాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ కోన్స్, రిఫ్లెక్టర్ స్టిక్కర్లు, ఇండికేటర్లు ఉపయోగించి ఇతర వాహనదారులకు హెచ్చరిక ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జాతీయ రహదారి టోల్ ఫ్రీ నంబర్ 1033 కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే డ్రైవర్లు ప్రతి రెండు గంటలకు ఒకసారి విశ్రాంతి తీసుకోవాలని,ప్రయాణానికి ముందు వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయాలి (బ్రేకులు, టైర్లు, లైట్లు, ఇండికేటర్లు) వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలపకుండా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూడాలని అన్నారు.ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గారు హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు మరియు ప్రమాదాలు నియంత్రణకు బారి వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.ఈ సమయాలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి డ్రైవింగ్ అధిక వేగం అనధికారిక పార్కింగ్ ఇలాంటి కేసుల్లో లైసెన్సుల రద్దు, వాహనాల సీజ్ వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్పీ గారు పేర్కొన్నారు. బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహవీర్ పథకం కింద ప్రోత్సాహక నగదు అందజేయబడుతుందని తెలిపారు. మొదటిసారి - ₹25,000,రెండోసారి - ₹50,000,మూడోసారి - ₹1,00,000 ప్రోత్సాహకం అందుతుందని వెల్లడించారు. మీ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా ప్రతి డ్రైవర్ జాగ్రత్తగా వ్యవహరించాలి. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ సీఐ ఆదిరెడ్డి, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, డిటిఆర్బి రిటైర్డ్ సీఐ అంజయ్య, మిర్యాలగూడ లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చాంద్ పాషా, సెక్రటరీ రవీందర్ రావు, డ్రైవర్లు, ట్రాన్స్పోర్ట్ యాజమాన్యం మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# నూతన పీహెచ్ఎన్‌కు సన్మానం



**పెన్ పహాడ్ మే 06(మనం న్యూస్):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్ఎన్) గా ఆర్. పద్మ గత శుక్రవారం బాధ్యతలు స్వీకరించగా బుధవారం ఆశా డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి,ఆశా కార్యకర్తలకు ఆమెను పరిచయం చేసి శాలువాలతో ఘనంగా సన్మానించినారు అనంతరం పీహెచ్ఎన్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు ఆశా కార్యకర్తలు,ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి తాడూరి వెంకన్న, సూపర్వైజర్ పూలమ్మ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీవో యూనిట్ ఆఫీస్‌ను ప్రారంభించిన ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వాణి



**కోదాడ, మే6(మనం న్యూస్):** మండల పరిధిలోని గుడిబండలో ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ యూనిట్ ఆఫీస్ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వాణి హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలన్నీ సొంత భవనాల్లో పనిచేయాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీవో కార్యాలయాలకు స్థలాల ఎంపికతో పాటు భవనాల నిర్మాణం కూడా కొనసాగుతోందన్నారు. అందులో భాగంగా కోదాడ యూనిట్కు సంబంధించిన ఆర్టీవో కార్యాలయాన్ని గుడిబండలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇకపై కోదాడ పరిధిలోని అన్ని ఆర్టీవో సేవలు ఇక్కడి నుంచే అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని తమకు అవసరమైన సేవలను సులభంగా పొందాలని సూచించారు. అలాగే, కార్యాలయం త్వరగా పూర్తి కావడానికి కృషి చేసిన కోదాడ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జిలానిని ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో గుడిబండ గ్రామ సర్పంచి మందుల నాగయ్య, కోదాడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమాటి వరప్రసాద్ రెడ్డి, ఉప సర్పంచి ఇర్ల జయసింహ రెడ్డి, వార్డు మెంబెర్ లు ఖాజా గౌడ్, సక్రు, రమాదేవి, ప్రేమ్ చందు, సీఎం శ్రీను, మాదాసి నాగరాజు, కరుణాకర్, పవన్, రాందాస్, బాబు, జోసెఫ్, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడి



**సూర్యాపేట టౌన్, మే 6(మనం న్యూస్):** రైతులు సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి వస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రైతు వారము కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... తప్పకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించాలని, మట్టి నమూనాలను బట్టి, ఆ భూమిలో పోషక విలువలు ఏస్థాయిలో ఉన్నాయో, ఏ ఏ పంటలు పండించవచ్చో తెలుసుకోవచ్చని తెలిపారు. త్వరలో భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వరిలో 8 రకాల వంగడాలు ఉన్నాయని, వచ్చే సీజన్ లో రైతులు ఆయా రకాల వరి వంగడాలను సాగు చేయాలన్నారు. వరి ధాన్యం మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. పెసర, కంది, మినుములు, శనగలు వంటి పప్పుదినుసులను సాగు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంటపై దృష్టి సారించాలన్నారు. ఆధునిక యాంత్రిక శక్తిని వినియోగించుకోవాలన్నారు. వాణిజ్య పంటలపై బ్యాంకులు పెట్టుబడికి లోన్లు మంజూరు చేస్తున్నాయని తెలిపారు. జీలుగ, పచ్చిరొట్ట వంటి పంటను సాగుకు ముందు ఆ వ్యవసాయ భూమి లో కలియదున్నడం వలన ఎరువుల వాడకం తగ్గించవచ్చునని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ లో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించి మంచి ధరను పొందవచ్చునన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వస్తుందని, ఎస్సారెస్పీ కాలువ, 30 ఎకరాలలో వ్యవసాయ మార్కెట్ ను నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మామిడి విక్రయ కేంద్రాన్ని త్వరగా ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగయ్య, హార్టికల్చర్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, కెవి కె సైంటిస్టు డాక్టర్ నరేష్, జిల్లా వెటర్నరీ శాఖ అధికారి గోపి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఫసియోద్దిన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, హార్టికల్చర్ డివిజనల్ అధికారి స్వాతి, సమీకృత వ్యవసాయ రైతు వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి

- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ- మే 6( మనం ప్రతినిధి ):** ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 4 నుండి నిర్వహిస్తున్న రైతు వారోత్సవం లో భాగంగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో మూడవ రోజైన బుధవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ రైతు వేదికలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు కు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలు పండించాలని, ప్రత్యేకించి ఆయా భూములకు అనుకూలంగా ఉండే పంటలు పండిస్తే అధిక దిగుబడులతోపాటు, అధిక లాభాలు సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించిందని, ఆయా గ్రామాలలోని భూములకు అనుగుణంగా పంటలు వేసేందుకు జిల్లా యంత్రాంగం తరుపున అవసరమైతే ఒక డ్రైవ్ లా భూముల సారవంతం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. పండిన పంటకు పూర్తిస్థాయిలో లాభం వచ్చినప్పుడే రైతు అలాంటి పంటల వైపు మొగ్గు చూపుతాడని, మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందని అన్నారు. రైతులు ఒకే పంటను పండించకుండా అన్ని రకాల పంటలు పండించాలని, ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు, కొత్తగా వస్తున్న మార్పులపై దృష్టి సారించి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా పంటలు పండించాలని చెప్పారు. ముఖ్యంగా పంటల సాగుతో పాటు, పండించిన పంటల ద్వారా అధిక లాభాలు పొందేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, కోల్ స్టోరేజ్ వంటి సౌకర్యాలు వినియోగించుకొని పంటలు నిల్వ చేసుకోవడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని అన్నారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వరిలో ఎల్లప్పుడూ దొడ్డు బియ్యం కాకుండా, డిమాండ్ ఉన్న సన్న బియ్యం ఇతర రకాల ధాన్యాన్ని పండించాలని రైతులకు సూచించారు. రైతు సంక్షేమంలో భాగంగా తిప్పర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న భూమిని రైస్ మిల్ ఏర్పాటు చేసేందుకు సుముఖ వ్యక్తం చేసిన నేపథ్యంలో నాబార్డ్. అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలకు ఎలాంటి పాస్ పుస్తకాలు లేకుండా ఆన్లైన్లో భూభారతి వివరాల ఆధారంగా లోన్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సి ఈ ఓ ను ఆదేశించారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ధాన్యం సేకరణను త్వరలోనే పూర్తి చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. రైస్ మిల్లర్లు, లారీలు, వర్షం, తదితర కారణాలవల్ల కొనుగోలులో కొద్దిపాటి జాప్యం ఏర్పడిందని, మిల్లర్లు, హమాలీలు తదితర సమస్యలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ,ఆర్ అండ్ బి శాఖ మాత్యులతో మాట్లాడి చర్చించి సమస్యలన్నీ అధిగమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతంధాన్యం తరలించేందుకు 900 లారీలు ఏర్పాటు చేయడం జరిగిందని, కేవలం 20 రోజులలో 3 లక్షల ఇరవై వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ప్రతిరోజు ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్, సమీక్షలు నిర్వహిస్తున్నామని, ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని,ప్రస్తుతం మిల్లులలో అన్లోడింగ్ సమస్య లేదని తెలిపారు .నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సహకార శాఖ సొసైటీల ద్వారా అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, ధాన్యం కొనుగోలు పై రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రితో పాటు ,జిల్లా కలెక్టర్ ప్రతిరోజు సమీక్షిస్తున్నారని, వారం, పది రోజుల్లో దాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, రైతులు ఎల్లప్పుడూ వరినే సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి శాఖ ద్వారా అందించే పథకాల పై రైతులకు అవగాహన కల్పించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు నాగరత్నరాజు, సహదేవరెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, ఎల్డిఎం శ్రామిక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ పాల్గొన్నారు. జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

# సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించాలి

- ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వెంటనే షెడ్స్ ఏర్పాటు చేయాలి
- కమిషనర్ బి. శరత్ చంద్ర



**నల్లగొండ, మే 6( మనం ప్రతినిధి):** నగరంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించడానికి కృషి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర అధికారులకు సూచించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2026, సిటిజన్ ఫీడ్‌బ్యాక్, త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం,అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్లో అధిక సంఖ్యలో సిటిజన్ ఫీడ్బ్యాక్ నమోదు అయ్యేలా మెప్మా సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.ప్రజలకు ఫీడ్బ్యాక్ యొక్క ప్రాముఖ్యతను వివరించి, క్యూఆర్ కోడ్ మొబైల్ యాప్ ద్వారా ఫీడ్బ్యాక్ నమోదు చేసే విధానంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పరిసరాలను శానిటేషన్ సిబ్బంది పరిశుభ్రంగా ఉంచాలని,ఇంజినీరింగ్ శాఖ ద్వారా కనీస మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.వేసవి కాలంలో నగరంలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని తెలిపారు.వేసవి తీవ్రత దృష్ట్యా నగరంలోని ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్, జంక్షన్ల వద్ద ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా షెడ్లు వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. రాములు,అసిస్టెంట్ సిటీ ప్లానర్ జె.కృష్ణవేణి,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. అశోక్,అసిస్టెంట్ ఇంజినీర్ అసీమ్ బాబా,రెవెన్యూ ఆఫీసర్ జి. శివరామ్ రెడ్డి,వార్డు అధికారులు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి ప్రధాన లక్ష్యం

- ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- పేదల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశం
- ప్రజల అర్జీలను ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తున్నాం
- రాష్ట్ర పంచాయతీరాజ్, శాఖ మంత్రి సీతక్క



ఏటూరునాగరం మే 6, మనం మనం ప్రతినిధిః పేదల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ప్రధాన ఎజెండాగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజల అర్జీలను ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే ముఖ్య ఉద్దేశంతో, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక₹ లో భాగంగా బుధవారం ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామం లోని ఆశ్రమ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజా దర్బార్ దరఖాస్తు ఫామ్ ను రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి ఆవిష్కరించి, కొండాయి,దొడ్ల,మల్యాల,దొడ్ల కొత్తూరు, గోవిందరాజుల కాలనీ గ్రామాల ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఏటూరు నాగారం మండలం చిన్నబోయిన పల్లి గ్రామం లోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో చిన్నబోయినపల్లి, శివాపూర్, షాపల్లి గ్రామాల ప్రజల నుంచి మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ప్రధాన ఉద్దేశంతో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ములుగు జిల్లా లో వినూత్నంగా గ్రామాలలో ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వడివడిగా గ్రామాలలోని ప్రజల సమస్యలను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించుకుంటూ జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకునే ఫిర్యాదు దారుల కోసం ప్రత్యేకంగా దరఖాస్తు ఫారాన్ని రూపొందించడం జరిగిందని అందులో అర్జీదారులు తమ సమస్యలను తెలియజేయవచ్చని అన్నారు. కొండాయి గ్రామంలో అర్హులైన 115 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. జంపన్న వాగు ప్రవాహం ఒడ్డున ఎట్టి పరిస్థితుల్లో ఇండ్లను నిర్మించుకోకుండా సురక్షిత ప్రాంతాలలో శాశ్వత ప్రతిపాదికన ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. నూతన గ్రామపంచాయతీ పాలకవర్గం కొలువుదీరిన అనంతరం గ్రామాలలోని సమస్యలను పరిష్కరించడం కోసం నిధులు కేటాయిస్తున్నామని, గ్రామసభల ఆమోదం ద్వారానే ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి పనులకు నిధులను వెచ్చించాలని అన్నారు. ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో అనేకమంది ఫిర్యాదుదారులు ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నూతన పెన్షన్ల మంజూరు, అటవీ భూముల సమస్యలు గూర్చి అర్జీలు సమర్పిస్తున్నారని వాటన్నిటిని ప్రణాళిక బద్ధంగా సంబంధిత అధికారులతో సమగ్రంగా పరిశీలించి అర్హులైన జాబితా సిద్ధం చేస్తున్నామని, రెండవ విడతలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. జూన్ మాసంలో నూతన పెన్షన్లను అందించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తుందని స్పష్టం చేశారు. అటవీ భూముల ఎలు సమస్యలు తలెత్తుతున్న తరుణంలో త్వరలోనే అటవీశాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కరించే విధంగా విధివిధానాలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అడవులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని రాష్ట్రంలోనే అధిక అటవీ విస్తీర్ణంలో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ స్థానంలో రావడం గర్వకారణంగా ఉందని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను అధికారులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.ఈ సందర్భాల్లో జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తిన నేరుగా తమకు తెలియజేయవచ్చని సూచించారు. అధికారులు సమన్వయంతో శక్తి వంచనతో పని చేస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతి గ్రామానికి ప్రభుత్వ సేవలు నిరంతరాయంగా అందించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి 589/600 అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన ఏటూరు నాగారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన కోరం కున్నత్ కృష్ణ అనే విద్యార్థిని మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి శాలువతో సత్కరించి అభినందించారు. జిల్లాలోని అన్ని మండలాల యంసిసి కేంద్రాలకు స్వచ్ఛభారత్ మిషన్ నిదుల ద్వారా 10 కంప్యూటర్లు, స్కానర్, ప్రింటర్ లను, ఏటూరు నాగారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్,ఐటిడిఏ పిఓ లతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డిఓ వెంకటేష్, కొండాయి సర్పంచ్ ఆలం మానస, చిన్నబోయినపల్లి, షా పల్లి సర్పంచులు జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్,యంపిడిఓ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖ దిష్టిబొమ్మ దగ్ధం



భీమదేవరపల్లి, ఏప్రిల్ 6(మనం న్యూస్)ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను బిజెపి కార్యకర్తలు దగ్ధం చేశారు. బుధవారం మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్అంబేద్కర్ కూడలి వద్ద బిజెపి మండల పార్టీ అధ్యక్షులు శ్రీరామోజు ఆధ్వర్యంలో బిజెపి కార్యకర్తలు మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరాముని పై జైశ్రీరామ్ అని అంటే డబ్బులు రాలుతాయి అని అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ మంత్రి పదవికి అనర్హులని దేవాదాయ శాఖకు మంత్రిగా కొనసాగు వద్దు అని డిమాండ్ చేశారు. మంత్రి రాజకీయ లబ్ధి కోసమే అనుచిత వ్యాఖ్యలు చేసిహిందువుల మనోభావాలను గాయపరిచే విధంగా ఉన్నాయని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఆరాధ్య దైవంగా శ్రీరాముని భక్తి సోఫలికే నినాదాన్ని కించపరిచేలా మంత్రి మాట్లాడం హేయమైన చర్య అని నిరసనకారులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, మాజీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గండు సారయ్య, దొంగల వేణు ,పయ్యావుల రాజు ,కంకలసదానందం, ఐత సాయితేజ ,అంబిర్ కవిత, లక్కిరెడ్డి మల్లారెడ్డి ,ఆలేరు వికాస్ ,సింగం రాజేందర్ ,బైక్ అఖిల్, సాయి, వంశీ ,తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేటీఆర్ అహంకారపు మాటలు మానుకో



- సీఎంపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలి
- మంత్రి సీతక్క

ములుగు, మే 6(మనంప్రతినిధి)ః కేటీఆర్ అహంకారపు మాటలు మానుకోవాలని మంత్రి సీతక్క హితవు పలికారు.ములు జిల్లా పర్యటించిన ఆమె బుధవారం విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు. 'రైతులను బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ హయాంలో పూర్తి రుణమాఫీ జరగలేదు. నాలుగు విడతలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. కానీ, ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కేసీఆర్ పంట బోనస్ హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోంది. రైతు బంధు నిధుల్లో బీఆర్ఎస్ తీవ్ర జాప్యం చేసింది. మా ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసింది' అని మంత్రి సీతక్క తెలిపారు. 'ఫామ్ హౌస్ పాలనలో రైతులు నష్టపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం కట్టుబడి పనిచేస్తోంది. ప్రజల్లో తిరుగుతున్నాం.. ఫారిన్ టూర్లలో కాదు. సమ్మక్క-సారలమ్మ ఆలయంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారు. కమిషన్ల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్కు లేదు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి. లేకుంటే అదే ప్రజలు బుద్ధి చెప్తారు' అని సీతక్క వెల్లడించారు.

## ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

భీమదేవరపల్లి, ఏప్రిల్ 6 మనం న్యూస్ః గట్ల నర్సింగాపూర్ గ్రామంలో ప్రమాదవశాస్తు వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రచ్చ సంపత్ (51) గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద ట్రాక్టర్ తో వరిగడ్డి కట్టలు కడుతున్న క్రమంలో కట్టే మిషన్ సరిచేస్తున్న క్రమంలో తడి చెయ్యి మిషన్ లో పడి పూర్తిగా భుజం వరకు తెగి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల అయినా మృతుడి భార్య రక్షరమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న అని తెలిపారు.



## గ్రామాలలో నిరంతర విద్యుత్ సౌకర్యం

- చిన్నబోయినపల్లిలో 11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం
- మంత్రి సీతక్క




ములుగు, మే 6(మనంప్రతినిధి)ః ఏజెన్సీ గ్రామాలలో నిరంతర విద్యుత్ సౌకర్యం ఉండేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామంలో రూ.1.46 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన 11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలోని అన్ని గ్రామాలకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సౌకర్యం అందించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి అనసూయ సీతక్క తెలిపారు. చిన్నబోయినపల్లి 1.46 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఉప విద్యుత్ కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని ఈ ఉపకేంద్రం ద్వారా సుమారు చుట్టుపక్కల 14 గిరిజన గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఎలక్ట్రిసిటీ చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ ఈ బిక్షపతి, డి ఈ నాగేశ్వరరావు స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్చార్జ్ సర్పంచ్‌గా మాట్లాడి కుమార్



భీమదేవరపల్లి మే 6 మనం న్యూస్: ముత్తారం గ్రామానికి ఇంచార్జ్ సర్పంచిగా మాట్ల హరికుమార్ నియమితులయ్యారు. బుధవారం రోజున హనుమకొండజిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఏడాది ఆగస్టు 10 వరకు ఇంచార్జ్ సర్పంచ్ గా కొనసాగడానికి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచ సెక్రటరీ మారుపాక శరత్ వార్డు సభ్యులు అయిన పోర్నం దుల నవిత, దండేపల్లి శిరీష మేక నరేష్ కొర్ర తిరుపతి కడారి చింటూ దున్నపోనిత రేణిగుంట్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా వ్యాప్తంగా 41 కోట్లతో 12 విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటు

- జాకారంలో 3.76 కోట్లతో నిర్మించిన 11 కె.వి. ఉప కేంద్రం ప్రారంభం
- మంత్రి సీతక్క

ములుగు, మే 6 ,మనం ప్రతినిధిః ములుగు జిల్లా వ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ.41 కోట్ల నిధులతో 12 విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ములుగు గట్టమ్మ రూ.3.76 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన 11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రూ.41 కోట్లతో 12 విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు.

ఇప్పటికే 3 ఉప కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాగా, మరో ఉప కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మిగిలిన ఉప కేంద్రాలు వివిధ దశల నిర్మాణ పనులలో ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, టీఎస్ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ఈ బిక్షపతి, డీఈ నాగేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సదస్సు సభకు తరలిన రవినాయక్

హనుమకొండ , మే 6(మనంన్యూస్)ః కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ రవి నాయక్ మరియు మాజీ ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గణిపాక విజయ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు లావుడియా రాజు నాయక్, గ్రామ అధ్యక్షుడు జన్ను రాజు , యూత్ అధ్యక్షుడు గాదె శివ కుమార్ సీనియర్ నాయకులు గాదె మొగిలి, సయ్యద్ ఖలీల్, మాదాసి కళ్యాణ్,జన్ను కృష్ణ, గాదె క్రాంతి , మోహన్ నాయక్ , అజ్మీర వెంకటేష్, బిక్షపతి, రమేష్,ఎండీ .ఖలీల్ ,భాస్కర్, రమేష్, బ్రహ్మచారి ,జానీ, రంజిత్, యూత్ నాయకులు ప్రశాంత్ సాయి, బిట్టు, సుమన్ , మహిళా నాయకు విజయ,రజియా తదితరులు పాల్గొన్నారు.




## కొండాయి వంతెన నిర్మాణ పనులలో వేగం పెంచాలి




- మంత్రి సీతక్క

ములుగు, మే 6, మనం ప్రతినిధిః కొండాయి వంతెన నిర్మాణ పనులలో వేగం పెంచాలని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏటూరు నాగారం మండలం 16.50 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న కొండాయి వంతెన నిర్మాణ పనుల పురోగతిని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కొండాయి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రభుత్వం 16.50 కోట్ల రూపాయల నిధులతో వంతెన నిర్మిస్తుందని తెలిపారు. యుద్ధ ప్రతిపాదికన వంతెన నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. జూన్ - జూలై నాటికి ప్రజలకు వంతెన అందుబాటులో ఉండే విధంగా చూడాలని, వరద ప్రవాహం గ్రామం లోకి పోటెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండాయి గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తా



- సత్వరం పనులు పూర్తి చేయ్యాలని అధికారులను ఆదేశిస్తా
- మంత్రి సీతక్క

ములుగు మే06 : మనం ప్రతినిధిః ములుగు జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణ పనులు మొదలు పెడితే నిధులు మంజూరు చేసే బాధ్యత తనదేనని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ -శిశు సంక్షేమ, మంచినీటి సరఫరా శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలోని నాయకులు భవన నిర్మాణం చేపట్టాలని, ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడం శోచనీయమని, భవన నిర్మాణం కోసం 2024 శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించకపోవడం బాధాకరమై విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో పాత్రికేయులలో సమైక్యత లేకపోవడం గ్రూపులు ఏర్పాటు చేసుకోవడం వలన భవన నిర్మాణ పనులలో జాప్యం జరుగుతున్నదని, ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జాక్ జిల్లా కన్వీనర్ గుర్రపు శ్రీధర్, గౌరవ అధ్యక్షులు జినుకల ప్రభాకర్, కో-కన్వీనర్ ఎనగందుల కొమురయ్య, సంఘ నాయకులు రంజిత్, చల్ల గురుకుల రాజు వర్ధన్, పాత్రికేయులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు, తరలింపు వేగంగా పూర్తి చేయాలి

- ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తరలించాలి
- ప్రత్యామ్నాయంగా వాహనాలు సమకూర్చాలి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్




రాజన్న సిరిసిల్ల, మే -06(మనం ప్రతినిధి )ః కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపు వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణా తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులు, లారీల ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం సేకరణ చేస్తున్నామని వెల్లడించారు. నెమ్మదిగా అన్ లోడ్ చేస్తున్న రైస్ మిల్లులలకు నోటీసులు జారీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న హమాలీలకు అదనంగా తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కొనుగోళ్లలో వేగం పెంచాలని, ధాన్యం రవాణా చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ గోదాముల్లో ధాన్యం దిగుమతికి ఏర్పాట్లు తెలిపారు. లారీల కొరత లేకుండా చూడాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రవాణా కొరత లేకుండా వ్యాన్లు, ట్రాక్టర్లు ఉపయోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మిల్లులకు దగ్గరగా ఉన్న కొనుగోలు కేంద్రాలకు ట్రాక్టర్ లతో రవాణా చేసేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ గీత, డీఏఓ అఫ్జల్ బేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.





# సంజు కొడితే.. గెలిచినట్లే!

**6, 7, 9, 7, 11.. చెన్నైసూపర్ కింగ్స్‌కు ఓటమి**

**115, 48, 101, 87 నాటౌట్.. చెన్నైసూపర్ కింగ్స్ కు అద్భుత విజయాలు**



పైన పేర్కొన్న గణాంకాలు సంజు శాంసన్ వి. అతడు నిలబడి కొడితే సీఎస్కేకు విజయం ఖాయమనే భరోసా అభిమానుల్లో కల్పించాడు. మూడుసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ లో చెన్నై 10 మ్యాచులు ఆడింది. ఐదు విజయాలు నమోదు చేసింది. మరో ఐదింట్లో ఓడిపోయింది. ఆ గెలిచిన ఐదు మ్యాచుల్లో సంజు శాంసన్ ప్రభావం ఏపాటిదో అతడి స్కోర్లను చూస్తేనే అర్థమవుతోంది.

తొలుత ప్లేఆఫ్స్ రేసులో చాలా వెనుకబడిన సీఎస్కే.. ఇప్పుడు ముందుకు దూసుకురావడంలో సంజుదే కీలక పాత్ర. మరోవైపు కెప్టెన్ రుతురాజ్ అప్పుడప్పుడు మెరుస్తున్నా.. నిలకడ కొరవడింది. కానీ, మొదట్లో ఇబ్బందిపడిన సంజు మాత్రం నిలదొక్కుకున్నాక వెనక్కి తిరిగిచూడలేదు. ఇప్పటికే రెండు సెంచరీలు చేసిన సంజు.. మూడోది చేసే అవకాశం వచ్చినా జట్టు కోసం కాస్త వెనక్కి తగ్గాడు. తాజాగా దిల్లీపై విజయం అనంతరం అతడు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ నూ మెప్పించడం గమనార్హం.

**'సంజు' అని..**

ఈ సీజన్ లో దిల్లీపై సీఎస్కే రెండు మ్యాచుల్లోనూ గెలిచింది. సంజు శాంసన్ సెంచరీ, హాఫ్ సెంచరీ చేసి సత్తా చాటాడు. ఇక్కడ మరో శతకం చేసే అవకాశం వచ్చింది. అయితే, మరో ఎండ్ లో కార్తిక్ శర్మ దూకుడుగా ఆడేశాడు. దీంతో 87 పరుగులతో సంజు అజేయంగా నిలిచాడు. ఈ సందర్భంగా వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ఆకట్టుకుంది. శతకం చేయడం స్పెషలే అయినా.. అందుకోసం తాను స్వార్థపరుడిగా మారాల్సి వచ్చేదని బదులిచ్చాడు. దీనిపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. అందరూ 'అన్న (చేట)' అని పిలుస్తుంటారు కదా.. ఆ పిలుపు ఎలా ఉంటుందనే ప్రశ్నకు బదులిచ్చాడు. తనకు చేట అని కాకుండా.. 'సంజు'గా పిలుపించుకోవడమే ఇష్టమని వినమ్రంగా సమాధానం ఇచ్చాడు.

**ఎక్కడా తొందరపడకుండా..**

తొలి మూడు మ్యాచుల్లో సంజు శాంసన్ కేవలం సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యాడు. దీంతో అతడిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. భారీ మొత్తం వెచ్చించినా సరైన ప్రతిఫలం ఇవ్వడం లేదని విమర్శించారు. కానీ, గత టీ20 ప్రపంచ కప్ లోనూ సంజు నుంచి ఇలాంటి 'స్లో స్టార్ట్'ను చూశాం. ఆ తర్వాత చెలరేగిపోయి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా నిలిచాడు. ఇప్పుడు కూడా సేమ్ ఫార్ములా. భారీ ప్రైస్ ట్యాగ్ తోపాటు ధోని వారసుడంటూ వచ్చిన ఒత్తిడిని అధిగమించాడు. ఇంతకుముందు వచ్చీ రాగానే భారీ షాట్లకు పోయి వికెట్ సమర్పించేవాడు. ఇప్పుడు అలా కాదు.. పరిస్థితిని బట్టి ఆడటం మొదలుపెట్టాడు. ఓ సందర్భంలో 'గేమ్ ఎలా ఆడాలో పరిస్థితులే నేర్పిస్తాయి' అని సంజు అన్న మాటలు గుర్తున్నాయి కదా.

ఐపీఎల్ లో సీఎస్కే తరపున ఇప్పటివరకూ ఎవరూ రెండు సెంచరీలు చేయలేదు. కానీ, సంజు ఆ ఘనతను సాధించాడు. క్రీజ్ లో తాను ఉండటం ఎంత ముఖ్యమో తెలుసుకున్నాడు. ఒక్కసారి కుదురుకున్నాక బ్యాట్ ను ఝుళిపించేశాడు. మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్లపై ఇప్పటివరకు దురుసుగా వ్యవహరించిన దాఖలాలూ లేవు. మైదానంలోనే కాదు.. డగౌట్ లోనూ ప్రశాంతంగానే ఉంటాడు.

**ఆ నాలుగు మ్యాచుల్లోనూ..**

ప్రస్తుత సీజన్ లో సీఎస్కే మరో నాలుగు మ్యాచులు ఆడాల్సిఉంది. ప్రస్తుతం 10 పాయింట్లతో పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ప్లేఆఫ్స్ కు చేరుకోవాలంటే కచ్చితంగా మూడు మ్యాచుల్లో విజయం సాధించాలి. అన్నీ గెలిస్తే మాత్రం నాకౌట్ బెర్తు ఖాయమయ్యే అవకాశాలు ఎక్కువ. ఇలా జరగాలంటే సంజుశాంసన్ ఇదే ఆటతీరు ప్రదర్శించాలి. ఎంఎస్ ధోని ఈ సీజన్ లో కనీసం ఒక్క మ్యాచ్ లోనైనా ఆడతాడా? అంటే చెప్పలేని పరిస్థితి. కాబట్టే సంజు పైనే సీఎస్కే భారం.

# ఐపీఎల్ 2026.. మూడు వేదికల్లో ప్లేఆఫ్స్..

ఐపీఎల్ 2026 సీజన్ కు సంబంధించి ప్లేఆఫ్స్ మ్యాచుల వేదికలను బీసీసీఐ ఖరారు చేసింది. అలాగే ఫైనల్ కు బెంగళూరు కాకుండా.. అహ్మదాబాద్ ను వేదికగా చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. ఈసారి దక్షిణ భారతంలో ఒక్క నాకౌట్ మ్యాచ్ నిర్వహణకు కూడా అవకాశం లేకుండా పోయింది. ప్లేఆఫ్స్ మ్యాచులకు రెండు వేదికలను మాత్రమే కేటాయించింది. మే 24తో లీగ్ స్టేజ్ లు ముగుస్తాయి. ఆ తర్వాత రెండు రోజుల అనంతరం నాకౌట్ మ్యాచులు మొదలవుతాయి. ''ఫైనల్ మ్యాచ్ కు బెంగళూరును తొలుత నిర్ణయించారు. అయితే, మా నిర్దేశిత మార్గదర్శకాలు, నిబంధనల పరిధికి లోబడేలా లోకల్ అసోసియేషన్, అధికారుల రిక్వైర్ మెంట్స్ లేకపోవడంతో వేదికను మార్చడం జరిగింది'' అని బీసీసీఐ పేర్కొంది.

పాయింట్ల పట్టికలో టాప్-4లో ఉన్న జట్లు ప్లేఆఫ్స్ లో తలపడతాయి. తొలి రెండు స్థానాల్లో జట్లు మొదటి క్వాలిఫయర్స్ ఆడతాయి. అందులో గెలిచిన జట్టు ఫైనల్కు చేరుకుంటుంది. ఓడిన టీమ్ కు మరో అవకాశం ఉంది. మూడు, నాలుగు స్థానాల్లో ఉండే జట్లు ఎలిమినేటర్ లో తలపడతాయి. అందులో గెలిచిన జట్టు రెండో క్వాలిఫయర్ కు అర్హత సాధిస్తుంది. క్వాలిఫయర్ -1లో ఓడిన జట్టుతో ఎలిమినేటర్ విజేత ఢీకొడుతోంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ కు చేరుకుంటుంది. అక్కడ ఎవరైతే విజయం సాధిస్తారో ఐపీఎల్ కప్పు వారి సొంతమవుతుంది.



**ఇదీ షెడ్యూల్**

- క్వాలిఫయర్ -1 : ధర్మశాల వేదికగా మే 26న
- ఎలిమినేటర్: చండీగఢ్ వేదికగా మే 27న
- క్వాలిఫయర్ -2 : చండీగఢ్ వేదికగా మే 29న
- ఫైనల్ మ్యాచ్: అహ్మదాబాద్లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మే 31న

# మొత్తానికి నితిన్ మరో కొత్త సినిమా



మన టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా సాలిడ్ హిట్ కొట్టాలని చూస్తున్నాడు. తన గత చిత్రం తమ్ముడు డిజప్పాయింట్ చేయడంతో నెక్స్ట్ సినిమాల కోసం అభిమానులు ఎదురు చూడడం మధ్యలో నితిన్ పలు సినిమాలు వదిలేయడం కూడా జరిగిపోయాయి. అయితే ఫైనల్ గా నితిన్ నుంచి ఈ ఏడాదిలో రెండో కొత్త సినిమా ఇప్పుడు అధికారికంగా ముహూర్త కార్యక్రమాలతో లాంఛ్ అయ్యింది.

నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా సోమశేఖర్, నారి సిరిస్వాద అనే కొత్త దర్శకులతో నేడు మేకర్స్ ముహూర్త కార్యక్రమాలతో సినిమాని లాంచ్ చేసిన ఫోటోలు ఇపుడు వైరల్ గా మారాయి. అంతే కాకుండా యంగ్ హీరోయిన్ రితికా నాయక్ కూడా ఇందులో పాల్గొనడంతో హీరోయిన్ ఎవరు అనేది కూడా తేలిపోయింది. ఇక ఈ చిత్రాన్ని మేకర్స్ ఈ మే రెండో వారం నుంచే పట్టాలెక్కినున్నట్టు కూడా ఖరారు చేశారు. మరి ఇంత గ్యాప్ తర్వాత నితిన్ ఎలాంటి ట్రీట్ అందిస్తాడో చూడాలి.

# దేవిశ్రీకి జోడీగా మృణాల్ ఠాకూర్!



సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ప్రధాన పాత్రలో 'బలగం' ఫేం వేణు ఎల్దండి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఎల్లమ్మ'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఓ తాజా అప్ డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలో దేవిశ్రీకి జోడీగా సాయి పల్లవి, కీర్తి సురేశ్ నటిస్తారని జోరుగా ప్రచారం జరిగింది. ఇప్పుడు తెర పైకి మృణాల్ పేరు వచ్చింది. ప్రస్తుతం మేకర్స్ ఆమెతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఆమె ఈ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, సినిమాపై అంచనాలు మరింత పెరుగుతాయి. మొదట 'ఎల్లమ్మ'లో హీరోలుగా నాని, నితిన్ పేర్లు వినిపించినప్పటికీ, చివరికి ఈ విభిన్నమైన పాత్ర కోసం డీఎస్పీని ఎంపిక చేశారు. ఈ సినిమాకు దేవిశ్రీనే స్వరాలు అందిస్తున్నారు. ఇప్పటికే సంక్రాంతికి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. త్వరలోనే ఇందులోని హీరోయిన్ కు సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది.



MAA
MOVIE ARTISTES' ASSOCIATION

## పేరు మార్చి నటులను మోసం చేస్తూ..
# ఖండించిన 'మా'

తమ అసోసియేషన్ పేరులో మార్పులు చేసి, కొందరు మోసాలకు పాల్పడుతున్నారన్నది తమ దృష్టికి వచ్చిందన్న మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్.. ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. **AP MAA, MAA AP** పేర్లతో కన్ఫ్యూజ్ చేస్తూ నటులు, ప్రజలను మోసగాళ్లు తప్పుదోవ పట్టిస్తున్నట్లు పేర్కొంది. 'మా'తో సంబంధం ఉందని నమ్మిస్తూ.. నటుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారనే సమాచారం కూడా అందిందని తెలిపింది. ఇలాంటి సంఘటనలు ఎదురైతే హైదరాబాద్ లోని ఫిల్మ్నగర్ 'మా' ఆఫీసులో తెలియజేయాలని కోరింది. తమకు ఎలాంటి అనుబంధ అసోసియేషన్లు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# 'లెనిన్'.. ఆసక్తిగా భాగ్యశ్రీ స్పెషల్ పోస్టర్



'లెనిన్'లో అఖిల్ తో కలిసి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. నేడు భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్ తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్ లో ఆమె పౌరాణిక లుక్ లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్ తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్ ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్'చిత్రం రూపుదిద్దుకొంటోంది.

# క్రేజీ సీక్వెల్‌లో ఆలియా



కల్ట్ క్లాసిక్ చిత్రం 'తుంబాడ్' సీక్వెల్ లో బాలీవుడ్ స్టార్ ఆలియా భట్ కీలక పాత్ర పోషించనుంది. స్క్రిప్ట్ నచ్చడంతో ఆమె ఈ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సుమారు 20 రోజుల పాటు షూటింగ్ లో పాల్గొననున్న ఆమె పాత్ర, కథలో వచ్చే మేజర్ ట్విస్ట్ కు కేంద్రబిందువుగా ఉంటుందని సమాచారం.

ఈ పాత్ర కేవలం రెండో భాగానికే కాకుండా, 'తుంబాడ్ 3'కి కూడా పునాది వేయనుంది. మేకర్స్ ఈ చిత్రాన్ని దాదాపు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు. ఆలియా రాకతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి, ఇది ట్రేడ్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

ప్రస్తుతం ఆలియా 'లవ్ అండ్ వార్' షూటింగ్లో బిజీగా ఉండగా, త్వరలోనే తుంబాడ్ సెట్స్లో చేరనుంది. మొదటి భాగం రీ-రిలీజ్ సాధించిన విజయం, ఇప్పుడు ఆలియా క్రేజ్ తోడవ్వడం ఈ సీక్వెల్కు ప్లస్ పాయింట్ కానుంది. అయితే, కథలో ఒరిజినల్ సినిమా ఆత్మను కోల్పోకుండా ఉండటమే దీని విజయానికి కీలకం.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.